Pubilshed from Tirupathi

PRGI NO : APTEL/25/A2316

# ప్రజాభూమి

ఇది ప్రజల వెలుగు

Prajabhoomi Telugu Daily

www.prajabhoomi.com




| తిరుపతి TIRUPATHI | సంపుటి : 01 | సంచిక : 240 | ఆదివారం | మే 17, 2026 | ఎడిటర్ : రామమోహన్ రెడ్డి అంకిరెడ్డిపల్లి | పేజీలు : 12 | వెల : 3 రూ |
|---|---|---|---|---|---|---|---|
| | Vol.No : 01 | Issue No : 240 | Sunday | 17 MAY 2026 | Editor : Ankireddypalle Ramamohan Reddy | Pages 12 | Rs 3/- |

Published From : Vijayawada, Anathapuramu, Eluru, Kadapa, Kakiknada, Tirupathi Circulated at Andharapradesh & Telangana



## గొడ్డలి పార్టీతో అభివృద్ధి గాడి తప్పింది

- పెట్టుబడులతో ఉత్తరాంధ్రకే వలసలు
- మూడేళ్లలో నేరడి బ్యారేజ్ పూర్తి
- స్వచ్ఛాంధ్ర కోసం ఆపరేషన్ క్లీన్ స్వీప్
- స్వచ్ఛ పథంతో రహదారుల శుభ్రం
- స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో సీఎం చంద్రబాబు
- జిల్లాలోనూ 4 వాహనాల కాన్వాయ్‌తో సీఎం ప్రయాణం

2 లో

ప్రజాభూమి ప్రతినిధి, నరసన్నపేట :

గొడ్డలి పార్టీతో ఉత్తరాంధ్ర అభివృద్ధిపై వేటు పడిందని, ప్రజా ప్రభుత్వంలో ఉత్తరాంధ్ర నుంచి వలసలు వెళ్లకుండా ఉత్తరాంధ్రకే వలసలు వచ్చేలా సంకల్పం తీసుకున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఉత్తరాంధ్ర తో పాటు రాయల సీమ కోస్తా జిల్లాల అభ్యర్థులు అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. రోజుకు ఓ డ్రామాతో వచ్చే వారితో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మళ్లీ రాష్ట్రంలో వైకుంఠపాళి వద్దని హెచ్చరించారు. శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటలోని తామ్రపల్లిలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు. ప్రజా వేదిక సభలో పాల్గొని ముఖ్యమంత్రి ప్రసంగించారు.

"రాష్ట్రం పరిశుభ్రంగా ఉండాలనే సంకల్పంతోనే స్వచ్ఛాంధ్ర కార్యక్రమం చేపట్టాం. స్వచ్ఛపథం కార్యక్రమంలో భాగంగా గ్రామీణ అర్బన్ ప్రాంతాల్లోని రహదారులను శుభ్రపరిచేలా ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది. ప్రతినెలా ఒకటో తేదీన పేదల సేవలో కార్యక్రమంలో పాల్గొని అర్హులకు స్వయంగా పింఛన్లు అందించడం ద్వారా ఎంతో ఆనందం కలుగుతోంది. పేదరికం లేని సమాజం , ప్రజల జీవన ప్రమాణాలు పెంచాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం. జనాభా తగ్గుదల ఆందోళన కలిగిస్తోంది. పిల్లలే సంపద అని పిలుపునిస్తున్నాను. అందుకే మూడు, నాలుగో సంతానానికి ప్రోత్సాహకం అందించేలా నిర్ణయం తీసుకుంటున్నాం. మూడో సంతానానికి 30 వేలు, నాలుగో సంతానానికి 40 వేలు ప్రోత్సాహకం ఇస్తాం. అంగన్వాడీలను బలోపేతం చేస్తున్నాం. తల్లికి వందనం కింద రూ. 15 వేలు ఆర్థిక సాయం చేస్తున్నాం. రీ సర్వే ద్వారా భూముల రికార్డులు ప్రక్షాళన చేస్తున్నాం. ఎవరూ ట్యాంపరింగ్ చేసే అవకాశం లేకుండా ఆధునిక టెక్నాలజీని వినియోగించి పట్టదారు పాస్ పుస్తకాలను ముద్రించి అందిస్తున్నాం. 2027 మార్చి నాటికి రాష్ట్రంలో ఎక్కడా భూ తగాదాలు లేకుండా చేసే బాధ్యత తీసుకుంటామని" ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు.



## తమిళనాడు మంత్రివర్గంలో శాఖల కేటాయింపు

విజయ్ చేతిలోనే హోం శాఖ

ప్రజాభూమి ప్రతినిధి, చెన్నై: తమిళనాడులో నూతన మంత్రివర్గంలోని మంత్రుల శాఖలను సిఎం విజయ్ శనివారం అధికారికంగా ప్రకటిం చారు. రాష్ట్ర పాలనలో తనదైన ముద్ర వేసేలా పలువురు నేతలకు కీలక బాధ్యతలను అప్పగించారు. ముఖ్యమంత్రి విజయ్ అత్యంత కీలకమైన హోం శాఖతో పాటు ప్రత్యేక కార్యక్రమాల అమలు వంటి కీలక శాఖలను తన వద్దే ఉంచుకున్నారు.

వివరాలు 2లో..

## హమాస్ సాయుధ విభాగం చీఫ్ మృతి

- ఇజ్రాయిల్ సైన్యం



ప్రజాభూమి ప్రతినిధి, జెరూసలెం : హమాస్ సాయుధ విభాగం చీఫ్ ఎజ్జెడిన్ అల్ హదద్ మరణించినట్లు ఇజ్రాయిల్ సైన్యం శనివారం ప్రకటించింది. శుక్రవారం గాజా నగర ప్రాంతంలో జరిపిన వైమానిక దాడిలో

- మిగతా 2లో..



## ఘోర ప్రమాదం

ఐదుగురు కూలీలు మృతి

ప్రజాభూమి ప్రతినిధి, కాకినాడ రూరల్ : కూలీల ఆటోను టిప్పర్ ఢీకొట్టడంతో ఐదుగురు మృతి చెందిన ఘటన శనివారం తెల్లవారుజామున కాకినాడలో జరిగింది. కాకినాడ రూరల్ మండలం చీడిగ బైపాస్ వద్ద ఉపాధి హామీ పనులకు వెళుతున్న కూలీల ఆటోను వేగంగా వచ్చిన టిప్పర్ ఢీకొట్టడంతో

2 పేజీలో..

## ఇది విశ్వాస ఘాతుకానికి నిదర్శనం

సిఎం రేవంత్ రెడ్డి

ప్రజాభూమి ప్రతినిధి, తెలంగాణ :

'ఇది విశ్వాస ఘాతుకానికి నిదర్శనం- అని సిఎం రేవంత్ రెడ్డి పోస్టు చేశారు. కేంద్ర ప్రభుత్వం తాజాగా తీసుకున్న పెట్రోల్, డీజిల్ ధరల పెంపు నిర్ణయంపై సిఎం రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నరేంద్ర మోడి నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం ఏమాత్రం సమర్థనీయం కాదని అన్నారు. ఇంధన ధరల పెంపు అనేక రంగాలపై ప్రతికూల ప్రభావం చూపుతుందని, నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి సామాన్య ప్రజలపై తీవ్ర భారం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'లో పోస్టు చేశారు.



మోడి ప్రభుత్వ అసమర్థ పాలన, అనాలోచిత విధానాల కారణంగా దేశ ఆర్థిక వ్యవస్థ దెబ్బతిందని విమర్శించారు. 'ఆత్మనిర్భర్' అనే నినాదం కేవలం ఓట్లు సాధించడానికి ఉపయోగించిన రాజకీయ నినాదమే తప్ప, ఆశించిన ఫలితాలు ఇచ్చిన విధానం కాదని వ్యాఖ్యానించారు. చిన్న, మధ్య తరహా పరిశ్రమలు తీవ్రంగా నష్టపోయాయని, యువతకు ఉపాధి

2 పేజీలో..



## నా వ్యాఖ్యలను వక్రీకరించారు

- జస్టిస్ సూర్యకాంత్
- నకిలీ, బోగస్ డిగ్రీలతో వృత్తిలోకి ప్రవేశించే వారిని ఉద్దేశించి వ్యాఖ్యానించినట్లు వెల్లడి
- కొందరు తన వ్యాఖ్యలను వక్రీకరించారని ఆవేదన
- భారత యువత పట్ల తాను గర్వపడుతున్నానన్న జస్టిస్ సూర్యకాంత్

న్యూఢిల్లీ : కొంతమందిని తాను పరాన్నజీవులుగా లేదా బొద్దింకలుగా పోల్చిన వివాదంపై భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ స్పందించారు.

- మిగతా 2లో..

## ఘోర రోడ్డు ప్రమాదంలో నలుగురు మహిళలు దుర్మరణం..

### నారా లోకేష్ దిగ్భ్రాంతి

- కాకినాడ పరిధిలోని కొవ్వూరు బ్రిడ్జి సమీపంలో ప్రమాదం
- రోడ్డు దాటుతున్న మహిళలను ఢీకొట్టిన టిప్పర్
- అక్కడికక్కడే నలుగురు మహిళలు దుర్మరణం
- వాహనాన్ని వదిలేసి పరారైన డ్రైవర్
- మహిళల మృతి తనను కలచివేసిందన్న లోకేష్

ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి : కాకినాడ రూరల్ పరిధిలోని కొవ్వూరు బ్రిడ్జి సమీపంలో ఈ ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. చీడగ గ్రామానికి చెందిన కొందరు మహిళా కూలీలు ఉపాధి హామీ పనుల కోసం కాలినడకన రోడ్డు దాటుతుండగా, కాకినాడ వైపు నుంచి అత్యంత వేగంగా, నిర్లక్ష్యంగా దూసుకొచ్చిన ఒక టిప్పర్ లారీ వారిని బలంగా ఢీకొట్టింది.



ఈ ఘోర ప్రమాదంలో తీవ్ర రక్తస్రావమై సత్యవతి, కృష్ణవేణి, చిట్టెమ్మ, అన్నవరం అనే నలుగురు మహిళా కూలీలు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు.

ప్రమాదం జరిగిన వెంటనే టిప్పర్ లారీ డ్రైవర్ వాహనాన్ని అక్కడే వదిలేసి పరారయ్యాడు. ఈ ఘోర రోడ్డు ప్రమాద ఘటనపై రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

- మిగతా 2లో..



## థాయిలాండ్‌లో ఘోర ప్రమాదం

- 8మంది మృతి

ప్రజాభూమి ప్రతినిధి, బ్యాంకాక్ : థాయిలాండ్ లో శనివారం ఘోర ప్రమాదం జరిగింది. రైలు ఢీకొనడం వలన చెలరేగిన మంటలు బస్సును, సమీపంలోని వాహనాలను చుట్టుముట్టాయి. ఈ ప్రమాదంలో రు 8మంది మరణించగా, మరో 25 మంది గాయపడ్డారని అధికారులు తెలిపారు.

వివరాలు 2లో..

## ప్లాస్టిక్ వాడకంతో అనర్థాలు

ప్రజలు ప్లాస్టిక్‌కు దూరంగా ఉండాలి : స్వాచ్ఛాంధ్ర కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర

ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నం : ప్లాస్టిక్ రహిత రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కంకణం కట్టుకున్నారని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. శనివారం మచిలీపట్నం రైతు బజార్ ప్రాంగణంలో జరిగిన స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని పక్కా ప్రణాళికతో నిర్వహించాలన్నారు. గ్రామ వార్డు, సచివాలయాల వారీగా ప్రతినెల మూడో శనివారం ఈ కార్యక్రమం తప్పనిసరిగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ప్లాస్టిక్ వాడకం వల్ల జరిగే అనర్థాలను, ప్రజలకు జరిగే నష్టాలను వివరించాలని.. దీనిపై సమగ్ర అవగాహనతో ముందుకు వెళ్లాలని అధికారులకు మంత్రి కొల్లు రవీంద్ర సూచించారు.

- మిగతా 2లో..



## బంగారం ధరల్లో పతనం

- పదిగ్రాములపై రూ.980ల మేర తగ్గిన ధర
- రూపాయి మారకం కనిష్టానికి చేరిక

న్యూఢిల్లీ : భారత్‌లో శనివారం కూడా బంగారం, వెండి ధరల్లో పతనం కనిపించింది. అంతర్జాతీయ అనిశ్చితులకు తోడు యూఎస్ డెట్ సెక్యూరిటీలపై రాబడులు పెరగడం, డాలర్ బలపడుతున్న నేపథ్యంలో దేశంలో బంగారం, వెండి ధరలు మరోసారి తగ్గాయి. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, శనివారం ఉదయం 10.00 గంటల సమయంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర శుక్రవారంతో పోలిస్తే రూ.980ల మేర తగ్గి రూ.1,56,930కు పడిపోయింది

- మిగతా 2లో..



# గొడ్డలి పార్టీతో అభివృద్ధి గాడి తప్పింది

**సగర్వంగా స్వచ్ఛత వైపు అడుగులు**

"17 నెలలుగా మనం స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించుకుంటున్నాం. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని ఒక ఉద్యమంలా చేస్తున్నాం. పరిసరాలు, పరిశుభ్రత విషయంలో మార్పు కనిపిస్తోంది. మన ఆలోచనలు స్వచ్ఛంగా ఉంటే మన అలవాట్లు మారుతాయి. అలవాట్లు మారితే సమాజం మారుతుంది. సమాజం మారితేనే స్వచ్ఛాంధ్ర సాకారం అవుతుంది. 2047 నాటికి స్వర్ణాంధ్ర సాధన లక్ష్యంతో పనిచేస్తున్నాం. ప్రస్తుతం మన తలసరి ఆదాయం రూ. 3 లక్షలు. దీన్ని రాబోయే 22 ఏళ్లలో రూ. 54 లక్షలు చేయాలనే దిశగా ముందుకెళ్తున్నాం. పేదలను ఆర్థికంగా ఆదుకునేందుకు పీ4 తీసుకొచ్చాం. పైన ఉండే 10 శాతం మంది కింద ఉండే 20 శాతం మందిని ఆర్థికంగా పైకి తీసుకు రావాలి. 2047 నాటికి మనదేశం ప్రపంచంలోనే నెంబర్ వన్ గా నిలుస్తుంది. ఆ దిశగా ప్రదాని మోదీ ముందుకెళ్తున్నారని" సీఎం చంద్రబాబు అన్నారు.

**జూన్ నాటికి 100 శాతం చెత్త శుభ్రం**

"ప్రజా ప్రభుత్వం వచ్చాక 86 లక్షల మెట్రిక్ టన్నుల లెగసీ వేస్ట్ క్లియర్ చేశాం. ఈ 23 నెలల్లో 121 లక్షల టన్నుల చెత్త తొలగించాం. జూన్ కల్లా వందశాతం పూర్తవుతుంది. డోర్ టు డోర్ కలెక్షన్ ద్వారా ప్రతీ రోజూ పట్టణాల్లో 7,527 టన్నులు, గ్రామాల్లో 1,430 టన్నుల చెత్తను సేకరిస్తున్నాం. రూ.1,254 కోట్లతో 6 వేస్ట్ టూ ఎనర్జీ ప్రాజెక్టులు 6 సీబీజీ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నాం. చెత్త ప్రాసెసింగ్ కోసం రూ.603 కోట్లతో 107 ఇంటిగ్రేటెడ్ ప్లాంట్లు సిద్ధం చేస్తున్నాం. ఇవి అక్టోబర్ నాటికి అందుబాటులోకి వస్తే డంపింగ్ యార్డ్ అనేదే ఉండదు. నెట్ జీరో క్యాంపస్ లో భాగంగా హాస్టళ్ల నుంచి వ్యర్థాలు లేకుండా ప్రణాళిక చేశాం, ప్రభుత్వ కార్యాలయాలపై సోలార్ విద్యుత్ ఉత్పత్తి, కిచెన్ గార్డెన్స్, రెయిన్ వాటర్ హార్వెస్టింగ్, కంపోస్టింగ్, వాటర్ టెస్ట్ కిట్స్, ముస్తాబు వంటివి అమలుచేస్తున్నాం. ప్రతీ నెలా 10, 20 తేదీల్లో ఈ-వ్యర్థాలు సేకరిస్తున్నాం. చెత్త సేకరణకు 200 ఈ-ఆటోలు వినియోగిస్తున్నాం. ఈ నెలాఖరు కల్లా కొత్తగా 5,000 పుష్ కార్ట్స్, 12,000 ట్రై సైకిళ్లు తెస్తాం. రాష్ట్రంలో ప్రస్తుతం 31.33 శాతం గ్రీన్ కవర్ ఉంది. 2030 నాటికి 37 శాతానికి, 2047 కల్లా 50 శాతానికి పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. 633 స్వచ్ఛ రథాలతో రోజుకు 125 టన్నుల పొడి చెత్త సేకరిస్తున్నాం. ఇప్పటికి 47 లక్షల కేజీల చెత్తను సేకరించి రూ.8 కోట్ల విలువైన నిత్యావసరాలు ఇచ్చారు. కొత్తగా గ్రీన్ షాప్స్ ను ప్రారంభించాం. ప్రజలే అక్కడికి వెళ్లి ప్లాస్టిక్, ఐరన్ వంటి వ్యర్థాలను ఇచ్చి...వస్తువులు పొందవచ్చు. వావ్ పేరుతో పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. నెల్లూరు, అనకాపల్లి, చిత్తూరులలో సర్క్యులర్ ఎకానమీ పార్కులు నిర్మిస్తున్నాం. నేటి నుంచి 50 ప్లాస్టిక్ వ్యర్థ యూనిట్లు వస్తుండగా మరో 210 యూనిట్లు జూన్‌కి అందుబాటులోకి తెస్తామని" ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు.

**రాష్ట్రానికి మరిన్ని అవార్డులు రావాలి**

"మన ఇల్లే కాదు. చుట్టూ ఉన్న పరిసరాలు, మన రహదారులను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలి. గతంలో నేను పాదయాత్ర చేసినప్పుడు గ్రామాలు, పట్టణాల్లో ఊరి చివర్లో ఎక్కడ చూసినా చెత్తా-చెదారం కనిపించేది. అప్పుడే రహదారులను పరిశుభ్రంగా మార్చాలని నిర్ణయించుకున్నాను. అందుకే స్వచ్ఛపథం పేరిట ఇప్పుడు కార్యక్రమం చేపడుతున్నాం. రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో మురుగునీరు వ్యర్థాలు పొంగిపొర్లకుండా మ్యాజిక్ డ్రైన్లను నిర్మిస్తున్నాం. రాష్ట్రంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ను కూడా మనం వాడకుండా నిషేధం విధించుకోవాల్సిన అవసరం ఉంది. అత్యుత్తమ విధానాలను అనుసరించటం ద్వారా రాష్ట్రంలోని పంచాయితీలకు జాతీయ స్థాయి అవార్డులు వచ్చాయి. కందులవారి పల్లె, చిత్తూరు జిల్లా, కాణిపాకం ఇలా వేర్వేరు పంచాయితీలు అత్యుత్తమ పనితీరు కనబరచడం ప్రభుత్వం చేస్తోన్న కృషికి దక్కిన ఫలితంగా భావిస్తున్నాను. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నిర్వహించే ఈ శాఖలో జాతీయ స్థాయిలో 8 అవార్డులు వచ్చాయి. మరిన్ని అవార్డులను రాష్ట్రంలోని గ్రామాలు, పట్టణాలు దక్కించు కోవాలని కోరుతున్నాను. ఇవాల్టి నుంచి ఆపరేషన్ క్లీన్ స్వీప్ రాష్ట్రంలో ప్రారంభం అవుతుంది. నెలరోజు పాటు ఈ ప్రత్యేక డ్రైవ్ చేపడతాం. నాలుగు వారాల పాటు అధికారులు, ప్రజాప్రతినిధులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొనాలి. మున్సిపాలిటీలు కూడా స్వచ్ఛతా అవార్డులు దక్కించుకుంటాయని ఆకాంక్షిస్తున్నానని" ముఖ్యమంత్రి తెలిపారు.

**అధికారం అంటే విధ్వంసం కాదు**

"శ్రీకాకుళం నుంచి అనంతపురం వరకూ అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం. 23 నెలల్లో రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు కుదిరాయి. ప్రతి ఒప్పందం కార్యరూపం దాల్చుతోంది. వీటి ద్వారా రానున్న రోజుల్లో 24 లక్షల ఉద్యోగాలు వస్తాయి. నిన్ననే పుట్టపర్తిలో డిఫెన్స్ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసుకున్నాం. కేవలం 36 రోజుల్లో అనుమతులు తెచ్చి, భూములు ఇచ్చి దేశం గర్వించే డిఫెన్స్ ప్రాజెక్టును సాధించడం మన ప్రభుత్వ సామర్థ్యానికి నిదర్శనం. అధికారం అంటే విధ్వంసం కాదు. ప్రజల జీవితాలు మార్చే అవకాశం అని నమ్ముతున్నాం. అధికారం అంటే విశాఖకు గూగుల్ తేవడం, అమరావతికి క్వాంటం తేవడం, సీమకు డిఫెన్స్ ప్రాజెక్టు తేవడం. ఇకపై ఉత్తరాంధ్ర నుంచి వలసలు కాదు..ఉత్తరాంధ్రకే వలస వస్తారు దేశంలో ఎక్కడికి పోయినా శ్రీకాకుళం కాలనీ ఉంటుంది. పోర్టులు, ఎయిర్ పోర్టులు, ఐటీ కంపెనీలు, డాటా సెంటర్లతో ఉత్తరాంధ్ర దశ మారుతుంది. సాగునీటి ప్రాజెక్టులతో దిశ మారుతుంది. దాదాపు రూ.1 లక్ష కోట్లతో రిలయన్స్ కూడా డేటా సెంటర్ ఏర్పాటుకు ముందుకు వచ్చింది. టీసీఎస్, కాగ్నిజెంట్ వంటి ఐటీ కంపెనీలతో పాటు ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్, రెన్యూపవర్ గ్రీన్ ఎనర్జీ వంటి ప్రముఖ కంపెనీలు ఉత్తరాంధ్రలో అడుగుపెట్టాయి. జూలైలో భోగాపురం ఎయిర్ పోర్టు ప్రారంభించుకుంటున్నాం. శ్రీకాకుళం జిల్లాకు మరో ఎయిర్ పోర్టు తీసుకువస్తాం. పలాసలో కొత్త ఎయిర్ పోర్ట్ ను కూడా త్వరలో నిర్మాణం చేపడతాం. మూలపేట పోర్టు ఉత్తరాంధ్రకే అడ్వాంటేజ్ అవుతుంది. ఈ ఏడాదిలోనే మూలపేట పోర్టును ప్రారంభిస్తాం". అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు.

**శ్రీకాకుళం జిల్లాను అభివృద్ధి చేస్తాం**

"రాష్ట్రంలో ఎక్కువ జాతీయ రహదారి, సముద్ర తీరం, నీరు, తెలివైన ప్రజలు ఉండే జిల్లా శ్రీకాకుళం. కానీ అభివృద్ధిలో వెనుకుంది. శ్రీకాకుళం జిల్లాను అభివృద్ధి చేస్తాం. ఉత్తరాంధ్ర ఇన్ఫ్రా ప్రాజెక్టులతో పాటు సాగునీటి ప్రాజెక్టులపైనా దృష్టిపెట్టాం. ఉత్తరాంధ్రలో ఏ ప్రాజెక్టును ఎప్పటికల్లా పూర్తి చేయాలో ఇరిగేషన్ క్యాలెండర్ ఇచ్చాం. మద్దువలస స్టేజ్-2 జనవరి 2027, హిరమండలం ఎత్తిపోతల పథకం ఏప్రిల్ 2027, వంశధార ఫేజ్-2 స్టేజ్-2 (హిరమండలం రిజర్వాయర్) జూలై 2027, తోటపల్లి డిస్ట్రిబ్యూటరీస్ జూలై 2027, జంఝావతి రిజర్వాయర్ ప్రాజెక్ట్ డిసెంబర్ 2027 నాటికి పూర్తి చేయాలన్న లక్ష్యంతో పనులు చేస్తున్నాం. ఈ ప్రాంత ప్రజల చిరకాల కోరిక నేరడి బ్యారేజ్ కు అడ్డంకులు తొలగి కేంద్రం నుంచి అనుమతులు సాధించాం. నవంబర్‌లో శంకుస్థాపన చేస్తాం. రాబోయే మూడేళ్లలో నేరేడి ప్రాజెక్టు పూర్తిచేస్తామని" ముఖ్యమంత్రి తెలిపారు.

**గొడ్డలి పార్టీతో అప్రమత్తంగా ఉండాలి**

"ప్రపంచంలో తెలుగువారు అగ్రస్థానంలో ఉండాలని, దేశంలో ఏపీ నెంబర్ వన్ స్టేట్ కావాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం. ప్రజలాంతా ఆలోచించాలి. 23 నెలల క్రితం వరకు ఉత్తరాంధ్రలో ఏమీ లేవు. నాటి పాలనలో ఎక్కడ చూసినా ప్రభుత్వ టెర్రరిజం, కబ్జాలు, బెదిరింపులు, కేసులు, అరాచకాలే. అచ్చెన్నాయుడు లాంటి నేతల్ని అక్రమ కేసుల్లో ఇరికించి అరెస్ట్ చేశారు. గడిచిన ఐదేళ్లలో ప్రజల్లో అశాంతి, అలజడి, అభద్రత నెలకొంది. ఎవరి ఆస్తి ఎప్పుడు కబ్జా చేస్తారో తెలీని పరిస్థితి. అనేక వనరులున్నప్పటికీ గొడ్డలి పార్టీతో ఉత్తరాంధ్ర అభివృద్ధికి వేటు పడింది. అన్నింటినీ సరిచేసి ఏపీకి మళ్లీ బ్రాండ్ క్రియేట్ చేశాం. గొడ్డలి పార్టీ నాయకులు కులాలు, మతాలు, ప్రాంతాలు మధ్య చిచ్చు పెడతారు. సోషల్ మీడియాలో అసత్య ప్రచారంతో వ్యక్తిత్వ హననం చేస్తున్నారు. నేషనల్ క్రైమ్ బ్యూరో నివేదిక ప్రకారం దేశంలో ఫేక్ న్యూస్ ప్రచారం చేసే రాష్ట్రాల్లో ఏపీ 2వ స్థానంలో ఉందంటే గొడ్డలి పార్టీనే కారణం. పంపకాల్లో తేడాలు వస్తే సొంత వాళ్లను చంపేసి మళ్లీ మాపై బురద వేస్తారు. సొంత బాబాయ్ ని చంపి ఆ నేరం నాపై మోపారు. గొడ్డలి ప్లస్ అంటూ కొత్త నాటకాలతో వస్తారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఏదైనా ఒక పిలుపునిస్తే పాటించడంలో ఉత్తరాంధ్ర వాళ్లు ముందుంటారు. హుద్ హుద్ సమయంలో దీపావళి టపాసులు వద్దు అని చెపితే...చిన్న క్రాకర్ కూడా కాల్చలేదు. అదీ మీ నిబద్దత"అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు.

**ప్రధాని సూచనలు పాటిద్దాం**

"యుద్ధ ప్రభావం కారణంగా ప్రధాని మోదీ చేసిన సూచనలను బాధ్యత గల పౌరులుగా అందరం పాటించి దేశానికి సహకరిద్దాం. వర్క్ ఫ్రం హోం అలవాటు చేసుకుని వీలైనంతవరకూ ఇంట్లో నుంచే పనిచేద్దాం. బంగారం కొనడం తగ్గిద్దాం. పబ్లిక్ ట్రాన్స్ పోర్ట్ లోనే ప్రయాణిద్దాం. వంట నూనెల వాడకం తగ్గిద్దాం. ప్రకృతి సేద్యాన్ని ప్రోత్సహిద్దాం. మేడిన్ ఆంధ్రా, మేడిన్ ఇండియా బ్రాండ్లను కొనుగోలు చేద్దాం. టూరిజం కోసం విదేశీ పర్యటనల కంటే ఏపీ లోని పర్యాటక ప్రాంతాలకు వెళ్ళాలి"అని ముఖ్యమంత్రి ప్రజలకు పిలుపునిచ్చారు. జిల్లా పర్యటనలో పొదుపు చర్యల్లో భాగంగా సీఎం నాలుగు వాహనాల కాన్వాయ్ లో మాత్రమే ప్రయాణించారు. శ్రీకాకుళం జిల్లా, నరసన్నపేట నియోజకవర్గ అభివృద్ధి నివేదికను సీఎం చంద్రబాబు ప్రజలకు చదివి వినిపించారు. వివిధ శాఖల పనితీరును ప్రజలకు వివరించారు. నియోజకవర్గ పరిధిలోని రాజులచెరువు ఆధునీకరణకు నిధులు మంజూరు చేస్తామని, ఎన్ హెచ్ 5 నుంచి నరసన్నపేట పట్టణ పరిధిలో రూ. 15 కోట్లు వ్యయంతో రహదారి నిర్మాణం చేపడతామని, కింజరాపు ఎర్రన్నాయుడు చిల్డ్రన్ పార్క్ ఏర్పాటు చేస్తామని , శ్రీముఖ లింగం ఆలయ ఉత్సవాలను ప్రభుత్వం తరపున అధికారికంగా నిర్వహిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చారు. అనంతరం ప్రజా వేదిక వద్ద ఏర్పాటు చేసిన స్టాళ్లను సీఎం తిలకించారు. అక్కడ సీతంపేట ఐటీడీఏ ఆధ్వర్యంలో గిరిజనులు ప్రత్యేకంగా తయారు చేసిన సవర ఆర్ట్ ఓవర్ కోటు ను ముఖ్యమంత్రి ధరించారు. పోలీసులు ఏర్పాటు చేసిన హెల్మెట్ బ్యాంక్ ను చూసి సీఎం అభినందించారు. హెల్మెట్ ధరించి అక్కడే ఉన్న బుల్లెట్ వాహనం అధిరోహించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు అచ్చెన్నాయుడు, కొండపల్లి శ్రీనివాస్, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## సంపాదకీయం

### ఆర్థిక కార్యాచరణ అత్యవసరం !

నాలుగు రాష్ట్రాలఅసెంబ్లీ ఎన్నికలు ముగిశాక బిజెపిలో కనిపించినంత ఆనందం మిగతా పార్టీల్లో కనిపించలేదు. కేరళలో అధికారం దక్కించుకున్నా కూడా కాంగ్రెస్ లో అంతటి ఆనందం కనిపించలేదు. బెంగాల్ దక్కడంతో బిజెపిలో ఎక్కడలేని ఆనందం, ఉత్సాహం కనిపించింది. ఆ ఆనందాన్ని ప్రజలతో పంచుకునేందుకు బిజెపి సిద్ధంగా లేదు. ఎందుకంటే పెట్రో,డీజిల్ ధరలు పెంచడం, ఆర్థిక వ్యవస్థ రోజురోజుకూ కుదేలవ్వడంతో ప్రజల్లో ఒకింత నిరాసక్తి కనిపిస్తోంది. కొత్తగా రెండు రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలోకి వచ్చింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ ఆనందంలో ఉండగానే దేశ ఆర్థిక వ్యవస్థ తీవ్ర కష్టనష్టాల నెదుర్కొంటున్న వాస్తవాన్ని గుర్తించారు. హైదరాబాద్ పర్యటనలో ఆయన చేసిన వ్యాఖ్యలు రానున్న ముప్పను ముందే గమనించి చేసిన హెచ్చరికగా గుర్తించాలి. ఈ క్రమంలో ఒక్క బంగారం దిగుమతులే కాకుండా దేశీయ వ్యవసాయ రంగాన్ని దెబ్బతీస్తున్న ఆహార దిగుమతులను కూడా నిలిపి వేయడం మంచిదని ప్రధాని ఎంత త్వరగా గుర్తిస్తే అంత మంచిది. ఆర్థిక వ్యవస్థ రానున్న రోజుల్లో మరింత బలహీనం కానుందన్న కఠోర సత్యాన్ని మోడీ ఒప్పుకున్నారు. ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు చేసిన తప్పలకు ప్రజలు త్యాగాలు చేయాలని ప్రధానమంత్రి పిలుసపునిస్తున్నట్లుగా ఉంది. అందువల్ల రాజకీయ నాయకులకు సంబంధించి విప్లవాత్మక మార్పులు తీసుకుని వస్తే తప్ప సంక్షోభాన్ని గట్టెక్కలేమని ప్రధాని మోడీ గుర్తించడం లేదు. ఇరాన్‌పై అమెరికా,ఇజ్రాయెల్ సంయుక్త దాడులతో మొదలు పెట్టిన యుద్ధం ప్రారంభమై ఈ నెలాఖరుకు మూడు నెలలు పూర్తవుతాయి. ఫిబ్రవరి 28న మొదలైన ఈ యుద్ధం ఇప్పట్లో ముగస్తుందనడానికి లేదు. ట్రంప్ రోజుకో మాట మాట్లాడుతున్నారు. ఆయన తీరు చూస్తుంటే యుద్ధం ఆగిపోయే సూచనలు కానరావడం లేదు. పశ్చిమాసియాలోని దేశాలన్నీ ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఆ యుద్ధంలో పాల్గొంటూనే ఉన్నాయి. ఈ క్రమంలో చమురు సరఫరా నిలిచి పోయింది. హోర్ముజ్ జలసంధి వద్ద అమెరికా ,ఇరాన్‌లు పట్టుబిగించాయి. బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 107 డాలర్లుగా ఉన్నది; రూపాయి మారకం విలువ డాలర్‌కు రూ.96కు చేరువలో ఉన్నది. రూపాయి విలువ ఎన్నడూ ఇంతగా పతనం కాలేదు. నిత్యం దాని ధర పతనం అవుతూనే ఉంది. దీనికి కారణం ఇబ్బడిముబ్బడిగా దిగుమతులే కారణమని చెప్పనక్కరలేదు. విదేశీ మారక నిల్వలు తగ్గిపోతున్నాయి. అధికారికంగా వినియోగ ధరల సూచీ ద్రవ్యోల్బణం 3.5శాతం కాగా ఆహార ద్రవ్యోల్బణం 4.33శాతంగా ఉంది. గృహావసరాల ఎల్‌పీజీ సిలిండర్ ధర రూ.913 కాగా కమర్షియల్ సిలిండర్ ధర రూ.3077 నుంచి రూ.3237 దాకా ఉంటోంది; డబ్ల్యూపీఐ ద్రవ్యోల్బణం 8.3శాతంగా ఉంది. ఇవన్నీ కూడా మన ఆర్థిక దౌర్బల్యాన్ని సూచిస్తున్నాయి. నేరుగా ఇవన్నీ ప్రజలపై తీవ్ర ప్రభావం చూపుతున్నవని గుర్తించాలి. దీనిని తట్టుకుని నిలబడేందుకు ధరలు పెంచడం మార్గం కాదు. ప్రజల్లో కొనుగోలు శక్తి పెరగడానికి చర్యలు తీసుకోవడం లేదు. దేశీయంగా ఆహార వస్తువులను ప్రజలకు నేరుగా, చౌకగా అందించే ప్రణాళికలు చేయడం లేదు. తెలుగు రాష్ట్రాలను తీసుకుంటే ఇక్కడ వరి, మిర్చి, శనగ,మక్కజొన్న తదితర పంటలు విపరీతంగా పండుతున్నాయి. ఇవి పండిస్తున్న రైతులకు గిట్టుబాటు ధరలు దక్కడం లేదు. అలాగే కొనుగోలుదారులకు సరసమైన ధరలకు వస్తువులు దక్కడం లేదు. ఈ వ్యత్యాసాన్ని ప్రభుత్వాలు గుర్తించడం లేదు. బంగారం దిగుమతులను నిలిపివేయడంతో పాటే ఇతర నిత్యవాసరాల దిగుమతులను కూడా నిలిపివేయాలి. దేశీయంగా పండుతునున్న పంటలకు పోటీగా వస్తున్న ఆహారా ధాన్యాల దగుమతులపై ఆంక్షలు విధించాలి. అలాగే మనవద్ద గోదాముల్లో మూలుగుతున్న ఆహార ధాన్యాలను ఉచితంగా కాకుండా ప్రజలకు సరసమైన ధరలకు అందించాలి. అలాగే అన్ని విషయాలలోను పొదుపు పాటించి తీరాలి. ఇంధన వినియోగం, వంటనూనెలు, ఎరువులు మొదలైన వాటి వినియోగంలో పొదుపు అవసరమే. అందుకోసం అనవసర దిగుమతులను పూర్తిగా నిరోధించాలి. అనినింటికి మించి ప్రజాప్రతినిధుల దుబారాలపై ఆంక్షలు విధించాలి. జీతభత్యాలు, ఉచిత పథకాలపైనా కొంతకాలం ఆంక్షలు విధించాలి. ఈ విషయంలో పాలకులు ముఖ్యంగా ప్రధాని మోడీ ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఉంది. అడ్డూ అదుపూ లేకుండా ఇంధన వినియోగానికి కారణ మవుతున్న కాన్వాయ్‌లను రద్దు చేయాలి. దేశ ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు విదేశీ మారకద్రవ్యం నిల్వలను మళ్లీ సమృద్ధం చేయడానికి కఠిన చర్యలు అవలంబిం చాల్సిందే. ఇవన్నీకూడా ఎమర్జెన్సీ కింద అమలు కావాలి. రూపాయి మారకం రేటును స్థిరీకరించకుంటే మన విదేశీమారక నిల్వలు హరించకు పోతాయి. అందుకోసం రూపాయి మారకం రేటు స్థిరపరచేందుకు అసవరమైన చర్యలను తక్షణం అమలు చేయాలి. దేశ ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సమిష్టి నిర్ణయాలు అవసరం. ఆర్థిక నిపుణులతో చర్చించాలి. క్షేత్రస్థాయిలో ప్రజల నుంచి సూచనలు సలహాలు తీసుకోవాలి. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి కఠిన చర్యలకు ఉపక్రమించాలి. తక్షణ ప్రాతిపదికన చేపట్టవలసిన చర్యలపై సలహాలు ఇచ్చేందుకు తలపండిన ఆర్థికవేత్త నేతృత్వంలో ఒక నిపుణుల బృందాన్ని ఏర్పాటు చేయాలి. ఇలా గ్రామాల నుంచి పట్టణాల వరకు నిరంతరంగా అభిప్రాయాలను సేకరించి, క్రోడీకరించాలి. మన దేశ వనరులు, వినియోగం, దిగుమతులను విశ్లేషించాలి. ఎక్కడ ఖర్చులు తగ్గించవచ్చో అన్నది ప్రజలతో పాటు, మేధావుల నుంచి సూచనలు స్వీకరించాలి. అప్పడే మనకు ఒక పరిష్కారం దొరుకుతుంది. అంతే తప్ప కాన్వాయ్‌లలో ఒకటి రెండు కార్లను తగ్గించడం వల్ల దేశ ఆర్థిక వ్యవస్థ చక్కబడదని ప్రధాని మోడీ త్వరగా గుర్తిస్తే మంచిది.

# 'ఇది విశ్వాస ఘాతుకానికి నిదర్శనం

భద్రత లేకుండా పోయిందని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. రైతుల ఆదాయాలను రెట్టింపు చేస్తామని ఇచ్చిన హామీ అమలు కాలేదని, అది కేవలం మాటలకే పరిమితమైందన్నారు. గత పదేళ్లుగా రూపాయి విలువ క్రమంగా పడిపోతూ వచ్చిందని, ప్రస్తుతం ఆ పరిస్థితి మరింత తీవ్రమైందని పేర్కొన్నారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో ఇరాన్ -- ఇజ్రాయిల్ యుద్ధాన్ని సాకుగా చూపించి పెట్రోల్, డీజిల్ ధరలు పెంచడం సామాన్యుల నడ్డి విరిచే చర్యగా అభివర్ణించారు. ప్రపంచంలో భారత్‌ను మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలిపామని గొప్పలు చెప్పుకుంటున్న మోడి ప్రభుత్వం.. ఇప్పుడు ధరల పెంపును ఎలా సమర్థించుకుంటుందని ప్రశ్నించారు. ఇటీవల నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతంలో జరిగిన ఎన్నికల ముందు "పెట్రోలియం ఉత్పత్తుల ధరలు పెంచబోమని కేంద్ర ప్రభుత్వం పదేపదే ప్రకటించిందని గుర్తు చేశారు. అయితే ఎన్నికల ఫలితాలు వచ్చిన పది రోజులు కూడా గడవకముందే లీటరుకు రూ.3 కుపైగా ధరలు పెంచడం ప్రజల విశ్వాసాన్ని ద్రోహం చేయడమేనని మండిపడ్డారు. కేవలం ఓట్ల కోసం,ఎన్నికల విజయాల కోసం మోడి అబద్ధాలు చెబుతున్నారని ప్రజలు భావిస్తున్నారని, ఇది విశ్వాస ఘాతుకానికి నిదర్శనమని విమర్శించారు. చివరగా కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని సిఎం రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు.

## హమాస్ సాయుధ విభాగం చీఫ్ మృతి

ఎజ్జెడిన్ అల్ హదద్ మరణించినట్లు ఐడిఎఫ్ , ఐఎస్ ఎ (షిన్ బెట్ దేశీయ భద్రతా సంస్థ) ప్రకటించింది. అక్టోబర్ 7న ఇజ్రాయిల్ పై దాడికి ప్రణాళిక రచించిన హమాస్ సైనిక విభాగంలోని చివరి సీనియర్ కమాండర్లలో హదాద్ ఒకరని సైన్యం ఆరోపించింది. గాజా నగరంలోని ఒక అపార్ట్ మెంట్, పౌర వాహనంపై శుక్రవారం ఇజ్రాయిల్ జరిపిన దాడిలో హదాద్ మరణించారని ఇద్దరు హమాస్ అధికారులు మీడియాకు తెలిపారు.

# ప్లాస్టిక్ వాడకంతో అనర్థాలు

రాష్ట్రంలో ఆర్టీసీ బస్సుల ప్రైవేటీకరణ ప్రస్తుత పరిస్థితుల్లో తప్పనిసరి అని ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు అన్నారు. ప్రభుత్వం ఎలక్ట్రిక్ బస్సుల కొనుగోలుకు సబ్సిడీ ఇస్తున్నప్పటికీ.. ఒక్కో బస్సు ధర సుమారు రూ.1.60 కోట్ల నుంచి రూ. 1.70 కోట్ల వరకు ఉందన్నారు. ?ఇంత పెద్ద మొత్తంలో నిధులు వెచ్చించి బస్సులను కొనుగోలు చేయడం ప్రస్తుతానికి ఆర్టీసీకి, ప్రభుత్వానికి సాధ్యం కాని పనిగా చెప్పుకొచ్చారు. దీనికి బదులుగా బస్సులను ప్రైవేట్ ఆపరేటర్లకు అప్పగిస్తే.. వారే పెట్టుబడులు పెట్టి బస్సులను నడుపుతారన్నారు. దీనివల్ల ఆర్టీసీపై అదనపు ఆర్థిక భారం తగ్గుతుందని తెలిపారు. ూష్ట్రంలో సుమారు 10 వేల బస్సులు నడుస్తున్నాయని ఆర్టీసీ ఛైర్మన్ తెలిపారు. వాటన్నింటి స్థానంలో ఎలక్ట్రిక్ బస్సులను తీసుకురావాలంటే దాదాపు రూ.15 వేల కోట్లు అవసరమని చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడం వల్ల ఆర్టీసీపై ఇప్పటికే ఆర్థిక భారం పెరిగిందన్నారు. ప్రయాణికులకు ఛార్జీలు పెంచే ఆలోచన ఏదీ లేదని స్పష్టం చేశారు. డీజిల్ బస్సులతో పోలిస్తే ఎలక్ట్రిక్ బస్సుల నిర్వహణ ఖర్చు చాలా తక్కువన్నారు. ఎలక్ట్రిక్ బస్సుల వల్ల పర్యావరణ కాలుష్యం తగ్గడమే కాకుండా, నిర్వహణ వ్యయం తగ్గి.. ప్రయాణికులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించే అవకాశం ఉంటుందని అన్నారు. రాబోయే రెండు నెలల్లో ఈ ఎలక్ట్రికల్ బస్సులు అందుబాటులోకి వస్తాయని కొనకళ్ల నారాయణ పేర్కొన్నారు.

## ఘోర రోడ్డు ప్రమాదంలో నలుగురు మహిళలు దుర్మరణం..

పొట్టకూటి కోసం ఉదయాన్నే ఉపాధి పనులకు వెళుతూ నలుగురు మహిళా కార్మికులు ఇలా దుర్మరణం పాలవ్వడం తనను ఎంతగానో కలచివేసిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మృతుల కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసిన మంత్రి, కూటమి ప్రభుత్వం బాధిత కుటుంబాలకు అన్ని విధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మరో ఇద్దరు కూలీలను కాకినాడ సర్వజనాస్పత్రికి తరలించగా, వారికి మెరుగైన అత్యవసర వైద్యం అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. కాగా, ఈ ఘటనపై కేసు నమోదు చేసిన కాకినాడ రూరల్ పోలీసులు పరారైన లారీ డ్రైవర్ కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

## థాయిలాండ్‌లో ఘోర ప్రమాదం

రైలు ఢీకొనడంతో మంటలు చెలరేగాయని, అవి బస్సును, సమీపంలోని వాహనాలను చుట్టుముట్టాయని అన్నారు.

వెంటనే అగ్నిమాపక సిబ్బందిని, సహాయక బృందాలను ఘటనా స్థలానికి పంపినట్లు ప్రకటించారు. ప్రస్తుతం మంటలను అదుపులోకి తీసుకువచ్చారని, బాధితుల కోసం గాలింపు చర్యలు చేపడుతున్నామని అన్నారు. ప్రమాదానికి గల కారణంపై దర్యాప్తు కొనసాగుతోంది.

## ఘోర ప్రమాదం

ఐదుగురు కూలీలు అక్కడికక్కడే మరణించారు. ఈ సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులకు స్థానిక ఆస్పత్రికి తరలించారు. మృతులు సత్యవతి, కృష్ణవేణి, చిట్టెమ్మ, అన్నవరంగా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. ఇతర వివరాలు తెలియాల్సి ఉంది. ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ అధికారులు స్పష్టం చేశారు.

# బంగారం ధరల్లో పతనం

. 22 క్యారెట్ల ఆర్నమెంటల్ పసిడి ధర కూడా రూ.900ల మేర తగ్గి రూ.1,43,850కు చేరుకుంది. నగరంలో కిలో వెండి ధర రూ.15 వేల మేర తగ్గి రూ.2.9 లక్షలకు దిగింది. దేశవ్యాప్తంగా 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర సగటున రూ.950 మేర తగ్గింది. వెండి ధరలో రూ.10 వేల మేర కోత పడింది. చెన్నైలో ప్రస్తుతం 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,60,910కు చేరుకుంది. 22 క్యారెట్ల గోల్డ్ రూ.1,47,500 వద్ద ట్రేడవుతోంది. న్యూఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,57,080గా, 22 క్యారెట్ల పసిడి ధర రూ.1,44,000గా ఉంది. ముంబైలో 10 గ్రాముల పసిడి ధర రూ.1,56,930కు చేరుకోగా 22 క్యారెట్ల వెండి ధర 1,43,850కు చేరింది. దేశంలోని అన్ని ప్రధాన నగరాల్లో కిలో వెండి ధర రూ.3 లక్షల మార్కు దిగువకు చేరుకుంది. చెన్నైలో గరిష్ఠంగా కిలో వెండి రూ.2.9 లక్షల వద్ద ట్రేడవుతోంది. ఇదిలావుంటే భారత కరెన్సీ సరికొత్త జీవితకాల కనిష్ఠ స్థాయికి పతనమైంది. ఫారెక్స్ ట్రేడింగ్‌లో డాలర్‌తో రూపాయి మారకం విలువ శుక్రవారం ఒక దశలో 50 పైసలు క్షీణించి రూ.96.14కు చేరుకుంది. డాలర్-రూపీ ఎక్స్ఛేంజ్ రేటు రూ.96 మార్క్‌ను దాటడం ఇదే తొలిసారి. అమెరికా-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలతోపాటు అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు మళ్లీ పెరగడం, డాలర్ బలోపేతం, దేశీయంగా ధరలు మరింత ఎగబాకవచ్చన్న ఆందోళనలు ఇందుకు ప్రధాన కారణమయ్యాయి. అయితే, ఆర్‌బీఐ జోక్యంతో రూపాయి మళ్లీ కాస్త కోలుకుంది. దాంతో డాలర్‌తో మారకం రేటు 17 పైసల నష్టంతో రూ.95.81 వద్ద ముగిసింది. ఇది కనిష్ఠ ముగింపు స్థాయి కూడా. గురువారం సెషన్‌లో డాలర్‌తో రూపీ మారకం రేటు 2 పైసలు లాభపడి రూ.95.64 వద్ద క్లోజైంది. అంతర్జాతీయంగా ఆరు ప్రధాన కరెన్సీలతో పోలిస్తే డాలర్ ఇండెక్స్ 0.34 శాతం పెరిగి 99.15 స్థాయిలో ట్రేడైంది. బ్రెంట్ ముడి చమురు బ్యారల్ ధర ఒక దశ లో 3.14 శాతం పెరిగి 109.04 డాలర్లకు చేరుకుంది. 6 రోజుల్లో 2 శాతం డౌన్: గడిచిన 6 ట్రేడింగ్ సెషన్లలో డాలర్‌తో రూపాయి మారకం విలువ దాదాపు 2 శాతం క్షీణించింది. ఈ ఏడాదిలో ఇప్పటివరకు 6 శాతానికి పైగా పతనమైంది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు, దాంతో చమురు ధరలు 100 డాలర్ల పైకి ఎగబాకడం, మన ఈక్విటీ మార్కెట్ నుంచి విదేశీ సంస్థాగత పెట్టుబడుల నిరవధిక ఉపసంహరణ, ద్రవ్యోల్బణ భయాలు, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ) ప్రవాహం తగ్గడం వంటి అంశాలు మన కరెన్సీపై ఒత్తిడి పెంచాయని ఫారెక్స్ వర్గాలు పేర్కొన్నాయి. కాగా రూపాయిపై ఒత్తిడి కొనసాగనుందని మిరే అసెట్ షేర్‌ఖాన్ రీసెర్చ్ అనలిస్ట్ అనూజ్ చౌదరి అన్నారు. మున్ముందు సెషన్లలో డాలర్-రూపీ ఎక్స్ఛేంజ్ రేటు రూ.95.60-96.20 శ్రేణిలో కదలాడవచ్చన్నారు.

## నా వ్యాఖ్యలను వక్రీకరించారు

ఒక కేసు విచారణ సందర్భంగా మౌఖికంగా చేసిన వ్యాఖ్యలను తప్పుగా అర్థం చేసుకున్నారని ఆయన వివరణ ఇచ్చారు. నకిలీ, బోగస్ డిగ్రీలతో ఈ వృత్తిలోకి వచ్చేవారిని ఉద్దేశిస్తూ తాను ఆ వ్యాఖ్యలు చేశానని అన్నారు. ఇలాంటి వారే మీడియా, సోషల్ మీడియాతో పాటు ఇతర రంగాల్లోకి చొరబడ్డారని అన్నారు. అందుకే అలాంటి వారిని పరాన్నజీవులుగా పేర్కొన్నట్లు తెలిపారు. కానీ మీడియాలో కొందరు తన వ్యాఖ్యలను వక్రీకరించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.భారతీయ యువత పట్ల తాను ఎంతో గర్వపడుతున్నానని పేర్కొన్నారు. నిన్న ఓ కేసు విచారణ సందర్భంగా మౌఖికంగా చేసిన వ్యాఖ్యలను మీడియాలోని ఒక వర్గం వక్రీకరించిన తీరును చదివి తాను ఆవేదన చెందానని పేర్కొన్నారు. మన దేశ యువతను విమర్శించానని చెప్పడం పూర్తిగా నిరాధారమని అన్నారు. మన దేశ యువతను చూసి ఎంతో గర్వపడుతున్నానని పేర్కొన్నారు. తన పట్ల వారికి గౌరవ మర్యాదలు ఉన్నాయని చెప్పడంలో ఎలాంటి అతిశయోక్తి లేదని అన్నారు. యువతను దేశాభివృద్ధికి మూలస్తంభాలుగానే చూస్తానని సూర్యకాంత్ తెలిపారు.

## తమిళనాడు మంత్రివర్గంలో శాఖల కేటాయింపు

పార్టీలో, ప్రభుత్వంలో కీలక నేతగా ఉన్న ఎన్. ఆనంద్‌కు గ్రామీణాభివృద్ధి, జలవనరుల వంటి ముఖ్యమైన శాఖలను కేటాయించారు. కె.ఎ. సెంగోట్టయ్యన్ కు ఆర్థిక శాఖ, ఆదవ్ అర్జునకి ప్రజా పనుల శాఖ (భవనాలు, రహదారులు, చిన్న ఓడరేవులు), క్రీడాభివృద్ధి శాఖలు, కె.జి. అరుణ్ రాజ్ కి ఆరోగ్య, వైద్య విద్య, కుటుంబ సంక్షేమ శాఖలు, ఎస్. కీర్తనకి పరిశ్రమల శాఖను కేటాయించారు. ఈ నూతన మంత్రివర్గం రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తుందని సిఎం విజయ్ పేర్కొన్నారు.

ప్రజాభూమి
ఎన్టీఆర్, కృష్ణా
ఆదివారం, మే 17, 2026


# ఎంపీ వల్లభనేని బాలశౌరిని మర్యాదపూర్వకంగా కలిసిన ప్రజాభూమి చీఫ్ ఎడిటర్,బ్యూరో చీఫ్

**పత్రిక ఎదుగుదలకు, సమస్యల పరిష్కారానికి నా వంతు సహకారం అందిస్తా ఎంపీ బాలశౌరి**

**ఆన్‌లైన్ సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకెళ్లిన ప్రజాభూమి ఎడిటర్ అంకిరెడ్డిపల్లి రామ్మోహన్ రెడ్డి**



మచిలీపట్నం/ప్రజాభూమి ప్రతినిధి

కృష్ణాజిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో ప్రజా భూమి తెలుగు దినపత్రిక బృందం మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు (ఎంపీ) వల్లభనేని బాలశౌ రిని మర్యాదపూర్వకంగా కలుసుకుంది. ప్రజా భూ మి పత్రిక చీఫ్ ఎడిటర్ అక్కిరెడ్డిపల్లి రామ్మో హన్ రెడ్డి నేతృత్వంలో జరిగిన ఈ భేటీలో కృ ష్ణాజిల్లా ప్రజాభూమి బ్యూరో చీఫ్ అనంత సురేష్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా పత్రికకు సంబం ధించిన పలు ఆన్‌లైన్ సాంకేతిక సమస్యలను ఎడిటర్ రామ్మోహ న్ రెడ్డి ఎంపీ దృష్టికి తీసుకువెళ్లారు. పత్రిక నిర్వహణలో ఎదురవుతున్న చిన్న చిన్న అడ్డంకులను, సాంకేతిక ఇబ్బందులను ఎంపీ బాలశౌరి ఎంతో ఓర్పుతో, నిదానంగా అడిగి తెలుసుకున్నారు.పూర్తి సహ కారం ఉం టుంది ఎంపీ బాలశౌరిపత్రికకు ఎదురవుతున్న ఆన్‌లైన్ సమస్యల పరిష్కారానికి తన వంతుగా పూర్తి సహకారాన్ని అందిస్తానని ఈ సంద ర్భంగా ఎంపీ హామీ ఇచ్చారు. సమాజంలో పత్రి కల పాత్ర ఎంతో కీలకమని పేర్కొంటూ.. ప్రజా సమస్యలను వెలుగులోకి తెస్తూ ప్రజాభూమి పత్రిక మరింతగా ఎదగాలని ఆయన ఆకాం క్షించారు. పత్రిక అభ్యు న్నతికి, భవిష్యత్ ఎదుగుదలకు తన వైపు నుంచి ఎల్ల ప్పుడూ అండగా ఉంటానని ఎంపీ బాలశౌరి స్పష్టం చేశారు. తమ సమస్యలను సానుకూ లంగా విని, సహకరిస్తామని హామీ ఇచ్చి నందుకు ఎంపీ బాలశౌరికి ప్రజాభూమి పత్రిక బృందం ప్రత్యేక కృతజ్ఞ తలు తెలియజేసింది.



# ఇంధనాల వినియోగంలో పొదుపు పాటించాలి : మంత్రి కొల్లు రవీంద్ర

**మధ్య పశ్చిమాసియా యుద్ధ ప్రభావం పడకుండా ప్రజలు సహకరించాలి**

**ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావుతో కలిసి సైకిల్‌పై బస్ స్టేషన్‌కు వెళ్లిన మంత్రి**



మచిలీపట్నం/ ప్రజాభూమి ప్రతినిధి

మధ్య పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ వాతావరణ పరిస్థితుల ప్రభావం భారత్‌పై పడకుండా ఉండేందుకు ప్రజలందరూ పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ గ్యాస్, విద్యుత్ వంటి ఇంధనాల వినియోగంలో పొదుపు పాటించాలని రాష్ట్ర గనులు, భూగర్భవనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర విజ్ఞప్తి చేశారు.శనివారం ఉదయం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (APSRTC) చైర్మన్ కొనకళ్ళ నారా యణరావుతో కలిసి మంత్రి కొల్లు రవీంద్ర సైకిల్‌పై ప్రయాణించి మచిలీపట్నం బస్ స్టేషన్‌ను సందర్శించారు. ప్రయాణికులతో ముఖాముఖి అవగాహనబస్ స్టేషన్‌లో ఉన్న మహిళా ప్రయాణికులతో మంత్రి ముఖాముఖి మాట్లాడారు. ఇంధన పొదుపు అవశ్యకతను వారికి వివరించారు. ఇళ్లలో వంట కోసం ఎల్పీజీ గ్యాస్ లేదా విద్యుత్ స్టౌవ్‌లను ఏ విధంగా పొదుపుగా వాడుతున్నారో అడిగి తెలుసుకున్నారు.మంత్రి కొల్లు రవీంద్ర ముఖ్య సూచనలుప్రజా రవాణాను వాడండి: వ్యక్తిగత వాహ నాల వినియోగాన్ని తగ్గించి, సాధ్యమైనంత వరకు బస్సులు, రైళ్లు వంటి ప్రజా రవాణా వ్యవస్థలను ఉపయోగించాలి.సౌర శక్తి వైపు అడుగులు: గృహావసరాల కోసం సౌర శక్తి (సోలార్ ఎనర్జీ) వినియో గాన్ని అలవాటు చేసుకోవడం ద్వారా సాంప్రదాయ ఇంధనాలపై భారం తగ్గుతుంది.ఈ-వాహనాలు, సైకిళ్లు: రాష్ట్ర ప్రభుత్వ సూచనల మేరకు ప్రజలు నిత్య జీవితంలో సైకిళ్లు, విద్యుత్ వాహనా లను (EVs) ఎక్కువగా వినియోగించాలి.అంతర్జాతీయ మార్కెట్లో అంతరాయాలు: మధ్య పశ్చిమాసియా ఉద్రిక్తతల వల్ల అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు, ఎల్ఎన్జీ (లిక్విఫైడ్ నాచురల్ గ్యాస్) సరఫరాలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. ఇంధన పొదుపును ప్రతి కుటుంబం ఒక బాధ్యతగా తీసుకుంటే దేశ ఆర్థిక వ్యవస్థకు మేలు జరుగుతుం దని, భవిష్యత్ తరాలకు సహజ వనరులను సంరక్షించిన వారమవుతామని మంత్రి పేర్కొన్నారు.మంత్రి వెంట మచిలీపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుంచె దుర్గాప్రసాద్ (నాని), బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పీవీ ఫణి కుమార్, కూటమి నాయకులు లోగిశెట్టి వెంకటస్వామి, తలారి సోమశేఖర్ తదితరులు ఉన్నారు.

# మట్టి తవ్వకాలను అడ్డుకున్న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు



ప్రజాభూమి పెడన

కోట్లాది రూపాయలు ఖర్చు చేసి... నిర్మించిన రహదారులు... మట్టి తవ్వకాలవల్ల... రహదారులు... ధ్వంసం అవుతున్నాయని.... దీనికి ఎవరు... బాధ్యులు అంటూ.. స్థానిక వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఈరోజు ఉదయంకృత్తివెన్ను మండలం మునిపెడలో స్థానిక వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు అక్రమ మట్టి తోలకాలను అడ్డుకొని.. తమ నిరసనను వ్యక్తం చేశారు.

# రోడ్లను గుల్ల చేస్తున్న మట్టి మాఫియా.. చూస్తూ ఊరుకుంటారా

**కృత్తివెన్ను మండలం మునిపెడలో అక్రమ రవాణాను అడ్డుకున్న వైసీపీ నాయకులు**

**కోట్లాది రూపాయల ప్రజాధనం బుగ్గిపాలు.. పాలకులు సమాధానం చెప్పాలి జెడ్పీటీసీ మైలా రత్నకుమారి డిమాండ్**



ప్రజాభూమి బ్యూరో కృష్ణాజిల్లా

పెడన నియోజకవర్గంలో మట్టి మాఫియా ఆగడాలు మితిమీరిపోతున్నాయి. నిబంధనలకు విరు ద్ధంగా, అక్రమంగా తరలిస్తున్న మట్టి వాహనాల వల్ల కోట్లాది రూపాయల ప్రజాధనంతో నిర్మించిన రహదారులు అట్ట ముక్కల్లా విరిగిపోతున్నాయి. శనివారం కృత్తివెన్ను మండలం మునిపెడ గ్రామంలో ఈ అక్రమ మట్టి తోలకాలను స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు రౌండప్ చేసి, వాహనాలను అడ్డుకున్నారు. నిబంధనలు పాటించకుండా ఇష్టారాజ్యంగా నడుపుతున్న ఈ మాఫి యా వెనుక ఎవరి హస్తం ఉందంటూ నిలదీస్తూ అక్కడే బైఠాయించి తీవ్ర నిరసన వ్యక్తం చేశారు.రహదారుల ధ్వంసానికి బాధ్యులెవరు?గ్రామీణ ప్రాంతాల ప్రజల సౌకర్యార్థం, రవాణా మెరుగుపరచడం కోసం కోట్ల రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన రోడ్లు.. ఈ భారీ మట్టి టిప్పర్ల ధాటికి ధ్వంస మైపోతున్నాయని వైసీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గుంతలమయంగా మారుతున్న ఈ రహదారులపై ప్రయాణించలేక సామాన్య ప్రజలు నరకం చూస్తున్నారని, ప్రమాదాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నష్టానికి ఎవరు బాధ్యత వహిస్తారని వారు పాలకులను ప్రశ్నించారు.రోజురోజుకూ పెరిగిపోతున్న ఈ మట్టి మాఫియా ఆగడాల నుండి నియోజకవర్గాన్ని, ప్రజల ఆస్తులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. పాలకులు, అధికారులు తక్షణమే స్పం దించి ఈ అక్రమ తవ్వకాలను, రవాణాను అరికట్టాలి అని కృత్తివెన్ను జడ్పీటీసీ మైల రత్నకుమారి తెలిపారు.ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలిఅధికార యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం వల్లే మట్టి మాఫియా యథేచ్ఛగా రెచ్చిపోతోందని స్థానిక నాయకులు ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం, సంబంధిత మైనింగ్ మరియు పోలీస్ శాఖ అధికారులు స్పందించి మునిపెడతో పాటు నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో జరుగుతున్న అక్రమ తోలకాలపై టాస్క్‌ఫోర్స్ కమిటీ వేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజా మద్దతుతో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో .కే.గరుడ ప్రసాద్ యుపిపి, పిన్నింటి మహేష్ మాజీ ఆర్టీసీ జోనల్ చైర్మన్ వి.వెంకట రాజు ,మాజీ వైఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, కే.బాపూజీ మాజీ సర్పంచ్,ప్రభుజీ మాజీ సర్పంచ్, కే.వాసు, పట్టపు. శ్రీనివాసురావు, పుప్పల. శ్రీనివాసురావు, పెద్ది.శ్రీను, కే.నాగరాజు, ఉమ మహేశ్వరవు, దుర్గరావు మరియు మండల, గ్రామ స్థాయి వైసీపి నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.

# కృష్ణాజిల్లాను స్వచ్ఛ కృష్ణాగా తీర్చిదిద్దుదాం : కలెక్టర్ డీకే బాలాజీ పిలుపు

**అవనిగడ్డలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం..**

**స్వయంగా చెత్తను తొలగించిన కలెక్టర్**

**3 రోజుల్లో 'బ్లాక్ స్పాట్' కాస్తా గ్రీన్ స్పాట్ అవ్వాలి ..అధికారులకు ఆదేశం**





ప్రజాభూమి బ్యూరో కృష్ణాజిల్లా

ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని, పర్యావరణ పరిరక్షణకు పూనుకోవాలని, తద్వారా మన జిల్లాను స్వచ్ఛ కృష్ణాజిల్లాగా తీర్చిదిద్దేందుకు తోడ్పడాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ప్రజలకు పిలుపునిచ్చారు.రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు శనివారం ఉదయం అవనిగడ్డ నియోజకవర్గ కేంద్రంలోని తపాలా కార్యాలయం వీధిలో నిర్వహించిన స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో కలెక్టర్ స్వయంగా పాల్గొన్నారు. గత కొంతకాలంగా అక్కడ పేరుకుపోయిన చెత్తాచెదారాలను రాష్ట్ర స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ బోలెం నాగమణి, డిపిఓ ధనలక్ష్మి, జడ్పీ సీఈఓ అరుణ, ఎల్ఐసి మేనేజర్ హరిప్రసాద్ లతో కలిసి కలెక్టర్ స్వయంగా తొలగించారు.బ్లాక్ స్పాట్ టు గ్రీన్ స్పాట్ నిరంతరం చెత్త పేరుకుపోయే ఆ ప్రాంతాన్ని 'బ్లాక్ స్పాట్'గా గుర్తించి, మూడు రోజుల్లోగా ఎర్రమట్టితో చదును చేసి, బల్లలు, మొక్కలు ఏర్పాటు చేసి రంగులు వేసి సుందరమైన 'గ్రీన్ స్పాట్'గా మార్చాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.సిసిటివి నిఘా: ఇకపై అక్కడ ఎవరూ చెత్త వేయకుండా ఉదయం నుంచి కాపలా కాయాలని, సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసి చెత్త వేసే వారిని గమనించి హెచ్చరించాలని ఎల్ఐసి మేనేజర్‌కు సూచిం చారు. స్పందించిన కలెక్టర్ – మురుగునీటి వ్యవస్థకు ఆదేశం: వీధిలో పర్యటిస్తూ పారిశుధ్య పనులపై స్థానికులను విచారించిన కలెక్టర్, తమకు మురుగునీటి సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్నామన్న గ్రామస్తుల విజ్ఞప్తిపై వెంటనే స్పందించారు. అంచనాలు రూపొందించి పంపా లని ఆర్‌డ బ్ల్యూఎస్ ఏఈ జగత్‌ను ఆదేశిం చారు. స్వచ్ఛ రథం – పాత పుస్తకాలిస్తే కందిపప్పు: స్వచ్ఛ రథం ద్వారా ప్రజల నుండి పాత పుస్తకాలు, సామాగ్రిని సేకరించి వారికి కంది పప్పును కలెక్టర్ పంపిణీ చేశారు. ఇంట్లో చెత్తను ఇచ్చి విలువైన సరుకులను పొందాలని కోరారు. మార్పుకు నాంది – గుడ్డ బ్యానర్: ప్రభుత్వ ఆసుపత్రి కూడలిలో ప్రజలతో కలిసి మానవహారం ఏర్పాటు చేసి స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. ప్లాస్టిక్ వాడకూడదనే సంకల్పంతో ఈసారి ప్రత్యేకంగా గుడ్డతో తయారుచేసిన బ్యానర్‌ను వినియోగించడం విశేషం.కలెక్టర్ పిలుపు: "ఈ రెండు చిన్న మార్పులు చేయండి""ఈ నెల 'ప్లాస్టిక్ రహిత ఆంధ్రప్రదేశ్' అనే ఇతివృత్తంతో కార్యక్రమాన్ని చేపట్టాం. పూర్వంలాగా ప్రతి ఒక్కరూ బయటకు వెళ్లేట ప్పుడు చేతితో గుడ్డ సంచి తీసుకెళ్లాలి. హోటల్‌కు వెళ్లే ఆహార పార్సల్ కోసం ఇళ్ల నుంచే స్టీల్ గిన్నెలు తీసుకెళ్లాలి. ఈ రెండు చిన్న సంకల్పాల వల్ల ప్లాస్టిక్ పెద్ద మొత్తంలో తగ్గుతుంది. అలాగే ఇళ్లలోని తడి, పొడి చెత్తను వేరు చేసి పారిశుధ్య కార్మికులకు అందించాలి. ఇంటి వ్యర్థాలతో చిన్న గొయ్యి తీసి ఎరువు తయారు చేసుకోవాలి."— డీకే బాలాజీ, జిల్లా కలెక్టర్‌చెత్త నుండి సంపద కేంద్రం పరిశీలన అనంతరం కలెక్టర్, ఆధునికరించిన చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించి అక్కడ ఏర్పాటుచేసిన ప్లాస్టిక్ బేలింగ్ యంత్రాన్ని, ష్రెడ్డర్లను పరిశీలించారు. యంత్రాల పనితీరును నిర్వాహకుడు కోరాడ రాజును అడిగి తెలుసుకున్నారు. కిలో పది రూపాయల చొప్పున విక్రయించే వర్మి కంపోస్ట్ ప్రదర్శనశాలను తిలకించారు. అనంతరం ప్రాంగణంలో మొక్కలు నాటి, స్వచ్ఛ రథం గోడపత్రాలను ఆవిష్కరించారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు చేతి సంచులను పంపిణీ చేశారు.ఎల్ఐసి కార్యాలయ ప్రాంగణంలో మొక్కలు నాటిన కలెక్టర్, గ్రామస్తుల కోరిక మేరకు సమీపంలోని చెరువును పరిశీలించి, అక్కడ వాకింగ్ ట్రాక్ ఏర్పాటుపై సానుకూలంగా స్పందించారు. హెల్మెట్ ధరించి బైక్ ర్యాలీ!కార్యక్రమం ముగింపులో కలెక్టర్ అవనిగడ్డ డీఎస్పీ అభిషేక్, సీఐ యువకుమార్, పోలీసు సిబ్బంది మరియు ప్రజలతో కలిసి హెల్మెట్ ధరించి భారీ బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా శిరస్త్రానం (హెల్మెట్) ధరించి ప్రాణాలను కాపాడుకోవాలని ఈ సందర్భంగా కలెక్టర్ హితవు పలికారు.ఈ బృహత్తర కార్యక్రమంలో తహసిల్దారు శ్రీనివాసులు, ఎంపీపీ తుంగల సుమతిదేవి, డిఆర్డీఏ పీఎం శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు తదితర అధికారులు, ప్రజాప్రతినిధులు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ తో భవిష్యత్ తరాలకు తీరని నష్టం : మంత్రి కొల్లు రవీంద్ర

**మచిలీపట్నంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర.. సైకిళ్లపై వచ్చి ఇంధన పొదుపు చాటిన మంత్రి, జేసీ**

**ఉత్పత్తి స్థాయిలోనే ప్లాస్టిక్‌ను నియంత్రించాలి ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ**

ప్రజాభూమి బ్యూరో కృష్ణాజిల్లా

ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల భవిష్యత్ తరాలకు తీవ్రమైన నష్టం కలుగుతుందని, దీని నిర్మూలనకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా మెలిగి, మన దైనందిన జీవితంలో ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని రాష్ట్ర గనులు, భూగర్భవనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పిలుపునిచ్చారు. రాబోయే తరాలకు ఆరోగ్యకరమైన, కాలుష్య రహిత పర్యావరణాన్ని అందించడం మనందరి ప్రాథమిక కర్తవ్యం అని ఆయన పేర్కొన్నారు.స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ఉదయం మంత్రి కొల్లు రవీంద్ర, ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు, జాయింట్ కలెక్టర్ ఎం. నవీన్ తదితరులతో కలిసి నగరంలోని సాయిబాబా గుడి సమీపంలో గల రైతు బజార్ వద్ద స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, సిబ్బందితో కలిసి రోడ్లను శుభ్రం చేసి, ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం అందరిచేత 'స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ' చేయించారు.ఇంధన పొదుపుపై సందేశం మంత్రి కొల్లు రవీంద్ర, జాయింట్ కలెక్టర్ ఎం. నవీన్ తదితరులు ఈ కార్యక్రమానికి సైకిళ్లపై వచ్చి ఇంధన పొదుపు ప్రాముఖ్యతను చాటారు.స్వచ్ఛ ఆయుధాలతో పారిశుధ్యం సాయిబాబా గుడి నుంచి రైతు బజార్ వరకు ప్రధాన రహదారులను ప్రత్యేకంగా రూపొం దించిన స్వచ్ఛ ఆయుధాలతో మంత్రి, అధికా రులు స్వయంగా శుభ్రం చేశారు.ఆప్రాన్ల పంపిణీ పారిశుధ్య కార్మికుల సేవలను అభినం దిస్తూ వారికి మంత్రి చేతుల మీదుగా ఆప్రాన్ దుస్తులను పంపిణీ చేశారు.వచ్చే ఆదివారం మంగినపూడి బీచ్ క్లీనింగ్ పర్యావరణ పరిరక్షణలో భాగంగా వచ్చే ఆదివారం మంగినపూడి బీచ్ వద్ద భారీ పారిశుధ్య కార్యక్రమం నిర్వహించనున్నట్లు మంత్రి ప్రకటించారు.ప్రతి శనివారం కేవలం ఒకరోజు కార్యక్రమంగా కాకుండా, ప్రతి సచివాలయం పరిధిలో ప్రతి శనివారం పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించాలని అధి కారులను ఆదేశించారు.మంత్రి కొల్లు రవీంద్ర కీలక వ్యాఖ్యలురాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెల మూడో శనివారాన్ని 'చెత్తను పారద్రోలుదాం' కార్యక్రమంగా నిర్వహిస్తోంది. సీఎం చంద్రబాబు నాయుడు గారు స్వయంగా పాల్గొంటూ ప్రజల్లో చైతన్యం తెస్తున్నారు.

రైతు బజార్లలో ప్లాస్టిక్ వినియోగం ఎక్కువగా ఉంది, అక్కడ మార్పు రావాలి. రోడ్లపై పడేసే కొబ్బరి బొండాలు, వ్యర్థాల వల్ల దోమలు పెరిగి డెంగ్యూ, మలేరియా వస్తున్నాయి. 30 ఏళ్ల క్రితమే 'క్లీన్ అండ్ గ్రీన్' ప్రారంభించిన సీఎం దూరదృష్టిని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలి. ఉత్పత్తి నిలిపివేస్తేనే ప్లాస్టిక్ కంట్రోల్: కొనకళ్ళ నారాయణరావుఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు మాట్లాడుతూ, ప్లాస్టిక్ నిషేధాన్ని కఠినంగా అమలు చేయాల న్నారు. "చాలా కాలంగా ప్లాస్టిక్ నిషేధం పై చర్చ జరుగుతున్నా పూర్తిస్థాయిలో అమలు కావడం లేదు. ప్లాస్టిక్ ఉత్పత్తులను నియంత్రించాలంటే ఆ పరిశ్రమలకు అనుమతులు ఇవ్వకుండా ప్రభుత్వం కఠిన నిర్ణయాలు తీసుకోవాలి. మార్కెట్‌లో వాడకం తగ్గాలంటే ఉత్పత్తి స్థాయిలోనే నియంత్రణ ఉండాలి" అని ఆయన స్పష్టం చేశారు.ప్లాస్టిక్ తింటే క్యాన్సర్ వస్తుంది: జాయింట్ కలెక్టర్ ఎం. నవీన్‌జాయింట్ కలెక్టర్ ఎం. నవీన్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వల్ల కలిగే ఆరోగ్య నష్టాలను వివరించారు. "మైక్రో ప్లాస్టిక్స్ ఆహార పదార్థాలలో చేరి ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఇవి క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులకు కారణమవుతున్నాయి. తక్కువ జీఎస్ఎం (GSM) కలిగిన సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను పూర్తిగా నివారించాలి. ఎక్కడైతే 'బ్లాక్ స్పాట్స్' (చెత్త కుప్పలు) ఉన్నాయో వాటిని 'గ్రీన్ స్పాట్స్'గా మార్చే దిశగా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది" అని వెల్లడించారు.పాల్గొన్న ప్రముఖులు:ఈ కార్యక్ర మంలో విజిలెన్స్ డిప్యూటీ కలెక్టర్ పోతురాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ కుంచె దుర్గాప్రసాద్ (నాని), మున్సిపల్ కమిషనర్ బాపిరాజు, సహాయ కమిషనర్ గోపాలరావు, కలెక్టరేట్ ఏఓ రాధిక, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పీవీ ఫణి కుమార్, కూటమి నాయకులు లోగిశెట్టి వెంకటస్వామి, తలారి సోమశేఖర్, వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ సిబ్బంది, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.






# వ్యక్తిగత బాధ్యతతోనే స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ సాధ్యం : గోపు సత్యనారాయణ

**కానూరులో స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర.. పారిశుధ్య పనుల్లో పాల్గొన్న టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి**

**గ్రామస్థులతో కలిసి చెత్తాచెదారం తొలగింపు..**

**స్వచ్ఛ ప్రతిజ్ఞ**




మచిలీపట్నం/రూరల్ ప్రజాభూమి ప్రతినిధి

ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలను గుర్తించి, ప్రతి ఒక్కరూ వ్యక్తిగత బాధ్యతగా ప్లాస్టిక్‌ను దూరం పెట్టినప్పుడే స్వచ్ఛమైన ఆంధ్రప్రదేశ్ సాధ్యమవుతుందని కృష్ణా జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ పేర్కొన్నారు.రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మూడో శనివారం నిర్వహించాల్సిన స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మచిలీపట్నం మండలం కానూ రు గ్రామములో పారిశుధ్య కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో గోపు సత్యనారాయణ స్వయముగా పాల్గొని గ్రామస్థులతో కలిసి చిన్న కానూరు గ్రామ పరిసరాలను శుభ్రం చేశారు. రహదారులపై ఉన్న చెత్తాచెదారాన్ని తొలగించారు.ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా మార్చాలి ప్రభు త్వం ఆదేశాల ప్రకారం పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా అరికట్టాలని గోపు సత్యనారాయణ పిలుపునిచ్చారు. ప్రజలంతా సమన్వయంతో పనిచేసి కానూరును ప్లాస్టిక్ రహిత గ్రామముగా తీర్చిదిద్దాలని కోరారు.పరిసరాల పరిశుభ్రత మన బాధ్యత ఇళ్లలో చేరే పొడి చెత్త, తడి చెత్తలను విడివిడిగా సేకరించి అందించాలన్నారు. ప్రతి ఇంటిని మరియు మన పరిసర ప్రాంతాలను పరిశుభ్రముగా ఉంచాల్సిన బాధ్యత మన అందరిపై ఉన్నదని సూచించారు.స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రతపై గ్రామస్థుల్లో చైతన్యం నింపుతూ అందరి సమక్షం లో స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు.పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులుఈ పారి శుధ్య బృహత్తర కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ వరప్రసాద్, వీఆర్ఓ సుబ్బయ్యదాస్, దివి మహేష్, పీత రాము, గోపు వెంకటరమణ, బోలిశెట్టి నాని, మరీదు రాఘవ, కమ్మగట్టి అశోక్, బోట్ల సాయి, ఆముదలపల్లి భాస్కర్ రావు, వంకా రాం బాబు, స్వచ్ఛ గ్రామ సిబ్బంది, ఏఎన్ఎమ్, హెల్త్ సి బ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, బుక్ కీపర్స్, గోకపై విజయ్, ఫీల్డ్ అసిస్టెంట్ బోట్ల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



## ప్లాస్టిక్ రహిత సమాజం కోసం అందరూ కృషి చేయాలి
-ఎమ్మెల్యే బడేటి చంటి



ప్రజా భూమి ప్రతినిధి-ఏలూరు

ప్రజలు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించుకుని స్వచ్ఛమైన పరిసరాల కోసం సహకరించాలని జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి సూచించారు. కూటమి ప్రభుత్వం చేపట్టిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఏలూరులోని బావిశెట్టివారి పేటలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలతో స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేయించి, మొక్కలు నాటారు. పారిశుద్ధ్య నిర్వహణలో మెరుగైన పనితీరు కనబరిచిన కార్మికులను సన్మానించి బహుమతులు అందజేశారు. ప్లాస్టిక్ వల్ల పర్యావరణ కాలుష్యం పెరిగి ప్రజలకు అనేక రకాల వ్యాధులు వస్తున్నాయని ఎమ్మెల్యే చంటి పేర్కొన్నారు. భవిష్యత్తు తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణం అందించాలంటే ప్లాస్టిక్ వినియోగంపై నియంత్రణ అవసరమన్నారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలి: సీపీఐ




ప్రజా భూమి ప్రతినిధి-ఏలూరు

కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను తక్షణమే ఉపసంహరించుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డేగా ప్రభాకర్ డిమాండ్ చేశారు. ధరల పెంపును నిరసిస్తూ ఏలూరులోని ఫైర్‌స్టేషన్ సెంటర్ వద్ద శీర్ల బ్రహ్మయ్య పెట్రోల్ బంక్ వద్ద సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు పూర్తయ్యాక చమురు ధరలు పెంచడం ప్రజలను మోసం చేయడమేనని విమర్శించారు. ఇప్పటికే గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఇప్పుడు పెట్రోల్, డీజిల్ ధరల పెంపుతో రవాణా, రైతాంగంపై మరింత భారం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఐ ఏలూరు ఏరియా సమితి సహాయ కార్యదర్శి కురెళ్ళ వరప్రసాద్, ఏఐటీయూసీ నాయకులు కృష్ణమాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు మద్దతు ధరల పెంపు మోసపూరితం: రైతు సంఘం



ప్రజా భూమి ప్రతినిధి-ఏలూరు

రైతుల పంటలకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరల పెంపు మోసపూరితమని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం. సూర్యనారాయణ, రాష్ట్ర సహాయ కార్యదర్శి కె. శ్రీనివాస్ విమర్శించారు. ఎరువుల ధరలను 15 నుంచి 20 శాతం వరకు పెంచి, పంటల మద్దతు ధరలను కేవలం 0.1 శాతం నుంచి 8 శాతం వరకు మాత్రమే పెంచడం రైతులను మోసం చేయడమేనన్నారు. ఏలూరులో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ, డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం శాతం ఆధారంగా మద్దతు ధరలు నిర్ణయించాలని, ప్రభుత్వమే రైతుల పంటలను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే, కొయ్యలగూడెం మండలంలో ప్రతిపాదిత నేవీ ఆయుధ డిపో కోసం భూసేకరణను ప్రభుత్వం విరమించుకోవడం రైతుల పోరాట విజయమని పేర్కొన్నారు.

## ప్రైవేటు విద్యాసంస్థల బస్సులు తనిఖీలు నిర్వహిస్తున్న రవాణా శాఖ అధికారులు.

ప్రజా భూమి ప్రతినిధి-ఏలూరు జిల్లా

ప్రైవేటు విద్యాసంస్థల బస్సులు ఎటువంటి ప్రమాదాలకు గురికాకూడదనే ఉద్దేశముతో రవాణా శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఏలూరు జిల్లా వ్యాప్తముగా వాహన తనిఖీ అధికారులతో కూడిన 5 తనిఖీ బృందాలను ఏర్పాటు చేసి జిల్లాలోని అన్ని ప్రైవేటు విద్యాసంస్థల పాఠశాలలు, కళాశాలల బస్సుల ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నామని ఉప రవాణా కమీషనర్ షేక్ కరీం తెలిపారు. ఈ తనిఖీల్లో భాగముగా జిల్లాలో మొత్తం 849 విద్యాసంస్థల బస్సులు ఉండగా, ఈనెల ఒకటవ తేదీ నుంచి ది. 15.05.2026 నాటికి వాహన తనిఖీ అధికారులు జిల్లాలోని 78 ప్రైవేటు విద్యాసంస్థలలోని 707 (84 శాతం) బస్సులను తనిఖీ చేసి, 179 (21 శాతం) బస్సులకు అనుమతులు ఇవ్వగా, భద్రతా ప్రమాణాలకు అనుగుణముగా లేని 528 బస్సులకు సంభందించి ఆయా యాజమాన్యాలకు నోటీసులు నోటీసులు ఇవ్వడం జరిగిందన్నారు. నోటీసులు అందుకున్న యాజమాన్యాలు రవాణా శాఖ సూచించిన భద్రతా ప్రమాణాలను వారి బస్సుల్లో సరిచేసుకుని, బస్సులకు ఏటీఎస్ ద్వారా ఫిట్నెస్ సర్టిఫికెట్ను ది. 25.05.2026 లోపు పొందాలని, లేనియడల కేసులు నమోదు చేయడముతో పాటూ బస్సులను సీజ్ చేయడము జరుగుతుందని సామజిక మాధ్యమాల ద్వారా ఎప్పటికప్పుడు తెలియచేస్తున్నామన్నారు.

## స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా పరిశుభ్రత కార్యక్రమం

ప్రజా భూమి ప్రతినిధి-ఆగిరిపల్లి



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమం లో భాగంగా ఆగిరిపల్లి మండల విద్యాశాఖ కార్యాలయం పరిసరాల్లో శనివారం పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. మండల విద్యాశాఖాధికారి శిలారపు హేబేలు ఆధ్వర్యంలో కార్యాలయం చుట్టుపక్కల పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించి పరిసరాలను శుభ్రపరిచారు. పరిశుభ్రమైన వాతావరణం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎస్ రాంబాబు, సీఆర్ఎంటీలు బాజీ, రామారావు, సుభాషిణి, సుజాత, వరలక్ష్మి పాల్గొన్నారు.

# సింగిల్ యూజ్ ప్లాస్టిక్ రహిత జిల్లాగా ఏలూరు జిల్లాను మార్చడమే ముఖ్య ఉద్దేశం

**జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి.**

ప్రజా భూమి ప్రతినిధి-ఏలూరు జిల్లా.



ముసునూరు మండలం వలసపల్లి గ్రామంలో శనివారం స్వర్ణాంధ్ర -స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా "ప్లాస్టిక్ రహిత రాష్ట్రం" అనే ఇతివృత్తంతో కార్యక్రమాన్ని జిల్లా కలెక్టరు కె.వెట్రి సెల్వి లాంఛనంగా ప్రారంభించారు. డంపింగు యార్డు, శ్రీ వరలక్ష్మి జనరల్ స్టోర్స్, ఇంటింటికి వెళ్ళి క్లాప్ మిత్రాలు రోజు వస్తున్నారా అని ఆరా తీశారు. డ్రైనేజీని పరిశీలించి అధికారులకు కొన్ని సూచనలను జారీ చేశారు. స్వచ్ఛ రథాన్ని పరిశీలించి, రోజుకు ఎన్ని ఇల్లు కవర్ చేస్తున్నారని, దానిలో ఉన్న నిత్యవసర సరుకులను పరిశీలించారు. క్లాప్ మిత్రాలను సన్మానించి, వారితో కలసి టీత్రాగుతూ కుటుంబ సభ్యులు యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. రచ్చబండ దగ్గర కూర్చుని ప్రజలతో మమేకమై గ్రామజీవన విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుటకు ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా స్వీకరించాలని, ప్రజలకు గన్ని సంచులను పంపిణీ చేసి, అందరిచేత జిల్లా కలెక్టరు ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ ప్రతి మూడవ శనివారం నిర్వహించే స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా "ప్లాస్టిక్ రహిత రాష్ట్రం" అనే ఇతివృత్తంతో కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో విజయవంతంగా జరుగుతున్నాయన్నారు. ప్లాస్టిక్ రహిత లక్ష్యంగా ప్రజలు భాగస్వామ్యంతో సింగల్ యూజ్ ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించి, ప్లాస్టిక్ రహిత జిల్లాగా రూపొందించేలా ప్రతి ఒక్కరూ ఆలోచనలు చేసి ముందుకు అడుగులు వెయ్యాలని అన్నారు. ప్లాస్టిక్, క్యారీ బ్యాగులు ప్రత్యామ్నాయంగా గన్ని, క్లాత్ సంచులు వాడుకోవాలని అన్నారు. ప్రతి గ్రామం, పట్టణ స్థాయిలో పారిశుద్ధ్యానికి పెద్దపీట వెయ్యాలని, తడి-పొడి చెత్తను వేరువేరుగా సేకరించడం చెయ్యాలని అన్నారు. చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలు నిర్వహణను పక్కాగా చేపట్టాలని, ప్రతి ఒక్కరిలో మంచి ఆలోచనతో మార్పు రావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజలు, స్వయం సహాయక సంఘాలు, యువత, వ్యాపారవేత్తలు, గ్రీన్ అంబాసిడర్లు భాగస్వామ్యులై పరిసరాలను శుభ్రంగా ఉంచాలని అన్నారు. జూన్/అక్టోబర్ 2026 నాటికి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ రహిత రాష్ట్రంగా మార్చడమే ప్రధాన ఉద్దేశంగా రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతను ఇస్తోందని అన్నారు. ప్రజలలో పర్యావరణం పట్ల అవగాహన పెంచి, పరిశుభ్రతను ఒక జీవన విధానంగా మార్చాలని లక్ష్యంగా పెట్టుకున్నామని అన్నారు. వ్యర్థాలు నుండి సంపద సృష్టించడం, ఈ- వ్యర్థాలు సేకరణ, సురక్షితమైన రీసైక్లింగు పద్ధతులుపై అవగాహన కల్పించడం చెయ్యాలని అన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటడం, చెట్లు సంరక్షణ కార్యక్రమాలు చేపట్టడం, ప్లాస్టిక్, క్యారీ బ్యాగులు వాడకాన్ని తగ్గించడం, నీటి సంరక్షణపై దృష్టి సారించడం దృష్టి పెట్టాలని అన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు, విద్యార్థులు, యువత, స్వచ్ఛందసంస్థలు భాగస్వామ్యం అయ్యి పరిసరాలు పరిశుభ్రత కార్యక్రమాలు, ప్రజలకు అవగాహన పెంచుకుని ముందుకు వచ్చి ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దు కోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టరు బొల్లిపల్లి వినూత్న, జెడ్పీ సిఈవో పి.జగదాంబ, జిల్లా పంచాయతీశాఖ అధికారి కె.అనురాధ, డివిజనల్ పంచాయతీ అధికారి యం.పి.యన్. సుందరి, తహశీల్దారు డి.ప్రశాంతి, ఇంచార్చి యంపిడివో బి.ఏ. సత్యనారాయణ, వివిధ శాఖలు అధికారులు, గ్రామ సచివాలయం ఉద్యోగులు, గ్రామ పెద్దలు, ప్రజలు, క్లాప్ మిత్రాలు, తదితరులు పాల్గొన్నారు.

# చెత్తను బహిరంగంగా పడేయొద్దు.. ప్రజలు కూడా స్వీయ బాధ్యత పాటించాలి

**ఎమ్మెల్యే చింతమనేని పిలుపు.**

ప్రజా భూమి ప్రతినిధి-పెదవేగి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతి శనివారం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న "స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర" కార్యక్రమంలో భాగంగా పెదవేగి మండలం దుగ్గిరాల గ్రామంలో శనివారం ఉదయం ముమ్మర పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టారు. ఈ శ్రమదాన కార్యక్రమంలో దెందులూరు శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్ ముఖ్య అతిథిగా పాల్గొని స్వయంగా క్షేత్రస్థాయిలోకి దిగారు.

**పారిశుద్ధ్య శ్రామికులతో కలిసి ఎమ్మెల్యే శ్రమదానం:**

ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ కేవలం ప్రసంగాలకో, ఫోటో ఫోజులకే పరిమితం కాకుండా, స్వయంగా పారిశుద్ధ్య శ్రామికులతో కలిసి నడిచారు. బహిరంగ ప్రదేశాలలో, రోడ్ల పక్కన పడేసి ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలు, కవర్లను ఆయన స్వహస్తాలతో సేకరించారు. అనంతరం ఆ చెత్తను పంచాయతీ ట్రాక్టర్లు, వ్యర్థాల తరలింపు వాహనాల ద్వారా సురక్షిత ప్రాంతాలకు తరలించేలా పర్యవేక్షించారు. ఎమ్మెల్యే స్వయంగా రోడ్లు ఊడుస్తూ, చెత్త ఏరుతుండటం చూసి స్థానికులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో శ్రమదానంలో భాగస్వాములయ్యారు.

**అధికారులకు స్పష్టమైన ఆదేశాలు:**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్థానిక అధికారులతో సమీక్షించారు. గ్రామాల్లో ఎక్కడికక్కడ బహిరంగంగా ప్లాస్టిక్ వ్యర్థాలు పడకుండా చూడాల్సిన



పూర్తి బాధ్యత స్థానిక పంచాయతీ కార్యదర్శులదేనని స్పష్టం చేశారు. గ్రామాలను పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన వాతావరణంతో ఉంచేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ప్రజల్లో విస్తృతంగా అవగాహన సదస్సులు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

**ఉత్తమ పౌరులుగా ముందుకు సాగాలి:**

అనంతరం ప్రజలను ఉద్దేశించి ఎమ్మెల్యే చింతమనేని మాట్లాడుతూ.. "పరిశుభ్రత అనేది కేవలం ప్రభుత్వం లేదా పారిశుద్ధ్య కార్మికుల బాధ్యత మాత్రమే కాదు, అది ప్రతి ఒక్కరి స్వీయ బాధ్యత. ప్రజలు ఇళ్లలోని చెత్తను బహిరంగ ప్రదేశాల్లో, కాల్వల్లో పడేయడం మానుకోవాలి. ప్రతి ఒక్కరూ సామాజిక స్పృహ కలిగి ఉన్నప్పుడే స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్, స్వర్ణ ఆంధ్రప్రదేశ్‌గా మారుతుందని, సమాజంలో ఉత్తమ పౌరులుగా మన వంతు పాత్ర పోషించాలని" పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, పంచాయతీ సిబ్బంది, కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.

# అంగన్వాడి సెంటర్లో మెనూ ప్రకారం రుచికరమైన భోజనం అందించాలి

- నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవు.
- జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి.

ప్రజా భూమి ప్రతినిధి-ఏలూరు జిల్లా.



ముసునూరు మండలం వలసపల్లి గ్రామంలో శనివారం అంగన్వాడి ప్రీ ప్రైమరీ స్కూలును జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి ఆకస్మిక తనిఖీ చేశారు. చిన్నారులతో మమేకమై కొన్ని ప్రశ్నలను వేసి సమాధానాన్ని రాబట్టారు. ఇదే గ్రామంలో రెండు అంగన్వాడీ సెంటర్లో పది మందిని ప్రాథమిక పాఠశాలలో జాయిన్ చెయ్యుటకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని సిడిపివో జిల్లా కలెక్టరుకు వివరించారు. ఈ రోజు మెనూ ప్రకారం ఫ్రైడ్ రైసును చిన్నారులతో కలసి రుచిచూసి, నాణ్యత లేదని జిల్లా కలెక్టరు అసహనం వ్యక్తం చేశారు. పునరావతం అయితే శాఖా పరమైన చర్యలు తప్పవని జిల్లా కలెక్టరు హెచ్చరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ అంగన్వాడీ ప్రీస్కూలులో విద్యను పూర్తి చేసుకున్న విద్యార్థులు ప్రాథమిక పాఠశాలలో నూరుశాతం చేరికలు ఉండాలని అన్నారు. నిర్ణీత వయస్సు దాటిన ప్రతి చిన్నారిని అంగన్వాడి స్కూల్లో చేర్పించి, విద్యాబుద్ధులు నేర్పించాలని సూచించారు. అంగన్వాడి సెంటర్లో మెనూ ప్రకారం రుచికరమైన భోజనం అందించాలని, నాణ్యత లోపిస్తే చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో లభించే ప్రయోజనాలుపై అవగాహన కల్పించి, వారిని ప్రభుత్వ పాఠశాలలు వైపు ఆకర్షించేలా చూడాలని అన్నారు. మెరుగైన మౌళిక సదుపాయాలు, సుశిక్షితులు అయిన టీచర్లు, ఉచిత పాఠ్యపుస్తకాలు మరియు నోటు పుస్తకాలు పంపిణీని విద్యార్థులు తల్లిదండ్రులకి వివరించాలని అన్నారు. ఉచిత యూనిఫారాలు, డిజిటల్ క్లాసు రూమ్లు, నాణ్యమైన బోధన మరియు ఇంగ్లీష్ మీడియం, మధ్యాహ్న భోజనపథకం తదితర పథకాలను అవగాహన కల్పించి లక్ష్యాలను అధిగమించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టరు బొల్లిపల్లి వినూత్న, జెడ్పీ సిఈవో పి.జగదాంబ, జిల్లా పంచాయతీశాఖ అధికారి కె.అనురాధ, డివిజనల్ పంచాయతీ అధికారి యం.పి.యన్. సుందరి, తహశీల్దారు డి.ప్రశాంతి, ఇంచార్చి యంపిడివో బి.ఏ. సత్యనారాయణ, సిడిపివో పి.విజయకుమారి, అంగన్వాడీ టీచర్లు యం.కృష్ణ కుమారి, పి.కుమారి, గ్రామ సచివాలయ ఉద్యోగులు,అంగన్వాడి చిన్నారులు, తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి ప్రభుత్వం ఓట్లు హడావుడి అయిన తర్వాత నోట్లు దండుకుంటుంది

- ఒక్కసారిగా డీజిల్ పెట్రోల్ ధరలు పెంచి వేసింది
- సామాన్యుడు నడ్డి విరుస్తుంది

ప్రజా భూమి ప్రతినిధి-జీలుగుమిల్లి




బిజెపి ప్రభుత్వం ఓట్లు కార్యక్రమం అవ్వగానే నోట్లు దండుకుంటుందని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు తెల్లం రామకృష్ణ దుయ్యబడ్డారు. ధర్నా కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ దేశంలోనే ఐదు రాష్ట్రాల్లో ఎలక్షన్లు అనంతరం బిజెపికి ఓట్లు సంబంధం ఉండదని ప్రజల నుండి ఓట్లకు బదులు నోట్లు దండుకునే దాంట్లో భాగంగా ఎలక్షన్ ఓట్లు లెక్కింపైన పది రోజులైనా గడవకముందే ప్రజలపై గ్యాస్ రూపేనా, పెట్రోల్ పై లీటరుకు మూడు రూపాయలు, డీజిల్ పై రెండు రూపాయలు భారం మోగడం బాధాకరమని, ఈ పెంచిన పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలు తగ్గించుకుంటే రానున్న కాలంలో ప్రజలే ఈ ప్రభుత్వానికి బుద్ధి చెప్పరా చెప్తారన్నారు. సామాన్యులను నటి విరిచి ఏ ప్రభుత్వం కూడా మనుగుడా సాగించదని జోష్యం చెప్పారు.

ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కన్వీనర్ సిరి బత్తుల సీతారామయ్య సిఐటియు మండల కార్యదర్శి చిట్టి బొమ్మ కొండలరావు గిరిజన సంఘం నాయకులు గుండెగంగరాజు, పోలోజు నాగేశ్వరరావు, జోగమ్మ, శ్రీను, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## స్కూల్ బస్సుల తనిఖీలు ముమ్మరం
-181 బస్సులకు నోటీసులు




ప్రజా భూమి ప్రతినిధి-జీలుగుమిల్లి

రవాణా శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు డివిజన్ పరిధిలో స్కూల్ బస్సుల తనిఖీలు కొనసాగుతున్నాయి. ఇన్‌చార్జి ఆర్టీవో ఎస్.ఎస్. రంగనాయకులు ఆధ్వర్యంలో దర్భగూడెంలోని సెయింట్ పీటర్ అండ్ పాల్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో గురువారం నాలుగు బస్సులను తనిఖీ చేశారు. డివిజన్లో మొత్తం 296 స్కూల్ బస్సులు ఉండగా, ఇప్పటివరకు 23 పాఠశాలల్లో 220 బస్సులను పరిశీలించినట్లు అధికారులు తెలిపారు. భద్రతా లోపాలు గుర్తించిన 181 బస్సులకు నోటీసులు జారీ చేసి, వెంటనే లోపాలు సరిచేసుకోవాలని ఆదేశించారు. బస్సుల్లో అత్యవసర ద్వారం, ఫైర్ ఎక్స్‌టింగ్విషర్, ప్రథమ చికిత్స పెట్టె, వేగ నియంత్రణ పరికరాలు తప్పనిసరిగా ఉండాలని సూచించారు. అలాగే ఫిట్‌నెస్, ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్ తదితర పత్రాలు చెల్లుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో కేడీవీ రవిగోపాల్, సీహెచ్ సత్యనారాయణమూర్తి తదితర అధికారులు పాల్గొన్నారు.

# డెంగ్యూ నిర్మూలనకు సమిష్టి కృషి అవసరం

ప్రజాభూమి ప్రతినిధి-ఆగిరిపల్లి



ప్రపంచ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా ఆగిరిపల్లి ఈదర , సగ్గూరు ప్రాథమిక వైద్య శాల ఆధ్వర్యంలో శనివారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ గ్రామాల్లో ర్యాలీలు, గ్రూప్ సమావేశాలు నిర్వహించి ప్రజలకు డెంగ్యూ వ్యాధి నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. అలాగే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ దోమల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డాక్టర్ జగన్ మోహన్ రావు, డాక్టర్ టీనా, డాక్టర్ కె. నరేంద్ర కృష్ణ, డీపీఓ ఏలూరు, వైద్యాధికారులు డాక్టర్ జ్ఞాన సందీప్, డాక్టర్ మంజులాదేవి, డాక్టర్ సంధ్యా ప్రియ పాల్గొని డెంగ్యూ వ్యాప్తి నిరోధంలో ప్రజల భాగస్వామ్యం అత్యంత ముఖ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, సీహెచ్‌వో/ఎంఎల్‌హెచ్‌పీలు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో రైతులకు అన్యాయం

- సబ్సిడీపై పరికరాలు ఇచ్చేందుకు లాటరీ వేస్తారా ?
- మాజీ సొసైటీ చైర్మన్ సాయిన కనకరాజు ధ్వజం

ప్రజా భూమి ప్రతినిధి-కామవరపుకోట



కూటమి ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో నిజమైన పేద రైతులు, అర్హులకు తీవ్రమైన అన్యాయం జరుగుతుందని వ్యవసాయ సలహా మండలి కమిటీ మాజీ చైర్మన్, కామవరపుకోట సొసైటీ మాజీ ఛైర్మన్ సాయిన కనకరాజు శనివారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ పరికరాలపై సబ్సిడీలు... సాగు పరికరాలు అంటూ ప్రభుత్వం విడుదల చేసిన నోటిఫికేషన్‌లోని నిబంధనలు నిజమైన పేద, చిన్న, సన్నకారు రైతులకు తీవ్ర అన్యాయం చేసేలా ఉన్నాయని వాపోయారు. పైకి రైతులకు రాయితీలు అంటూ డాబుగా చెప్పుకుంటూ.. లోపల పెట్టిన నిబంధనలతో పేదలకు సబ్సిడీలు అందకుండా ప్రభుత్వం రైతులను మోసం చేస్తోందని ఆయన విమర్శించారు. కష్టపడి వ్యవసాయం చేసే రైతుకు రాయితీతో పరికరాలు ఇవ్వాలా వద్దా అనేది లాటరీ ద్వారా తేల్చడం అత్యంత దారుణం అని... ఈ పద్ధతి వల్ల అర్హులు, డ్రిప్ పరికరాలు అవసరమైన రైతులు, నిరుపేదలకు అన్యాయం జరుగుతుందన్నారు. రైతుల జీవితాలతో ప్రభుత్వం లాటరీ జూదం ఆడుతున్నట్టుగా ఈ పద్ధతి ఉందని కనకరాజు విమర్శించారు. రైతులు దరఖాస్తు చేసుకునేందుకు రెండు వారాల గడువు ఇవ్వడం.. గ్రామీణ ప్రాంతాల్లో సరైన ప్రచారం లేకపోవడంతో రైతులకు ఈ పథకం ఉన్నట్టు కూడా తెలియడం లేదన్నారు. దరఖాస్తు సమయం కూడా నెల రోజులకు పొడిగించాలని... ప్రభుత్వం ఈ లాటరీ విధానాన్ని రద్దు చేసి.. దరఖాస్తులు చేసుకున్నవారిలో పేదలు, చిన్న, సన్నకారు రైతులకు ఈ సబ్సిడీ పరికరాలు అందేలా చర్యలు తీసుకోవాలని కనకరాజు డిమాండ్ చేశారు.

# వరి పొలాల్లో గడ్డికి నిప్పు పెట్టి కాల్చడాన్ని నిలుపుదల చేయాలి

**ఆర్డీవోకు జనసేన శ్రేణులు ఫిర్యాదు.**

**ప్రజాభూమి ప్రతినిధి-రామచంద్రపురం**

రామచంద్రపురం నియోజకవర్గంలో చాలా చోట్ల వరి పంట కోత తర్వాత వదిలివేసిన గడ్డి కాండాన్ని పొలంలో నిప్పు పెట్టి కాల్చడం సమాజానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఈ విషయంలో నివారణ చర్యలు తీసుకోవాలని రామచంద్రపురం ఆర్డీవో ఏ. సరళావతికి పలువురు జనసేన శ్రేణులు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ మేరకు శనివారం ఈ విషయంపై ఆర్డిఓ కార్యాలయంలో సరళావతిని కలిసి సమస్యను వివరించి గడ్డిని కాల్చడంపై వచ్చే అనర్థాలను ఆర్డిఓకు తెలియజేశారు.వరి పంట కోత తర్వాత మిగిలిన కొయ్యలు లేదా కాండాన్ని కాల్చివేయడం వల్ల నేల సారవంతం పోయి భూమి సహజ గుణం మరుగున పడే అవకాశం ఉందని దీనివల్ల నేల ఉష్ణోగ్రత పెరిగి పంటలకు మేలు చేసే సూక్ష్మజీవులు నశిస్తాయని, అదేవిధంగా మానవాళికి వాయు కాలుష్యం పెరిగి తీవ్రమైన జబ్బులు వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. భూసారం తగ్గి వ్యవసాయ పరమైన నష్టాలు శాస్త్రీయంగా ఏవిధంగా ఉంటాయనేది తెలియజేశారు .సేంద్రీయ కార్బన్ నాశనం నేలసారం తగ్గిపోవడానికి కారణం భూమిలో ఉండే నత్రజని భాస్వరం పొటాషియం వంటి ముఖ్యమైన సూక్ష్మ పోషకాలు జింకు సల్ఫర్ పూర్తిగా నశిస్తాయని అదేవిధంగా మిత్ర సూక్ష్మజీవులు కూడా పొలంపై పొరల్లో ఉండే బ్యాక్టీరియా సిలింద్రాలు పంటలకు రైతులకు మిత్రులుగా ఉండే పురుగులు కాలిపోయి భూమినిస్సారంగా మారుతుందని భూమికి నీటిని నిలుపుకునే శక్తి తగ్గిపోయి , పంట ఎండిపోయే అవకాశం ఉంటుందని ఒక రకమైన వాయు కాలుష్యం ఏర్పడి కార్బన్ మోనాక్సైడ్ కార్బన్డయాక్సైడ్ వంటి ప్రమాదకరమైన వాయువులు కలిసి శ్వాస కోస సమస్యలు ప్రజలకు వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు.



ఈ విధమైన నష్టాలు సమాజానికి కలుగుతున్న సమయంలో రైతులు ప్రత్యామ్నాయలు వెతికి పంట కోతల తర్వాత దుక్కి దున్నడం లేదా డీకంపోజర్లను వాడి పంట వ్యర్థాలు త్వరగా కుళ్లిపోయేలా చేసి అవి భూసారం పెరిగేలా సులభంగా జరిగే మార్గం, ఈ రకమైన చర్యలు తీసుకుని వ్యవసాయనికి సంబంధించిన ప్రభుత్వ డిపార్ట్మెంట్ లకు ఆయా డిపార్ట్మెంట్లకు రామచంద్రపురం నియోజకవర్గంలో తమరి యొక్క ఆదేశాలతో అరికట్టే విధానం చేయాలని, రామచంద్రపురం నియోజకవర్గ జనసేన పార్టీ తరఫున ఆర్డీవోకు ఒక వినతి పత్రాన అందజేసినట్లు పేర్కొన్నారు. ఆర్డిఓ ను కలిసిన వారిలో జనసేన నాయకులు కొండ్రెడ్డి శ్రీనివాసరావు, సత్యవాడ శ్రీహరి పంతులు, మట్టా దుర్గారావు, పడాల లోవరాజు తదితరులు ఉన్నారు.

# ఓకే ఇంట్లో తల్లి కూతుళ్లకు రెండు రాష్ట్ర డైరెక్టర్ పదవులు.

- ఇదేనా పార్టీ ఇంటిలిజెన్సీ పనితీరు.
- 25 ఏళ్లుగా పనిచేసిన వారికి మొండి చేయి.
- పార్టీ పనితీరు పట్ల క్యాడర్లో అసంతృప్తి.
- అధిష్టానానికి తప్పుడు సంకేతాలు ఇస్తున్నారు.
- టిడిపి క్లస్టర్ ఇన్చార్జి ఇంట్లోనే రెండు రాష్ట్ర డైరెక్టర్ పదవులు.

**ప్రజాభూమి ప్రతినిధి-రామచంద్రపురం**

ఇటీవల నాటక అకాడమీలో రాష్ట్రవ్యాప్తంగా 25 మంది డైరెక్టర్లను ప్రకటించగా అందులో రామచంద్రపురం నియోజకవర్గంలో ఒకే కుటుంబానికి చెందిన తల్లి కూతుర్లకు చెరో పదవి ఒకే శాఖలో రాష్ట్ర నాటక అకాడమీలో స్టేట్ డైరెక్టర్లగా ప్రకటించడంతో పార్టీ ఇంటిలిజెన్స్ పనితీరును తప్పుపడుతూ ఆపార్టీ






క్యాడర్ అసంతృప్తిని వ్యక్తం చేస్తుంది. దీంతో ఒకే సామాజిక వర్గంలో ఒకే కుటుంబంలో రెండు రాష్ట్ర డైరెక్టర్ నామినేటెడ్ పదవులు ప్రకటించడం తెలుగుదేశం పార్టీ గొప్పదనం తేట తెల్లమవుతుంది. ఇలా ఇవ్వడం పార్టీ ఇంటిలిజెన్సీ పనితీరుకు పార్టీలో విలువలు దిగజారుతున్నాయి అనేటువంటిదానికి సాంకేతంగా నిలుస్తుంద అని ఆపార్టీకి చెందిన పలువురు సీనియర్ నేతలు అభిప్రాయపడుతున్నారు. దీంతో పార్టీలో సుధీరకాలం నుండి జెండా మోసిన నేతలకు గుర్తింపు లేకుండా పోవడానికి ఇదే నిదర్శనంగా చెప్పవచ్చు అని ఆ పార్టీకి చెందిన కేడర్ గుర్రుగా ఉంది . సుమారు 25 సంవత్సరాల నుండి ఆ పార్టీ జెండా మోస్తూ కష్టకాలంలో ఆర్థికంగా కూడా సపోర్ట్ చేసిన సీనియర్ నేతలకు సైతం పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ ఏ విధమైన పదవులు ఇవ్వక పోయినప్పటికీ ఇలా ఒకే కుటుంబంలో ఒకే సామాజి వర్గానికి రెండు పదవులు కట్టబెట్టడం సీనియర్ టిడిపి నేతలకు అవమానంగానే ఉందని పలువురు అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.

**క్లస్టర్ ఇన్చార్జి ఇంట్లోనే రెండూ రాష్ట్ర డైరెక్టర్ పదవులు.**

రామచంద్రపురం నియోజకవర్గం ద్రాక్షారామం కు చెందిన టిడిపి క్లస్టర్ ఇంచార్జ్ పెంకె సాంబశివరావు భార్య పెంకె అన్నపూర్ణ, ఆయన కుమార్తె వెంకే ప్రతిభా భారతి లకు రాష్ట్ర నాటక అకాడమీ ప్రకటించిన 25 డైరెక్టర్ పదవుల్లో రెండు పదవులు రామచంద్రపురం నియోజవర్గానికిలో బీసీ సామాజిక వర్గానికి చెందిన ఈ ఇద్దరిని ప్రకటించడం జరిగింది. దీంతో విషయం తెలుసుకున్న తెలుగుదేశం పార్టీ శ్రేణుల్లో అసంతృప్తి నెలకొని నియోజవర్గంలో అసలు తెలుగుదేశం పార్టీకి పూర్తిస్థాయిలో పనిచేసిన కార్యకర్తలకు కానీ సీనియర్లు కానీ విలువ లేకుండా పోయిందని బాహాటంగానే చెప్పుకుంటున్నారు. ఇదిలా ఉండగా నియోజవర్గం నుండి పార్టీ అధిష్ఠానానికి తప్పుడు సంకేతాలు వెళ్తున్నాయనేది స్పష్టంగా అర్థం అవుతుందని పలువురు టిడిపి సీనియర్ నేతలు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.

# పరిసరాల పరిశుభ్రతతోనే డెంగ్యూ, మలేరియాకు అడ్డుకట్ట

- పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్ సురపాటి ప్రశాంత్ కుమార్
- రంపచోడవరంలో ఘనంగా జాతీయ డెంగ్యూ దినోత్సవ ర్యాలీ

**రంపచోడవరం**

పోలవరం జిల్లాలో డెంగ్యూ, మలేరియా వంటి ప్రమాదకర వ్యాధులు ప్రబలకుండా ఉండాలంటే ఎక్కడికక్కడ దోమలను నిర్మూలించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జిల్లా జాయింట్ కలెక్టర్ (జేసీ) సురపాటి ప్రశాంత్ కుమార్ పిలుపునిచ్చారు. శనివారం జాతీయ డెంగ్యూ దినోత్సవాన్ని పురస్కరించుకుని రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయ ప్రాంగణంలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా జేసీ ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ.. ప్రతి ఏటా మే 16న జాతీయ డెంగ్యూ దినోత్సవాన్ని నిర్వహించుకుంటామని, ఇందులో భాగంగా ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు జాతీయ కీటక జనిత రోగ నియంత్రణ పథకం కింద ఈ ర్యాలీ చేపట్టినట్లు తెలిపారు. వర్షాకాలం ముంచుకొస్తున్న నేపథ్యంలో జిల్లాలోని ప్రతి గ్రామంలోనూ మురుగు నీటి కుంటలను నివారించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

**అంబేద్కర్ సెంటర్‌లో ప్రతిజ్ఞ..**

ఐటీడీఏ కార్యాలయం నుండి స్థానిక అంబేద్కర్ సెంటర్ వరకు వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ సెంటర్‌లో ప్రజలతో కలిసి జేసీ ప్రతిజ్ఞ చేయించారు. వారానికి ఒకసారి నీటి నిల్వలను ఖాళీ చేసి డ్రై-డే పాటించాలన్నారు. ఇళ్ల వద్ద ఉండే



కూలర్లు, పూల కుండీలు, పాత టైర్లలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, డెంగ్యూ లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రిని ఆశ్రయించాలని కోరారు. ఈ విషయాలపై పొరుగువారికి కూడా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

**ముమ్మరంగా నివారణ చర్యలు:**

జిల్లాలో దోమల వృద్ధిని అరికట్టేందుకు మున్సిపల్, పంచాయతీ సిబ్బందితో కలిసి వైద్య ఆరోగ్య శాఖ సమన్వయంతో పనిచేస్తోందని అధికారులు తెలిపారు. మారుమూల గ్రామాల్లో సైతం జ్వరాలు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు వివరించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ డిస్ట్రిక్ట్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పి. సరిత, జిల్లా మలేరియా అధికారి భాస్కర్ రావు, వైద్యాధికారులు డా. శ్వేత, డా. నీలిమ, వై.వి.వి. సత్యనారాయణ, పెద్ద సంఖ్యలో ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు మరియు ఐటీడీఏ సిబ్బంది పాల్గొన్నారు.

## స్వచ్ఛ ఆంధ్ర లక్ష్య సాధనకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

-ఎంపీడీవో అబ్దుల్ సలాం




**ప్రజాభూమి ప్రతినిధి-ఆగిరిపల్లి**

ఆగిరిపల్లి మండలంలోని చిన్న ఆగిరిపల్లి గ్రామంలో శనివారం నిర్వహించిన సాసా కార్యక్రమంలో ఎంపీడీవో అబ్దుల్ సలాం పాల్గొని ఎంఎన్ఆర్ఈజీఎస్ కార్మికులకు స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమాల ప్రాముఖ్యతను వివరించారు. ప్రతి కుటుంబం తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తడి చెత్త-పొడి చెత్తను వేర్వేరుగా నిల్వ చేసి సానిటరీ కార్మికులకు అందించాలని సూచించారు. ఇళ్ల వద్ద ఉన్న పాత అట్టలు, ప్లాస్టిక్ వ్యర్థాలు వంటి వేస్ట్ సామగ్రిని స్వచ్ఛ రథానికి అందించి, దానికి బదులుగా అవసరమైన నిత్యావసర వస్తువులు పొందవచ్చని తెలిపారు. శనివారం ఉదయం ఆగిరిపల్లి మెయిన్ బజార్లో స్వచ్ఛ రథాన్ని పరిశీలించిన సలాం మెయిన్ బజార్ లో ఉన్న దుకాణాల వద్ద ఉన్న పాత అట్టలను సేకరించి వాటి విలువకు సరిపడ నిత్యావసర వస్తువులను వ్యాపారస్తులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, చిన్న ఆగిరిపల్లి గ్రామ సెక్రటరీ ప్రియ కుమార్, జూనియర్ అసిస్టెంట్ జోసఫ్ విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ తలుపులమ్మ తల్లి ఆలయ నూతన పాలకమండలి ఇదే..

**ప్రజాభూమి ప్రతినిధి-తుని**



ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ తలుపులమ్మ తల్లి ఆలయానికి రాష్ట్ర ప్రభుత్వం నూతన పాలకవర్గాన్ని ప్రకటించింది. మొత్తం 13 మంది సభ్యులతో కూడిన నూతన కమిటీని ప్రభుత్వం అధికారికంగా నియమించింది.ఈ నూతన పాలకవర్గ సభ్యులుగా పెంటకోట భాస్కర సత్యనారాయణ, అరిగెల వరలక్ష్మి, కొండవీటి రాధిక, ఆవుగడ్డి వెంకటరమణ, గాబు మాలతీదేవి, అల్లూరి వెంకటపతి, దండేం రామకృష్ణ, కొమ్ము దేవి, యాదాల కృష్ణవేణి, భూసాల నూకరత్నం, వారాధి లోవ, ఎడ్ల సూరిబాబు, మరియు బంగారు శివలక్ష్మి నియమితులయ్యారు. ఆలయ అభివృద్ధి, భక్తుల సౌకర్యార్థం ఈ నూతన కమిటీ త్వరలోనే బాధ్యతలు స్వీకరించనుంది.

## వట్టిగుడిపాడులో స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర అవగాహన కార్యక్రమం

**ప్రజాభూమి ప్రతినిధి-ఆగిరిపల్లి**



ఆగిరిపల్లి మండల పరిధిలోని వట్టిగుడిపాడు గ్రామంలో స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్ర మంలో భాగంగా ప్రతి మూడో శనివారం నిర్వహించే ప్రత్యేక అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఇంటింటి నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించడం, మూలస్థాయిలోనే చెత్తను విభజించడం, పొడి చెత్తను స్వచ్ఛ రథానికి విక్రయించడం, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియో గాన్ని నిషేధించడం, తడి చెత్తతో ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రంలో వర్మీ ప్రాసెసింగ్ విధానంపై గ్రామ స్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో ఆనంద్ బాబు, పంచా యతీ సెక్రటరీ గణేష్, గ్రీన్ అంబాసిడర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, ఉపాధి హామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్‌ని నిషేధించి పర్యావరణాన్ని కాపాడండి

-కాజులూరు ఎంపీడీవో రాంబాబు.





**ప్రజాభూమి ప్రతినిధి-కాజులూరు**

ప్లాస్టిక్ నిషేధించి పర్యావరణాన్ని కాపాడాలని కాజులూరు మండల అభివృద్ధి అధికారి జె. రాంబాబు సూచించారు ఈ మేరకు శనివారం స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా కాజులూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయం, కాజులూరు గ్రామ పరిసర ప్రాంతాల్లో ప్లాస్టిక్ వస్తువులను నిషేదించి పర్యావరణాన్ని కాపాడాలి అనే నినాదంతో ఎంపీడీవో జె. రాంబాబు ఆధ్వర్యంలో ర్యాలి నిర్వహించి సింగిల్ యూస్ ప్లాస్టిక్ నిర్మూలన చర్యలు, క్లాత్ బాగ్స్ మరియు పునర్వినియోగ వస్తువుల వినియోగం వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ కాజులూరు మెయిన్ రోడ్ కూడలి నందు వివిధ శాఖల అధికారుల సిబ్బందితో మానవహారం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయ పరిపాలనా అధికారి ఆర్. పద్మలత, మండల విద్య శాఖ అధికారులు డేవిడ్,జాన్ లతో పాటు మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, ఉపాధి హామీ కార్యాలయ సిబ్బంది, వెలుగు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు .అలాగే కాజులూరు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఇంధన వనరుల ఆదాకు మంత్రి పార్థసారథి ఆదర్శం



**ప్రజాభూమి ప్రతినిధి-నూజివీడు**

స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పాల్గొనేందుకు రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి శనివారం ఎలక్ట్రిక్ వాహనంలో నూజివీడు చేరుకున్నారు. విజయవాడ నుంచి ఎలక్ట్రిక్ వాహనంలో వచ్చి, బాపునగర్‌కు ఎలక్ట్రిక్ బైక్‌పై చేరడం ద్వారా ఇంధన వనరుల ఆదాపై ప్రత్యేక సందేశం ఇచ్చారు. కాన్వాయ్‌లో కేవలం ఒకే వాహనం ఉండేలా చూసిన మంత్రి, తన సిబ్బంది, గన్‌మెన్‌లను కూడా అదే వాహనంలో తీసుకువచ్చారు. మంత్రి తీసుకున్న ఈ చర్యలను స్థానికులు అభినందిస్తూ, చెప్పిందే కాక చేసి చూపించే నాయకుడిగా పార్థసారథిని కొనియాడారు.

# గిరిభూముల్లో రబ్బరు సిరులు

- మూడు మండలాల్లో 3 వేల ఎకరాల్లో ప్లాంటేషన్ల సాగు
- ఈ ఏడాది కనీసం వెయ్యి ఎకరాలే లక్ష్యం
- రైతులకు అంతర్ పంటలు, ఉపాధి హామీ అనుసంధానంతో లబ్ధి
- రంపచోడవరం ఐటీడీఏ పీవో, జేసీ సురపాటి ప్రశాంత్ కుమార్

**రంపచోడవరం**

మన్యం ప్రాంత గిరిజన రైతులు ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు రబ్బరు ప్లాంటేషన్ల (తోటల) పెంపకానికి తగిన చర్యలు చేపడుతున్నట్లు రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి (పీవో), పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్ సురపాటి ప్రశాంత్ కుమార్ వెల్లడించారు. శనివారం స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో డ్వామా, వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులు, ఎంపీడీవోలు, ఉపాధి హామీ ఏపీవోలతో రబ్బరు తోటల పెంపకంపై ఆయన సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జేసీ ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ.. మారేడుమిల్లి, రంపచోడవరం, వై.రామవరం మండలాల్లోని గిరిజనుల భూముల్లో సుమారు 3 వేల ఎకరాల్లో రబ్బరు ప్లాంటేషన్లు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం 700 ఎకరాలకు సంబంధించి రైతుల నుంచి దరఖాస్తులు



వచ్చాయని, ఈ ఏడాది కనీసం వెయ్యి ఎకరాల్లో తోటలు వేసేలా గిరిజన రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. రబ్బర్ బోర్డుతో అనుసంధానం చేస్తూ ఈ ప్లాంటేషన్లను అభివృద్ధి చేస్తామన్నారు. వారం రోజుల్లోగా అర్హులైన రైతులను గుర్తించి నివేదికలు ఇస్తే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామని స్పష్టం చేశారు.

**అంతర్ పంటలతో అదనపు ఆదాయం..**

రబ్బరు తోటలు వేసిన 5 నుంచి 7 ఏళ్ల తర్వాత నాణ్యమైన దిగుబడితో పాటు స్థిరమైన ఆదాయం వస్తుందని జేసీ వివరించారు. రైతులు నష్టపోకుండా ఉండేందుకు మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తూ, రబ్బరు



కొనుగోలుదారులతో ముందస్తు ఒప్పందాలు (ఎంఓయూ) కుదుర్చుకునేలా చర్యలు తీసుకుంటామన్నారు. రానున్న వర్షాకాలంలోనే దరఖాస్తు చేసుకున్న రైతులకు రబ్బరు మొక్కలు నాటడానికి వీలుగా తక్షణమే యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని ఆదేశించారు. తోటలు పెంచే రైతులకు ఉపాధి హామీ పనులను అనుసంధానం చేయడంతో పాటు, అదనపు ఆదాయం కోసం తోటల్లో అంతర్ పంటలు వేసుకునేలా ఐటీడీఏ తరఫున పూర్తి ప్రోత్సాహం అందిస్తామన్నారు.

**క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలి..**

వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులు, ఉపాధి హామీ ఏపీవోలు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ రైతులకు సాంకేతిక అవగాహన కల్పించాలని, సాగులో ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే ఐటీడీఏ దృష్టికి తీసుకురావాలని పీవో సూచించారు. రబ్బరు షీట్ల ప్రాసెసింగ్ కోసం రైతులకు ఎన్ని స్మోకింగ్ రూమ్‌లు అవసరమవుతాయనే వివరాలను ఆయన అధికారులను ఆరా తీశారు.

ఈ సమావేశంలో ఐటీడీఏ ఏపీవో (జనరల్) డి.ఎన్.వి. రమణ, డ్వామా పీడీ మహేశ్వరరావు, జిల్లా ఉద్యానవన అధికారి దేవదానం, ఏపీడీ శ్రీనివాస్ విశ్వనాథ్, ఏడీఏలు సావిత్రి, బిందు, ఎంపీడీవో బాపన్నదొర, ఏవో పి. జయంతి, హార్టికల్చర్ అధికారి ముత్తయ్య, మండల వ్యవసాయ అధికారులు కె. లక్ష్మణ్, సుజాత, ఏపీవోలు బి. సత్యనారాయణ, స్వామి, మణికుమారి, ఏపీ సీఎన్ఎఫ్ సాధికార సంస్థ ప్రతినిధి రాబిన్ తదితరులు పాల్గొన్నారు.

# పెట్రోల్ డీజిల్ ధరలు వెంటనే తగ్గించాలని అఖిలపక్షం ఆధ్వర్యంలో నిరసన

**ప్రజా భూమి ప్రతినిధి-వేలేరుపాడు**

పెంచిన పెట్రోల్ డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ, అఖిలపక్షం ఆధ్వర్యంలో శనివారం వేలేరుపాడు ప్రధాన సెంటర్లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పార్టీలకు చెందిన నాయకులు మాట్లాడుతూ, ప్రభుత్వం తమ ఇష్టానుసారమైన నిర్ణయాలతో పేద మధ్యతరగతి కుటుంబాలను ఆర్థికంగా ఎంతో నష్టపరుస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెట్రోల్ డీజిల్ ధరలు పెరగటం వలన నిత్యవసరాలతో పాటు అన్ని వస్తువులు అధిక ధరలు పెరిగే అవకాశం ఉందన్నారు. సామాన్యుడిపై అధిక భారం మోపుతూ ప్రభుత్వాలు పబ్బం గడుపుకుంటున్నాయని అన్నారు. వెంటనే పెట్రోల్ డీజిల్ ధరలు తగ్గించకుంటే భవిష్యత్తులో మరిన్ని పోరాటాలు ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కారం దారయ్య సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సన్నేపల్లి సాయిబాబు,




పిట్టా ప్రసాద్ సిపిఐ మండల కార్యదర్శి బాడిశ రాము సిపిఎం మండల కార్యదర్శి ధర్మాల రమేష్,సీఐటీయూ జిల్లా కార్యవర్గ సభ్యులు మడివి దుర్గారావు,సిపిఎం మండల కమిటీ సభ్యులు కొత్త వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కొల్లూరి సత్యనారాయణ మాచర్ల భీమయ్య .వెంకటస్వామి ఫ్రెండ్స్ ఆటో యూనియన్ మండల అధ్యక్షులు కురిమెల్ల శ్రీను అమరావతి ఆటో యూనియన్ అధ్యక్షులు కమ్మచిచ్చు రమేష్ ఎస్ కే పాషా పర్శిక బజార్ బంధం చంటి ,రెడ్లం ప్రసాద్. బంధ అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాభూమి
అనంతపురం,శ్రీసత్యసాయి జిల్లా 6
ఆదివారం 17 మే 2026

# ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రలు

## ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి. కేశవరెడ్డి, ఉప ప్రధాన కార్యదర్శి డి. పెద్దయ్య

ప్రజాభూమి, పుట్లూరు.



గ్రామీణ పేదల జీవనాధారంగా నిలిచిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని (ఎంఎన్ఆర్ఈజీఎస్) కేంద్ర ప్రభుత్వం దశలవారీగా నిర్వీర్యం చేయడానికి కుట్రపూరిత చర్యలు చేపడుతోందని పుట్లూరు మండలం లో నీ అరకటవేముల గ్రామంలో" శనివారం జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించి కూలీలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి. కేశవరెడ్డి, ఉప ప్రధాన కార్యదర్శి డి పెద్దయ్య. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ! దేశవ్యాప్తంగా కమ్యూనిస్టు పార్టీల ఉద్యమాల ఫలితంగానే గ్రామీణ ఉపాధి హామీ చట్టం అమలులోకి వచ్చిందన్నారు. "పేదలకు పనైనా పెట్టండి, తిండైనా పెట్టండి" అనే నినాదంతో కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు జరిగిన భారీ ప్రజా ఉద్యమాల ఒత్తిడితోనే 2005లో అప్పటి ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ ప్రభుత్వంపై వామపక్ష పార్టీల ఎంపీలు తీవ్ర ఒత్తిడి తీసుకువచ్చారని, దాని ఫలితంగానే ఉపాధి హామీ చట్టం దేశంలో అమలులోకి వచ్చిందని గుర్తు చేశారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా సుమారు 20 కోట్ల మంది కూలీలు ఈ పథకంపై ఆధారపడి జీవిస్తున్నారని పేర్కొన్నారు. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత బీజేపీ ప్రభుత్వం ఈ చట్టాన్ని బలహీనపరచడానికి పలు మార్గాల్లో ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఉపాధి హామీ చట్టాన్ని చట్టబద్ధ హక్కు నుంచి కేవలం ఒక ప్రభుత్వ పథకంగా మార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని, చట్టానికి ఉన్న రాజ్యాంగ పరిరక్షణను తగ్గించే విధానాలు అమలు చేస్తున్నారని ఆరోపించారు. మహాత్మా గాంధీ పేరు తొలగించి " వి బిజి రాంజీ" పేరిట మార్పులు తీసుకురావడం కూడా ఆ కుట్రలో భాగమేనన్నారు. అలాగే కేంద్రం 60 శాతం, రాష్ట్రాలు 40 శాతం నిధులు భరించాలనే నిబంధనలు విధించడం వెనుక కూడా రాజకీయ ఉద్దేశాలే ఉన్నాయని విమర్శించారు. ఆర్థికంగా వెనుకబడిన రాష్ట్రాలకు ఇది భారమవుతుందని, ఫలితంగా పనులు తగ్గిపోతాయని చెప్పారు. గతంలో ఉపాధి హామీ పనుల్లో వ్యవసాయ కూలీలకు అనేక సౌకర్యాలు ఉండేవని, పనులకు అవసరమైన పనిముట్లు కూడా అందించేవారని ఈశ్వరయ్య గుర్తు చేశారు. పని పూర్తయిన వెంటనే కూలీల ఖాతాల్లో డబ్బులు జమ అయ్యేవని, దీంతో పేద కుటుంబాలు రోజువారీ జీవనాన్ని నెట్టుకొచ్చేవని అన్నారు. కానీ ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా మారిపోయిందని, నెలలు గడిచినా కూలీలకు వేతనాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వేతనాల చెల్లింపుల్లో తీవ్ర జాప్యం కారణంగా గ్రామీణ పేదలు అప్పుల పాలవుతున్నారని, కుటుంబ పోషణ కూడా కష్టంగా మారుతోందన్నారు. "పని చేయించిన వెంటనే కూలి ఇవ్వడం ప్రభుత్వ బాధ్యత. కానీ ఇప్పుడు కూలీలను తిరుగులాడిస్తూ అవమానించే పరిస్థితి తీసుకొచ్చారు" అని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ గ్రామ శాఖ కార్యదర్శి జ, ఓబుల్ పత్తి, కూలీలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యాభివృద్ధికి కృషి చేయడం అభినందనీయం

## -విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ

ప్రజాభూమి, హిందూపురం టౌన్



ఉచిత వేసవి బడుల ద్వారా మార్గదర్శి విద్యానికేతన్ నిర్వాహకులు పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేస్తుండటం అభినందనీయమని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున పేర్కొన్నారు. ఉచిత వేసవిబడి విద్యార్థులకు శనివారం నోటు పుస్తకాల పంపిణీ, అన్నదాన కార్యక్రమాల్లో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజ్యలక్ష్మి ఫ్లవర్ డెకరేషన్ నాగరత్న మోహన్ కుమార్ దంపతుల సౌజన్యంతో నిర్వహిస్తున్న వేసవిబడి విద్యార్థులకు పట్టణంలోని శ్రీ బృందావన్ ట్రేడర్స్ నిర్వాహకులు సి.కె.రవి, శ్రీసత్య, అన్సల్, సుజన్, అవ్యాన్ అన్నదానం చేశారు. ఇందులో భాగంగా కమీషనర్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ విద్యాభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలన్నారు. పేద విద్యార్థులు వేసవి సెలవులను వృథా చేసుకోకుండా ఇలాంటి బడుల ద్వారా ప్రయోజనం పొందాలన్నారు. అనంతరం కమిషనర్ మల్లికార్జునకు, అన్నదానం చేసిన బృందావన్ రవి, శానిటరీ ఇన్స్ పెక్టర్ శంకర్ లను పాఠశాల యాజమాన్యం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కె.మాళప్ప, కె.సాయికళ, రాజ్యలక్ష్మీ మోహన్, డ్రాయింగ్ మాస్టర్ శ్రీశైలం, డాన్స్ మాస్టర్ సాయి, మమత, కుమారి , గాయిత్రి తదితరులు పాల్గొన్నారు.

# పవర్ గేర్ కార్మికుల పోరాటానికి కార్మిక సంఘాల మద్దతు

ప్రజాభూమి, హిందూపురం టౌన్




సమస్యల పరిష్కారం కోసం హిందూపురం రూరల్ మండల పరిధిలోని తూమకుంట పారిశ్రామిక వాడలో కార్మికులు గత వారం రోజులుగా చేస్తున్న దశల వారీ ఆందోళనకు శనివారం పలు కార్మిక సంఘాలు మద్దతు ప్రకటించాయి. పవర్ గేర్ కార్మికుల నిరసనకు ఏఐటియుసి, ఏఐయుటియుసి, సిపిఐ, యస్.యూ.సి.ఐ నాయకులు మద్దతు ప్రకటించి మాట్లాడారు. కార్మికులకు యాజమాన్యం భరోసా ఇస్తూ చేసిన ఒప్పంద పత్రం మేరకు జీతాల పెంపు చేపట్టాలన్నారు. అదేవిధంగా అరియర్స్, లీవ్, శాలరీ తక్షణమే చెల్లించాలని లేనిపక్షంలో సమస్యలు పరిష్కారం చేసేంతవరకు కార్మికులకు అండగా ఉండి పోరాడుతామని హెచ్చరించారు. కార్మిక శాఖ అధికారులు ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం చాలా బాధాకరమని, వెంటనే కార్మిక శాఖ అధికారులు స్పందించాలన్నారు. ఈ కార్యక్రమంలో తూమకుంట పారిశ్రామిక వాడ కార్మిక సంఘం అధ్యక్షులు చౌళూరు రవికుమార్, ఏఐటియుసి జిల్లా గౌరవాధ్యక్షులు బండి ఆనంద్ రాజు, ఏఐటీయూసీ జిల్లా కార్యనిర్వాహణ అధ్యక్షులు కనిశెట్టిపల్లి వినోద్ కుమార్, జిల్లా కోశాధికారి బాబు, సిపిఐ తాలూకా సహాయ కార్యదర్శి ఇస్మాయిల్, ఏఐయుటియుసి రాష్ట్ర నాయకులు అశోక్, ఎస్ యు సి ఐ జిల్లా నాయకులు రామకృష్ణారెడ్డి, ఏఐవైఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కమల్ భాష, పవర్ గేర్ కార్మిక నాయకులు బాబు, శివప్ప, తిప్పేస్వామి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు రైతు సేవా కేంద్రాల ద్వారా నాణ్యమైన విత్తనాలు అందించండి

## భారతీయ జనతా పార్టీ శిశీగనమలనియోజకవర్గం మాజీ కో కన్వీనర్ కుందూ శ్రీనివాసుల రెడ్డి

ప్రజాభూమి, పుట్లూరు



పుట్లూరు మండల కేంద్రంలో కుందూ శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో ఒక సమావేశం నిర్వహించడం జరిగినది. ఈ సమావేశంలో శింగనమల నియోజవర్గంలో చాలామంది ప్రజలు వ్యవసాయం మీద ఆధారపడి జీవిస్తున్నారు. మన దేశంలో రెండవ కరువు జిల్లాలో ఉన్నటువంటి ఈ నియోజకవర్గంలో రైతులు పంటలు పండించుకోవాలంటే వర్షం ద్వారానే పండించాలి. ఈ వర్షం సరైన సమయంలో లేకపోవడం వలన రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయి. కావున రైతులకు పారం పాండుపట్టలు తగినంత సబ్సిడీతో ఇచ్చి సంపు నిర్మాణంలో సహాయపడవలసిందిగ, ఈ సంపులో నీరు నిల్వ చేసుకొని వాటిని డ్రిప్ ఇరిగేషన్ పద్ధతి ద్వారా పంటలకు అందించడం ద్వారా నీరు వృధా కాదు. మరియు రైతులకు డ్రిప్ పరికరాలు, ఇన్ లైన్, ఆన్లైన్ డ్రిప్పు కట్టలు కూడా సకాలంలో రాయితితో (సబ్సిడీ)ఇవ్వడం మరియు రైతులకు చాలా రకాల విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహార మందులు అవసరం ఉంటాయి. వాటిలో నకిలీ లేకుండా ఒరిజినల్ విత్తనాలు, మందులు రైతులకు అందే విధంగా వ్యవసాయ అధికారులు చూడాలని, అలాగే రైతు సేవ కేంద్రాల్లో రైతులకు నాణ్యమైన విత్తనాలు సబ్సిడీతో అందించాలని రైతులు పంటలు పండించడం వలన చాలామందికి ఉపాధి కలుగుతుంది. ప్రతి పల్లెలో కూలీలకు,వ్యాపారులకు,జనరల్ స్టోర్లకు, ఇలా ప్రజల అందరికీ రైతు ఉపయోగపడతాడు,రైతు బాగుంటే రాష్ట్రం బాగుంటుంది రాష్ట్రం బాగుంటే దేశం బాగుంటుంది, దేశం బాగుంటే దేశ ప్రజలు బాగుంటారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు శ్రీనాథ్ యాదవ్, ఓబులేష్, రామ శేఖర్ రెడ్డి, ఉత్తమ రెడ్డి, మధుసూదన్ రెడ్డి , కార్యకర్తలు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి

## -వైకాపా సమన్వయకర్త దీపికా వేణురెడ్డి

ప్రజాభూమి, హిందూపురం టౌన్



అధికారంలోకి వచ్చి రెండేళ్ల అవుతున్నా ప్రజల సమస్యలను పరిష్కరించడంలో విఫలం చెందిన కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని నియోజకవర్గ వైకాపా సమన్వయకర్త దీపికా వేణురెడ్డి సూచించారు. శనివారం పార్టీ కార్యాలయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హిందూపురం మున్సిపాలిటీకి సంబంధించిన 38 వార్డుల బూత్ స్థాయి ఏజెంట్ల సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రతి బూత్‌లో బూత్ ఇన్చార్జులు సైనికుల్లా పని చేయాలని సూచించారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న వైఫల్యాలను ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకువెళ్లాలని, రాబోవు స్థానిక సంస్థల ఎన్నికలలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేయడంలో బూత్ ఇన్చార్జ్ అలాగే కీలకమైన పాత్ర పోషించాలన్నారు. అందరూ కలిసికట్టుగా సమష్టిగా పార్టీ గెలుపు కోసం పనిచేయాలని కోరారు. కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతూ అధికారులను అడ్డం పెట్టుకొని వైకాపా కార్యకర్తలపై రాష్ట్ర వ్యాప్తంగా అక్రమ కేసులు బనాయిస్తూ ఇబ్బందులకు గురి చేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ప్రజలకు వివరించి చైతన్యవంతులను చేయాలన్నారు. అదేవిధంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి నాయకుల కవ్వింపు చర్యల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమావేశంలో పార్టీ అనుబంధ విభాగ ప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, బూత్ లెవెల్ ఇన్చార్జిలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# భ్రూణ హత్యలు నిరోధానికి ముప్పేట దాడి తప్పనిసరి జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ

ప్రజా భూమి, ప్రతినిధి అనంతపురం



కడుపులో ఆడబిడ్డ అని తెలిసినంతనే అబార్షన్ పేరుతో చిదిమివేయడం నిర్మూలించడానికి కఠిన చర్యలు తీసుకోవాలని, అనుమానితులపై నిఘా ఉంచాలని పెంచాలని జిల్లా గర్భస్థ శిశు లింగ నిర్ధారణ నిషేధ కమిటీ తీర్మానించింది. జిల్లా ఇన్చార్జ్ డిఎంహెచ్ఓ సి. శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన జిల్లాస్థాయి కమిటీ సమావేశం జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో శనివారం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా వైద్య అధికారి మాట్లాడుతూ లింగ నిర్ధారణ జరగకుండా తీసుకుంటున్న చర్యలు వివరించారు. అవగాహన శిబిరాలు, చట్టం గురించి హెచ్చరికలు అందిస్తున్నట్లు చెప్పారు. గర్భస్థ శిశు లింగ నిర్ధారణ నిషేధ చట్టం-1994 అమలుకు ప్రతిష్ట చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ముఖ్యంగా వరకట్న సమస్య ఆడపిల్లలకు రక్షణ లేకపోవడం వలన ఆడపిల్లలు అంటేనే బరువు బాధ్యత అనే దృక్పథముతో ఉండడం అలాగే మగపిల్లలే వంశోద్ధారకులు అనే వివిధ రకాల మూడ నమ్మకాల వలన లింగ వివక్షకు ముఖ్య కారణాలని వివరించారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేసి వివరాలు చెప్పమని అడిగినా అడగమని ప్రోత్సహించిన మరియు చెప్పిన వారికి మొదటి తప్పుకు చట్టప్రకారం మూడు సంవత్సరాలు జైలు శిక్ష మరియు 50 వేల రూపాయలు జరిమానా విధించబడుతుందని డిఎంహెచ్ హెచ్చరిస్తూ స్పష్టం చేశారు. మరి ముఖ్యంగా ఆరోగ్య కార్యకర్తలు క్షేత్రస్థాయిలో లింగ నిర్ధారణ చట్టరీత్య నేరమని గర్భిణీ స్త్రీ కుటుంబ సభ్యులలో ఉన్న అపోహలను తొలగించే విధంగా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అలాగే ప్రజలలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. ఆర్డిటి హెల్త్ డైరెక్టర్ దుర్గేష్ మాట్లాడుతూ రాబోవు తరాల్లో లింగ వివక్ష రూపుమాపేందుకు, ఉన్నత పాఠశాల, కళాశాలలో వకృత్వ వ్యాసరచన, స్కిట్ట్, పోటీలు నిర్వహించాలని, లింగ నిర్ధారణ చేసే స్కానింగ్ సెంటర్లను గుర్తించేందుకు పొరుగుసేవలు వినియోగిం చుకోవాలని, ఇద్దరు కంటే ఎక్కువ ఆడపిల్లలు ఉండి గర్భవతులుగా ఉన్న తల్లులను గుర్తించి వారిపై నిఘా ఉంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ సీతామాలక్ష్మి, డాక్టర్ సురేంద్ర నాథ్ రెడ్డి గైనకాలజిస్ట్, పెథాలజిస్ట్ భవాని, డెమో నాగరాజు న్యాయ సలహాదారులు ఆశ రాణి డిప్యూటీ మాస్ మీడియా అధికారి లక్ష్మీనారాయణ, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్స్ వేణుగోపాల్, గంగాధర్, విజయ్ భాస్కర్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలి -ఎన్.టి.ఏ.ఏజెన్సీని పూర్తిగా రద్దు చేయాలి

ప్రజాభూమి, హిందూపురం టౌన్




దేశవ్యాప్తంగా మే 3వ తేదీన జరిగిన నీట్ ప్రవేశ పరీక్షలలో 20 లక్షలకు పైగా రాశారని, పేపర్ లీకేజ్ జరిగిందనే కారణంతో పరీక్షను రద్దు చేయడం జరిగిందని పిడిఎస్ యూ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు బాబావలి పేర్కొన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా పేద, మధ్య తరగతి విద్యార్థుల జీవితాలతో కేంద్ర ప్రభుత్వం చెలగాటమాడుతోందని మండిపడ్డారు. దాదాపు 20 లక్షల మంది విద్యార్థులకు పైగా ఇంటర్మీడియట్ రెండు సంవత్సరాల విద్యను పూర్తి చేసుకొని నీట్ ప్రవేశ పరీక్ష సిద్ధమై పరీక్ష రాస్తే ఇప్పుడు పరీక్ష పేపర్ లీకేజ్ అయిందని పరీక్షను రద్దు చేయడం జరిగిందన్నారు. నీట్ ప్రవేశ పరీక్షకు విద్యార్థులు దరఖాస్తు చేసుకుని చాలా రోజుల నుంచి సిద్ధమవుతూ వివిధ జిల్లాల నుంచి వివిధ జిల్లాలకు పోయి పరీక్ష రాస్తే పేపర్ లీకేజ్ అయిందని రద్దు చేశారని వాపోయారు. విద్యార్థుల సమయాన్ని కేంద్ర ప్రభుత్వం వృథా చేయడమే కాకుండా ఆశలను పోయే విధంగా చేసిందని మండిపడ్డారు. గత సంవత్సరం కూడా ఇదే తరహాలో హర్యానా, బీహార్ రాష్ట్రాలలో నీట్ పరీక్ష పేపర్ ను రూ. 30 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు అమ్ముకొని లీకేజీ చేశారని గుర్తు చేశారు. ఈ ఏడాది కూడా అదే తరహాలోనే డబ్బులకు నీట్ పేపర్ ను అమ్ముతున్నారని మండిపడ్డారు. చాలామంది విద్యార్థులు బాగా చదువుకొని నీట్ ప్రవేశ పరీక్షలో సీటు సాధించాలనే ఆశతో పరీక్ష రాస్తే కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల పేపర్ ను లీకేజ్ చేయడం జరిగిందన్నారు. దానివల్ల విద్యార్థుల జీవితాలు తీవ్రంగా నష్టపోతాయని కేంద్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. ఎన్ టి ఏ ఏజెన్సీ ద్వారా నీట్ ప్రవేశ పరీక్షను కేంద్ర ప్రభుత్వం గత కొన్ని సంవత్సరాల నుంచి నిర్వహిస్తోందని, రెండు సార్లు లీకేజ్ కావడం కేంద్ర ప్రభుత్వానికి నీట్ ప్రవేశ పరీక్ష పైన ఎంత శ్రద్ధ చూపిస్తోందో అర్థం చేసుకోవాలన్నారు. నీట్ ప్రవేశ పరీక్ష లీకేజీ ఘటన రెండవసారి జరగడం, దీనికి నైతిక బాధ్యత వహిస్తూ తక్షణమే కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఆ సందర్భంలో ఎప్పుడూ కూడా నీట్ ప్రవేశ పరీక్షకు సంబంధించిన పేపరు లీకేజ్ జరగ లేదన్నారు. అయితే కేంద్ర ప్రభుత్వం విద్యాశాఖ మంత్రి నీట్ ప్రవేశ పరీక్షను డబ్బులకు అమ్ముకుంటూ విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని ఆందోళన చేశారు. తక్షణమే కేంద్ర ప్రభుత్వం స్పందించి ఎన్ టి ఏ ఏజెన్సీని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో విద్యార్థి సంఘం నాయకులు అనుదీప్, నాజీర్, నందిష్, భగత్, మహేష్, ప్రతాప్, సుభాష్, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ సహకారంతో స్టార్టప్‌లను ముందుకు తీసుకెళ్లాలి: జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్

ప్రజా భూమి, ప్రతినిధి అనంతపురం




రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ సహకారంతో స్టార్టప్‌లను ముందుకు తీసుకెళ్లాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ పిలుపునిచ్చారు. ప్రతి నెల మూడో శనివారం నిర్వహించే స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా నగరంలోని జేఎన్టీయూలో ఉన్న రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ అనంతపురము స్పోక్ ఆధ్వర్యంలో జిల్లా పరిశ్రమల కేంద్రం సమన్వయంతో "గ్రీన్ ఎంటర్‌ప్రెన్యూర్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్" అనే థీమ్‌తో ఘనంగా నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ, వ్యర్థాల నిర్వహణ, గ్రామీణ ఉపాధి అభివృద్ధి, గ్రీన్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ప్రోత్సాహం దిశగా స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా రీసైక్లింగ్, కంపోస్టింగ్, అప్సైక్లింగ్, డ్రై వేస్ట్ సేకరణ, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నివారణ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇదివరకు ఏదైనా కొత్త ప్రొడక్ట్‌ను మార్కెట్లోకి తీసుకురావాలన్నా లేదా సహకారం కావాలన్నా బెంగళూరు, హైదరాబాద్ వంటి పెద్ద నగరాలపై ఆధారపడాల్సి వచ్చేదన్నారు. అనంతపురం జిల్లాలో జేఎన్టీయూ, ఎస్కేయు వంటి పెద్ద విద్యాసంస్థలు, ఎన్నో కళాశాలలు ఉన్నాయని, అలాగే జిల్లాలో ప్రైమరీ సెక్టార్ అయిన అగ్రికల్చర్ మరియు హార్టికల్చర్‌లో ఎంతోమంది ఇన్నోవేటర్స్ ఉన్నారని, వీరందరినీ ముందుకు తీసుకెళ్లడానికి రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ వంటి సంస్థ చాలా అవసరమన్నారు. గత 3-4 నెలలతో పోలిస్తే, కొన్ని స్టార్టప్‌లు ఐడియా స్టేజ్ నుండి ప్రొడక్ట్ స్టేజ్ కి వెళ్లడం చాలా సంతోషకరమన్నారు. బెంగళూరు, హైదరాబాద్, తిరుపతి లేదా వైజాగ్‌తో పోలిస్తే మనం ఇంకా ప్రారంభ దశలోనే ఉన్నామని, ఒక పరిపూర్ణమైన స్టార్టప్ ఎకోసిస్టమ్ ఇక్కడ ఇంకా అభివృద్ధి చెందాల్సి ఉందన్నారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ సహకారంతో టెక్నాలజికల్‌గా, మార్కెటింగ్ పరంగా ఈ స్టార్టప్‌లను ఎలా ముందుకు తీసుకెళ్లాలనేదే దీని ముఖ్య ఉద్దేశం అన్నారు. జిల్లాలో కొత్త ప్రొడక్ట్స్‌ను ఎలా గుర్తించాలనేది ముఖ్యం అని, ప్రస్తుతం జిల్లాలో వృధాగా పడేస్తున్న బయోమాస్ (వ్యవసాయ వ్యర్థాలు) చాలా ఎక్కువగా ఉందని, అరటి, ఉల్లిపాయల వ్యర్థాలు వంటి వాటి నుండి ఎలాంటి ఆదాయం రాకుండా వాటిని పక్కన పెట్టేయాల్సి వస్తోందని, ఇలాంటి వ్యర్థాలను ఉపయోగించుకోవడానికి సర్క్యులర్ ఎకానమీ మోడల్‌లో మనకు మంచి అవకాశాలు ఉన్నాయన్నారు. ఇందాక తాను అక్కడే ప్రదర్శించిన స్టాల్‌లో అరటి నారతో చేసిన పాలు ఉత్పత్తులను చూశానని చాలా బాగున్నాయని పేర్కొన్నారు. మన జిల్లాలో జెఎన్టీయు వంటి పెద్ద విద్యాసంస్థ ఉందని, వారి దగ్గర ల్యాబ్స్ ఉన్నాయని, అలాగే వైఎస్ఆర్ కడప జిల్లాలో హార్టికల్చర్ యూనివర్సిటీ, మన జిల్లాలో అగ్రికల్చర్ రీసెర్చ్ స్టేషన్ వంటి ప్రభుత్వ సంస్థలు ఉన్నాయని, ఒక సాధారణ వ్యక్తి నేరుగా అగ్రికల్చర్ రీసెర్చ్ స్టేషన్‌నో లేదా ప్రైవేట్ కంపెనీలను సంప్రదించి ప్రొడక్ట్ డెవలప్ చేయలేడు. కానీ, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ సంస్థలన్నింటితో సమన్వయం చేసుకుని, అక్కడి సదుపాయాలను వాడుకునేలా చేస్తే, ఇది ఇక్కడి స్టార్టప్ ఎకోసిస్టమ్‌కు ఒక అయస్కాంతంలా మారుతుందన్నారు. గతంలో చదువుకునేటప్పుడు కేవలం ఉద్యోగం సంపాదించాలనే ఆలోచనే ఉండేదనీ, కానీ, ఈ 2026 నాటికి పరిస్థితి మారిందని, ఇప్పుడు టెక్నికల్ లేదా ఇతర యూనివర్సిటీల్లో చదివే పిల్లల్లో కనీసం 20 నుండి 30 శాతం మంది సొంతంగా స్టార్టప్ పెట్టుకోవాలనే మైండ్‌సెట్‌తో ఉన్నారన్నారు. స్టార్టప్ ఎకోసిస్టమ్‌లో 16 నుండి 30 సంవత్సరాల వయస్సు గల యువత రిస్క్ తీసుకోవడానికి ఎక్కువగా ఆసక్తి చూపిస్తారని, ఎందుకంటే వారికి భవిష్యత్తులో మరో 30-35 ఏళ్ల జీవితం ఉంటుంది కాబట్టి, వారు కొత్తగా ఏదైనా సాధించగలరన్నారు. కార్యక్రమంలో భాగంగా హబ్ తరపున మరిన్ని మంచి ప్రయత్నాలు జరగాలని కోరారు. అనంతరం స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర కింద జీఎం డిఐసి అందరి చేత ప్రతిజ్ఞ చేయించారు. అంతకు మునుపు అక్కడే ఏర్పాటు చేసిన పలు ఇన్నోవేటివ్ ప్రొడక్ట...

# ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా మానుకోవాలి

## -పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాభూమి, హిందూపురం టౌన్




ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా మానుకొని పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, అసిస్టెంట్ కమిషనర్ క్రాంతికుమార్ పిలుపునిచ్చారు. స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్రలో భాగంగా భాగంగా శనివారం పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక గాంధీ సర్కిల్ నుండి పరిగి బస్టాండ్ వరకు ప్లాస్టిక్ వ్యతిరేక నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ, నాసిరకం ప్లాస్టిక్ ను వినియోగించడం వల్ల పర్యావరణం దెబ్బతింటుందన్నారు. దీనికి తోడు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఉంచారు. ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించేందుకు మున్సిపాలిటీ ఎన్నో చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. పట్టణాన్ని అందంగా తీర్చిదిద్దేందుకు ప్రజలందరూ సహకరించాలన్నారు. ఇందులో భాగంగా నాసిరకం ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తున్న దుకాణాల నుండి స్వాధీనం చేసుకుని రూ.6 వేల అపరాధ రుసుం విధించారు. ఇకపై తరచూ తనిఖీలు నిర్వహించి నాసిరకం ప్లాస్టిక్ ను వినియోగిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు, ఇంజనీరింగ్ విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# డెంగ్యూపై అవగాహన ర్యాలీ

## కడప జిల్లావైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కే నాగరాజు

ప్రజాభూమి,కడప సిటీ:



16-05-2026వ తేదీన జాతీయ డెంగ్యూ దినోత్సవ సందర్భంగా కడప జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కే. నా గరాజు ఆయన కార్యాలయం ఆవరణం లోప్రోగ్రాం ఆఫీసర్స్, సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడ తూ డెంగ్యూ అంటే ఏడీస్ ఈ జిప్ట్ దోమ కుట్టడం వలన వ చ్చే వైరల్ జ్వరము అన్నారు. ఈ దోమలు పగటిపూట మా త్రమే కుడతాయి.శుభ్రమైన నీ రు నిల్వ ఉన్నచోట్ల గుడ్లు పెడ తాయి.డెంగ్యూ లక్షణాలు తీ వ్రమైన జ్వరము 103-105 ఫారిన్ హీట్, తలనొప్పి, కండ్ల వెనుక నొప్పి, కండరాలు కీళ్ల నొప్పులు అందుకే దీనిని బ్రేక్ బోన్ ఫీవర్ అంటారు. శరీరం పై దద్దుర్లు,ప్లేట్లెట్స్ పడిపోవడ జరుగుతుంది.పై లక్షణాలు ఉ న్న యెడల దగ్గర్లోని ప్రభుత్వ ఆసుపత్రిలో సంప్రదించి డెంగ్ పరీక్షలు,చికిత్స ఉచితంగా ఆ శీదజేస్తారు.సమాజ భాగస్వా మ్యంతో డెంగ్యూ నియంత్రణ అనేది ఈ ఏడాది నినాదం అ న్నారు. నీరు నిలవ లేకుండా చూడాలి, పూర్తిగా కప్పి ఉంచే దుస్తులు ధరించాలి, దోమతెర లు వాడాలి, కిటికీలకు మెస్ బిగించాలి,పరిసరాలు పరిశు భ్రంగా ఉంచుకోవాలి,ప్రతి శు క్రవారం డ్రైడే గా పాటించాలి, డెంగ్యూ వస్తే ఎక్కువ ద్రవ ప దార్థాలు తీసుకోవాలని,ఈ ని వారణ చర్యలు చేయడం వల న డెంగు రాకుండా నివారించ వచ్చు అని ఆయన తెలియ జేశారు.ఈ కార్యక్రమంలో ప్రో గ్రాం ఆఫీసర్స్, కార్యాలయ సి బ్బంది పాల్గొన్నారు.

# శ్రీకాళహస్తి అభివృద్ధిపై మంత్రి ఆనంతో చర్చ

## మాస్టర్ ప్లాన్ వేగవంతం చేయాలని విజ్ఞప్తి



ప్రజా భూమి ప్రతినిధి శ్రీకాళహస్తి.
జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన జనసేన ఉద్యమి ఆత్మీయ సమావేశంలో జనసేన పార్టీ తిరుపతి జిల్లా కార్యదర్శి, శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్ పాల్గొన్నారు. అనంతరం ధర్మాదాయ దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిని ఆయన నివాసంలో కొట్టే సాయి ప్రసాద్, దేవస్థానం పాలకమండలి సభ్యుడు పగడాల మురళి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు సహకరించినందుకు మంత్రికి ధన్యవాదాలు తెలిపారు. అలాగే శ్రీకాళహస్తి దేవస్థానం మాస్టర్ ప్లాన్ పనులను వేగవంతం చేసి, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు.దేవస్థానం అభివృద్ధి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనపై మంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

# చంద్రగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఘనంగా 'జాతీయ డెంగ్యూ దినోత్సవం



ప్రజాభూమి ప్రతినిధి,చంద్రగిరి:
చంద్రగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో శనివారం జాతీయ డెంగ్యూ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజల్లో అవగాహన పెంచేందుకు భారీ ర్యాలీ నిర్వహించారు.మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ శివయ్య ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ రాసినేని శిరీష మరియు బొల్లినేని కుసుమ మాట్లాడుతూ.. వర్షాకాలం ముంచుకొస్తున్న తరుణంలో ప్రతి ఒక్కరూ డెంగ్యూ పట్ల అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. మన ఇళ్లు, పరిసరాల చుట్టుపక్కల నీరు నిల్వ ఉండకుండా చూసుకోవడం ద్వారా డెంగ్యూ వ్యాప్తికి కారణమయ్యే దోమలను అరికట్టవచ్చని ఆమె తెలిపారు. ఒకవేళ ఎవరికైనా జ్వరం వస్తే నిర్లక్ష్యం చేయకుండా, వెంటనే దగ్గరలోని ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి రక్త పరీక్షలు చేయించుకుని తగిన వైద్యం పొందాలని సూచించారు. అనంతరం డెంగ్యూ నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలంటూ సిబ్బందితో కలిసి ఆమె ప్రతిజ్ఞ చేయించారు. ఈ అవగాహన ర్యాలీ మరియు ప్రతిజ్ఞా కార్యక్రమంలో శివరాజు, ఈశ్వరయ్య, హెల్త్ సూపర్వైజర్, వాసుదేవ రెడ్డి, ద్రాక్షాయణిలతో పాటు ఎం.ఎల్.హెచ్.పి లు, ఏ.ఎన్.ఎం లు, మరియు ఆశాకార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తిలో గ్రంథాలయం తనిఖీ చేసిన ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రంథాలయ చైర్మన్ గురువారెడ్డి



ప్రజా భూమి ప్రతినిధి: శ్రీకాళహస్తి టౌన్
శ్రీకాళహస్తి ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయం నందు ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రెడ్డి వారి గురువారెడ్డి తన కార్యాలయం నందు చిత్తూరు తిరుపతికి సంబంధించిన ఇంజనీర్ అధికారులైన జయ కుమార్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రమేష్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కుమార్ తేజ అసిస్టెంట్ ఇంజనీర్ గ్రంథాలయఅధికారులతోనూ ప్రత్యేకంగా సమావేశమై ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా నిర్మాణంలో ఉన్న చిత్తూరు డిసిఎల్ నూతన భవనాన్ని వేగవంతం చేయాలని అదేవిధంగా తొట్టంబేడు గ్రంథాలయానికి ఎలక్ట్రికల్ వర్క్ త్వరగా పూర్తిచేసి అదేవిధంగా తాత్కాలికంగా నిలిచిపోయిన వరదయ్యపాలెం భవనాన్ని రేపటి వారం నుండి ప్రారంభించాలని తిరుపతిలోని ప్రథమ శ్రేణి గ్రంథాలయానికి స్టడీ హాల్ నిర్మాణం చంద్రగిరిలో గ్రంథాలయాన్ని మరమ్మత్తులు ముత్యాల రెడ్డి పల్లి గ్రంథాలయంలో మరమ్మత్తులు వీటన్నింటికీ ప్రణాళికలు సిద్ధం చేయాలని రివ్యూ సమావేశంలో చౌదరి ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించిన ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రెడ్డివారి గురవారెడ్డి అనంతరం శ్రీకాళహస్తి గ్రంథాలయ భవనానికి సంబంధించిన గ్రంథాలయ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించి కాంపౌండ్ వాల్ నిర్మాణం కొన్ని మరమ్మత్తులను వారికి సూచించి దానికి సంబంధించిన ప్రణాళికను సిద్ధం చేయాలని ఆదేశించారు ఈ కార్యక్రమంలో చైర్మన్ రెడ్డి వారి గురవారెడ్డి తో పాటు అధికారులు గ్రంథాలయ అధికారులు లావణ్య హరిక్రిష్ణ మరియు కాంట్రాక్టర్ తదితరులు పాల్గొన్నారు

## పుదూరు గురుకులం విద్యార్థిని ఎన్.పూర్ణప్రగతి ని సన్మానించిన ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ



ప్రజా భూమి ప్రతినిధి నాయుడుపేట.
నాయుడుపేట మండలం లోని పుదూరు గురుకుల పాఠశాల విద్యార్థిని నన్నూరు పూర్ణ ప్రగతిని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ సన్మానించారు. శనివారం నాయుడుపేట పట్టణంలో జరిగిన బడి పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా పుదూరు గురుకుల పాఠశాలలో పదవ తరగతి పరీక్ష ఫలితాలు 553 అత్యుత్తమ మార్కులు సాధించిన నన్నూరు పూర్ణ ప్రగతికి ఎమ్మెల్యే డాక్టర్ నల్గొండ విజయశ్రీ శాలువా కప్పి ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని విద్యార్థినికి సూచించారు.ఈ కార్యక్రమంలో నాయుడుపేట పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు షేక్ రఫీ,జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు వేలూరు మురళీకృష్ణ రెడ్డి,పెళ్ళకూరు మండల టిడిపి అధ్యక్షులు సంచి కృష్ణయ్య,జిల్లా తెలుగు యువత ఉపాధ్యక్షులు అవధానం సుధీర్ పలువురు నాయకులు పాల్గొన్నారు.

## శ్రీ కోదండ రామస్వామి ఆలయంలో భక్తి భావంతో దేవతా శ్లోకాల ఆలాపన..!



ప్రజా భూమి ప్రతినిధి, చంద్రగిరి:
చంద్రగిరి పట్టణంలోని శ్రీ కోదండరామ స్వామి వారి ఆలయములో శనివారం భక్తి పారవశ్య వాతావరణంలో దేవతా శ్లోకాల ఆలాపన కార్యక్రమం నిర్వహించారు. చంద్రగిరికి చెందిన ప్రాతిభం ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూట్ విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొని భక్తి గీతాలు, దేవతా శ్లోకాలను మధుర స్వరాలతో ఆలపించారు. సంప్రదాయ దుస్తుల్లో పాల్గొన్న చిన్నారులు ఎంతో శ్రద్ధగా శ్లోకాలను పఠించడంతో ఆలయ ప్రాంగణం భక్తి భావంతో మార్మోగింది. విద్యార్థుల భక్తి, ప్రతిభను చూసిన భక్తులు మరియు ఆలయానికి వచ్చిన సందర్శకులు ప్రశంసలు కురిపించారు.ఆధ్యాత్మిక వాతావరణంలో జరిగిన ఈ కార్యక్రమం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. విద్యార్థుల్లో భారతీయ సంస్కృతి, ఆధ్యాత్మిక విలువలను పెంపొందించే దిశగా ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగకరమని పలువురు అభిప్రాయపడ్డారు.



# ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గిద్దాం -- పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలి

## :జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్.



ప్రజా భూమి ప్రతినిధి ఏర్పేడు.
పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ వినియోగాన్ని గణనీయంగా తగ్గించేందుకు ప్రతి పౌరుడు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. శనివారం ఉదయం ఏర్పేడు బస్టాండు కూడలిలో మండలంలో నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర -- స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని ప్రతిజ్ఞ చేసి ప్రజలకు, స్థానిక అధికారులకు పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్ సంచులు, ఒకసారి వినియోగించి పారేసే ప్లాస్టిక్ వస్తువులు, ప్లాస్టిక్ వాటర్ బాటిళ్ల వినియోగం పర్యావరణానికి తీవ్ర హానికరమని తెలిపారు. ప్లాస్టిక్ వ్యర్థాల కారణంగా భూమి, నీరు, గాలి కాలుష్యం పెరిగి ప్రజల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతోందన్నారు. పర్యావరణ హిత జీవనశైలిని అలవాటు చేసుకోవాలని సూచిస్తూ గుడ్డ సంచులు, జూట్ బ్యాగులు, పునర్వినియోగ వస్తువులను వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలకు సూచించారు. ఇంటి వద్ద నుంచే చెత్త వేర్వేరుగా వర్గీకరించి ప్లాస్టిక్ వ్యర్థాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన చెత్త బుట్టల్లో వేయాలని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా స్వచ్ఛ ఆంధ్ర -- స్వచ్ఛ తిరుపతి కార్యక్రమాన్ని విస్తృత స్థాయిలో నిర్వహిస్తూ ప్రజల్లో పరిశుభ్రత, ప్లాస్టిక్ నిర్మూలనపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, భవిష్యత్ తరాలకు పరిశుభ్రమైన పర్యావరణాన్ని అందించేందుకు అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి ఆర్డీఓ భానుప్రకాష్ రెడ్డి, తహసీల్దార్, ఎంపిడిఓ, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది మరియు గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## నాయుడుపేటలో బడి పిలుస్తోంది కార్యక్రమంపై ర్యాలీ

### పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ



ప్రజా భూమి ప్రతినిధి నాయుడుపేట.
నాయుడుపేట ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచడానికి, కార్పొరేట్ బడులకు ధీటుగా విద్యా ప్రమాణాలను అందించడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "బడి పిలుస్తోంది" కార్యక్రమం శనివారం నాయుడుపేట పట్టణంలో నిర్వహించారు. సూళ్లూరుపేట నియోజకవర్గ శాసనసభ్యురాలు డాక్టర్ నెలవల విజయశ్రీ నేతృత్వంలో నాయుడుపేట పట్టణంలోని ఎల్.ఎ. సాగరం నుండి ఆర్టీసీ సర్కిల్ వరకు భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యేతో పాటు జిల్లా విద్యాశాఖాధికారి మండల విద్యాశాఖాధికారి మరియు ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం బడులలో నాణ్యమైన విద్యా సౌకర్యాలు, మౌలిక వసతులు, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు మరియు తల్లికి వందనం వంటి సంక్షేమ పథకాలను అందిస్తోందని గుర్తుచేశారు. ఈ విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లను కనీసం 10 శాతం పెంచడమే లక్ష్యంగా ప్రచార రథాలు, ఇంటింటి ప్రచారాల ద్వారా విస్తృత అవగాహన కల్పిస్తున్నట్లు ఆమె తెలిపారు. దివ్యాంగులు మరియు బడికి దూరమైన పిల్లలను గుర్తించి భవిత కేంద్రాల్లో చేర్పించాలని, 100% విద్యార్థుల నమోదు సాధించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే కోరారు.

# ఉప్పరపల్లి రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేయాలి

## నాణ్యతలో రాజీ లేకుండా పూర్తి చేయాలని తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి ఆదేశం



ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి
తిరుపతి నగర ప్రజలకు ట్రాఫిక్ సమస్యల నుంచి ఉపశమనం కల్పించడమే లక్ష్యంగా తుడా ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని తుడా ఛైర్మన్, టీటీడీ ఎక్స్ అఫిషియో మెంబర్, తెలుగుదేశం పార్టీ తిరుపతి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి డాలర్స్ దివాకర్ రెడ్డి స్పష్టం చేశారు. నిర్దేశిత గడువులోగా పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.ఉప్పరపల్లి పరిధిలో జరుగుతున్న ప్రధాన రోడ్డు విస్తరణ, డ్రైనేజీ నిర్మాణ పనులను తుడా అధికారులతో కలిసి ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల ప్రగతిపై వివరాలు అడిగి తెలుసుకొని కాంట్రాక్టర్, ఇంజనీరింగ్ అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ఉప్పరపల్లి రోడ్డు అత్యంత రద్దీగా ఉండే ప్రాంతం కావడంతో పనుల సమయంలో స్థానిక ప్రజలు, వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా బారికేడ్లు, హెచ్చరిక సైన్ బోర్డులు ఏర్పాటు చేసి ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు.ఉప్పరపల్లి రోడ్డు విస్తరణ ఈ ప్రాంత ప్రజల దశాబ్దాల కల అని పేర్కొన్న డాలర్స్ దివాకర్ రెడ్డి, పనులను వేగవంతం చేసి త్వరలోనే ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యం అందిస్తామని చెప్పారు.ఈ కార్యక్రమంలో తుడా సెక్రటరీ డా. ఎన్.వి. శ్రీకాంత్ బాబు, ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## శ్రీ శనీశ్వర స్వామి వారి ప్రత్యేక తైలాభిషేకంలో పాల్గొన్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి దంపతులు



ప్రజాభూమి ప్రతినిధి, శ్రీకాళహస్తి
దక్షిణ కాశీగా పేరుగాంచిన ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ వాయు లింగేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం అమావాస్య సందర్భంగా శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి దంపతులు శ్రీకాళహస్తి ఆలయంలోని శ్రీ శనీశ్వర స్వామి వారి ప్రత్యేక తైలాభిషేకంలో పాల్గొన్నారు.దర్శనానంతరం ఆలయ కార్యనిర్వాహణాధికారి బీకే వెంకటేశులు శ్రీకాళహస్తి ఎమ్మెల్యే దంపతులకు అంతరాలయ దర్శనం, వేద ఆశీర్వచనం ఏర్పాటు చేయడమైనది. సదరు కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి బీకే వెంకటేశులు, ట్రస్ట్ బోర్డు సభ్యులు గుర్రప్ప శెట్టి, గోపీనాథ్, బీలా స్రవంతి, ఆలయ ఏ ఈ ఓ విద్యాసాగర్ రెడ్డి, ప్రోటోకాల్ ఏఈఓ మోహన్, పర్యవేక్షకులు నాగభూషణం, ఇన్స్పెక్టర్ వెంకటస్వామి, అర్చకులు వేద పండితులు, స్థానిక టీడీపీ నాయకులు.ఆలయ అధికారులు భక్తులు తదితరులు పాల్గొన్నారు

# డెంగ్యూ రహిత సమాజ నిర్మాణమే మాలక్ష్యం



ప్రజాభూమి ప్రతినిధి: శ్రీకాళహస్తి టౌన్
శ్రీకాళహస్ర పట్టణంలోని గజేంద్ర నగర్ పిహెచ్సిలో డెంగ్యూ నివారణ లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని డాక్టర్ తెలిపారు. గజేంద్ర నగర్ లోని ఆధ్వర్యంలో జాతీయ డెంగ్యూ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం డెంగ్యూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ గిరిజ మాట్లాడుతూ డెంగ్యూ ఒక ప్రమాదకరమైన దోమల ద్వారా వ్యాపించే వ్యాధి అని, ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించడం ద్వారా దీనిని నివారించవచ్చని తెలిపారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, పాత టైర్లు, కొబ్బరి చిప్పలు, కూలర్లు, నీటి డబ్బాలు వంటి వాటిలో దోమలు పెరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని పేర్కొన్నారు. వారానికి ఒకసారి నీటి నిల్వలను శుభ్రం చేయాలని సూచించారు.అలాగే జ్వరం, తలనొప్పి, కీళ్ల నొప్పులు, వాంతులు వంటి లక్షణాలు కనిపించిన వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి వైద్యులను సంప్రదించాలని ప్రజలకు సూచించారు. స్వయంగా మందులు వాడకుండా వైద్యుల సలహా మేరకు చికిత్స తీసుకోవాలని తెలిపారు. దోమల నివారణ కోసం పూర్తి చేతుల దుస్తులు ధరించడం, దోమతెరలు ఉపయోగించడం, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ఎంతో అవసరమన్నారు.ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్. షణ్ముగం. ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# టీటీడీకి ఎలక్ట్రిక్ బస్సు విరాళం



ప్రజా భూమి ప్రతినిధి తిరుమల
చెన్నైకు చెందిన వర ఫ్యూచర్ ఎల్ఎల్పీ సంస్థ చైర్మన్ వర్ధమాన్ జైన్ శనివారం ఉదయం టీటీడీకి ఒలెక్ట్రా ఎలక్ట్రిక్ బస్సును విరాళంగా అందించారు. ఈ మేరకు దాత శ్రీవారి ఆలయం ముందు బస్సుకు ప్రత్యేక పూజలు నిర్వహించి బస్సుకు సంబంధించిన పత్రాలు, తాళాలను టీటీడీ అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరికి అందజేశారు.ఈ సందర్భంగా అదనపు ఈవో దాతతో కలిసి బస్సులో ప్రయాణించి, ప్రయాణికులకు ఈ బస్సు చాలా సౌకర్యవంతంగా ఉందని దాతను అభినందించారు. కాగా ఈ బస్సును తిరుమలలోని భక్తుల సౌకర్యార్థం ఉచిత బస్సు గా వినియోగించనున్నారు.ఈ కార్యక్రమంలో శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం, టీటీడీ మాజీ బోర్డు సభ్యులు శ్రీ డి.పి.అనంత, తిరుమల ట్రాన్స్ పోర్ట్ డీఐ కృష్ణయ్య పాల్గొన్నారు.



# వైభవంగా శని జయంతి వేడుకలు

## పోటెత్తిన భక్తులు



ప్రజాభూమి ప్రతినిధి, రామచంద్రపురం
శ్రీ శనేశ్వర స్వామి ఆలయానికి భక్తుల పోటెత్తారు. శనివారం అమావాస్య శని జయంతి ఒకేరోజు రావడంతో ఉదయం నుంచే శని దోషం కలిగిన భక్తులు స్వామి వారికి తైలాభిషేకం చేసుకున్నారు. తిరుపతి జిల్లా రామచంద్రాపురం మండలం రాయల చెరువు పంచాయతీ చాయాపురంలో వెలిసిన శ్రీ శనేశ్వర స్వామి ఆలయానికి భక్తులు ఉదయం నుంచే అధిక సంఖ్యలో వచ్చి స్వామివారిని దర్శించుకుంటున్నారు. శనివారం వైశాఖ బహుళ అమావాస్య, శని జయంతితో కూడిన ఒకేరోజు రావడంతో స్వామివారికి ఉదయం సుప్రభాత సేవతో మేలుకొలుపు పాలు పెరుగు వెన్న నెయ్యి తేనె వివిధ రకాల సుగంధ ద్రవ్యములతో పంచామృత అభిషేకం నిర్వహించారు. అనంతరం శని దోషం కలిగిన భక్తులు స్వామివారికి తైలాభిషేకం, హోమాలు చేసుకున్నారు. ఆలయ ప్రాంగణంలో ఉన్నశ్రీ అభయ హస్త ఆంజనేయ స్వామికి విశేష అభిషేకాలు నిర్వహించారు ఆలయ అర్చకులు. శని జయంతి సందర్భంగా శ్రీ శనేశ్వర స్వామి ఉత్సవమూర్తులను ప్రా కారోత్సవం చేసి ఆలయం చుట్టూ ఊరేగించారు. ఈరోజు శ్రీ శనీశ్వర స్వామిని దర్శించుకుని తైలాభిషేకం చేసుకుంటే శని దోషం కలిగిన వారికి శని దోషాల తొలిగి సకల బాధలకు విముక్తి కలుగుతుందని భక్తుల విశ్వాసం. ఈ సందర్భంగా ఆలయానికి వచ్చిన భక్తులకు ఆలయ నిర్వహకులు తీర్థప్రసాదాలతో పాటు అన్న వితరణ కార్యక్రమం చేపట్టారు.

## పేదలకు న్యాయం చేయాలి - జనసేన నేత రాజేష్ ఆచ్చారి

### తట్టల వ్యవహారంలో వివక్ష చూపొద్దని అధికారులకు హెచ్చరిక




ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి
తిరుపతిలోని వరాహస్వామి గెస్ట్ హౌస్ ప్రాంతంలో తట్టల ఏర్పాటు విషయంలో అధికారులు వివక్ష చూపుతున్నారని జనసేన నగర ప్రధాన కార్యదర్శి రాజేష్ ఆచ్చారి ఆరోపించారు. రెండు వారాల క్రితం 8 మంది వైసీపీ నాయకులకు తట్టలు పెట్టుకునేందుకు అనుమతి ఇచ్చిన అధికారులు, మరో 8 మంది పేదలకు మాత్రం అనుమతి నిరాకరించారని తెలిపారు.న్యాయం చేయాలని బాధితులు తమను ఆశ్రయించడంతో గురువారం తట్టలు ఏర్పాటు చేయించామని, అయితే అధికారులు దౌర్జన్యంగా వాటిని తొలగించారని విమర్శించారు. వైసీపీ నాయకులు ఏర్పాటు చేసిన 8 తట్టలు మాత్రం ఇప్పటికీ తొలగించకుండా కొనసాగుతున్నాయని అన్నారు. వైసీపీ నాయకుల వద్ద ఉన్న పత్రాలే తమ వద్ద కూడా ఉన్నాయని, తట్టలు పెట్టుకోవచ్చని చెప్పిన విజిలెన్స్ అధికారులు ఎవరో వెల్లడించాలని డిమాండ్ చేశారు. అలాగే ఆ అధికారులకు సూచనలు ఇచ్చిన నాయకుడు ఎవరో కూడా ప్రజలకు తెలియజేయాలని కోరారు.ఈ వ్యవహారానికి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేసిన రాజేష్ ఆచ్చారి, ప్రతి అంశంలో ఎమ్మెల్యే పేరును లాగడం సరైంది కాదన్నారు. వైసీపీ పాలనలో అనధికారికంగా ఏర్పాటు చేసిన సుమారు 200 తట్టలను తొలగించాలని ఎమ్మెల్యే పలుమార్లు టిటిడి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా, రెండేళ్లు గడిచినా ఒక్క తట్టను కూడా అధికారులు తొలగించలేదని విమర్శించారు.పేదలైన 8 మందికి వెంటనే తట్టలు ఏర్పాటు చేసుకునేందుకు అనుమతి ఇవ్వాలని, లేనిపక్షంలో ఈ సమస్యను ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని హెచ్చరించారు. వైసీపీ నాయకులకు అనుకూలంగా వ్యవహరిస్తున్న అధికారులు తప్పకుండా శిక్ష అనుభవించాల్సి వస్తుందని అన్నారు.ప్రజలందరికీ సమాన న్యాయం జరగాలన్నదే జనసేన పార్టీ లక్ష్యమని, రాజకీయ పక్షపాతం లేకుండా అధికారులు వ్యవహరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన సీనియర్ నాయకులు సుధాకర్, వీరా, సురేష్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# స్వర్ణాంధ్ర--స్వచ్ ఆంధ్ర లక్ష్యంగా విస్తృత అవగాహన కార్యక్రమాలు

### ప్రతి మూడో శనివారం ప్రజల్లో పరిశుభ్రతపై చైతన్యం కల్పిస్తున్న వేణుగోపాలపురం పంచాయతీ కార్యదర్శి

ప్రజాభూమి ప్రతినిధి, బుచ్చినాయుడు .కండ్రిగ




తిరుపతి జిల్లా బి.ఎన్.కండ్రిగ మండలంలోని వేణుగోపాలపురం గ్రామ పంచాయతీలో స్వర్ణాంధ్ర--స్వచ్ ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేసే దిశగా ప్రతి మూడో శనివారం ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలో గ్రామంలోని ప్రధాన వీధులు, కాలనీలు, ప్రజా ప్రదేశాల్లో పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టి గ్రామ ప్రజల్లో చైతన్యం తీసుకొస్తున్నారు.ఈ సందర్భంగా గ్రామస్తులకు పరిశుభ్రమైన పరిసరాల వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలను వివరించారు. ఇంటి వద్ద చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని సూచించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా సహకరించాలని కోరారు. గ్రామంలో మురుగు నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, దోమల వ్యాప్తిని అరికట్టేందుకు ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని అవగాహన కల్పించారు. అలాగే గ్రామంలో నిర్వహిస్తున్న పారిశుధ్య కార్యక్రమాల్లో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొనాలని, పరిశుభ్రమైన గ్రామ నిర్మాణమే స్వర్ణాంధ్ర లక్ష్యమని తెలిపారు. ప్రతి కుటుంబం పరిశుభ్రతను అలవాటుగా మార్చుకుంటేనే ఆరోగ్యకరమైన సమాజం ఏర్పడుతుందని పేర్కొన్నారు. గ్రామంలో చెత్త సేకరణ వాహనాలను సక్రమంగా వినియోగించుకోవాలని, పారిశుధ్య కార్మికులకు సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయ సిబ్బంది, గ్రీన్ అంబాసిడర్లు, పారిశుధ్య కార్మికులు, మహిళా సంఘాల సభ్యులు, యువత, గ్రామ ప్రజలు పాల్గొని పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేశారు.

ప్రజాభూమి
తిరుపతి,చిత్తూరు 10
ఆదివారం 17 మే 2026

# తిరుపతిలో రౌడీమూకల దౌర్జన్యం సూరయ్యకట్టలో వృద్ధుడి ఇంటి కబ్జాకు యత్నం..!

## జనసేన నాయకుడినంటూ బెదిరింపులు -- దౌర్జన్యానికి అడ్డుకట్ట వేసి వృద్ధుడికి అండగా సిపిఎం

## ప్రేక్షక పాత్ర పోషిస్తున్న పోలీసులపై వెల్లువెత్తుతున్న విమర్శలు

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి.

తిరుపతి నగరం కపిలతీర్థం రోడ్డులోని ధోబీఘాట్ సమీపం సూరయ్యకట్ట ప్రాంతంలో ఒంటరి వృద్ధుడు తంగరాజు ఇంటిపై జరిగిన దౌర్జన్య ఘటన తీవ్ర ఆందోళనకు గురిచేస్తోందని సిపిఎం నాయకులు పేర్కొన్నారు. అద్దెకు ఉంటూ ఇంటినే తమదిగా ప్రకటించడం, "జనసేన పార్టీ నాయకుడిని" అంటూ బెదిరింపులకు దిగడం, ఎమ్మెల్యే పేరు అడ్డుపెట్టుకుని బలహీనులపై దౌర్జన్యం చేయటం, పోలీసుల చుట్టూ ఒంటరి వృద్ధుడు తిరిగినా దౌర్జన్యకారులపై కేసులు నమోదు చేయకపోవటం తీవ్ర ఆందోళన కలిగించే విషయమని వారు తెలిపారు. పేదలు, వృద్ధులను లక్ష్యంగా చేసుకుని తిరుపతి లో కొందరు రౌడీయిజంతో భయభ్రాంతులకు గురిచేయడం సమాజానికి ప్రమాదకర సంకేతమన్నారు. శనివారం నాటి ఉదయం బాధితుడి ఇంటిని పరిశీలించిన సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు టి. సుబ్రహ్మణ్యం, సిపిఎం నగర కార్యదర్శి కే. వేణుగోపాల్ మాట్లాడుతూ నేతల పేర్లు అడ్డుపెట్టుకుని బలహీనుల ఆస్తులపై కన్నేయడం, బెదిరింపులు, భౌతిక దాడులకు పాల్పడడం దుర్మార్గమన్నారు. ఇలాంటి దౌర్జన్యాలను ఏమాత్రం ఉపేక్షించబోమని, బాధిత వృద్ధుడు తంగరాజుకు సిపిఎం అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. బాధితుల కథనం మేరకు తంగరాజు ఇంటిలో బాడుగకు ఉంటున్న రాజా నాగరత్నం, అతని కుమారులు మేము జనసేన నాయకులం "ఇల్లు మాదే -- నువ్వు బయటకు పో" అంటూ ఒంటరి వృద్ధుడిని కొట్ టిబయటకుతరిమివేసినట్టు తెలిపారు. జనసేన నాయకుడినని చెబుతూ రౌడీలను పిలిపించి బెదిరింపులు, భౌతిక దాడులకు పాల్పడినట్లు స్థానిక ప్రజలు చెబుతున్నారు. సుమారు 20 మంది రౌడీలు మద్యం సేవించి వృద్ధుడిపై భౌతిక దాడులకు పాల్పడటమే కాకుండా, ఇంటికి తాళాలు వేసిన ఘటన దుర్మార్గమని సిపిఎం నాయకులు పేర్కొన్నారు. వృద్ధుడికి ఎవరూ లేరన్న అదును చూసుకుని లక్షల రూపాయల విలువైన స్థలాన్ని, ఇంటిని కబ్జా చేసేందుకు ప్రయత్నించడం అమానుష చర్య అని అన్నారు.





ఈ ఘటనపై స్పందించిన సిపిఎం బృందం నేడు బాధితుడి ఇంటిని పరిశీలించింది. దౌర్జన్యంగా వేసిన తాళాలను సిపిఎం ఆధ్వర్యంలో తొలగింపజేసి, వృద్ధుడి ని తిరిగి తన ఇంటిలోకి ప్రవేశించేలా చర్యలు చేపట్టడం జరిగింది. గత 30 సంవత్సరాలుగా ఆ ప్రాంతంలో నివసిస్తూ, ఇంటికి సంబంధించిన ఒరిజినల్ పట్టా, మున్సిపల్ పన్ను రసీదులు సహా అన్ని చట్టబద్ధ పత్రాలు తంగరాజు పేరుపైనే ఉన్నాయని నాయకులు తెలిపారు. తన కష్టార్జితంతో నిర్మించుకున్న ఇంటి నుంచి వృద్ధుడిని బయటకు నెట్టివేయడం మానవత్వానికే మచ్చ అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాజా నాగరత్నం, అతని కుమారులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటికే పోలీసులకు ఫిర్యాదు అందజేసినట్లు తెలిపారు. న్యాయం జరిగే వరకు సిపిఎం ఆధ్వర్యంలో బాధితుడికి అండగా నిలిచి పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బారాయుడు. జరుగుతున్న అన్యాయాలపై స్పందించి పేదలకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు ఆర్. లక్ష్మి, పి. బుజ్జి, ఎం. రాజు, ఎండి. శ్రీనివాసులు, పార్థసారథి, సుజాతమ్మ, సిద్ధు, స్థానికులు ఉమా తదితరులు పాల్గొన్నారు.

# పాకాల మండలంలో రూ.1.60 కోట్లతో 65 జల సంరక్షణ పనులు

## నీటి సంరక్షణ పనులతో మండలం లోని 4,431 ఎకరాలకు సాగు నీటి లబ్ధి

ప్రజాభూమి ప్రతినిధి పాకాల.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ అభివృద్ధి, సాగు నీటి సదుపాయాల పెంపు, రైతుల సంక్షేమం కోసం జలధార -- జలహారతి పథకంను విస్తృతంగా అమలు చేస్తోంది. ఈ పథకం కింద పాకాల మండలంలో రూ.1.60 కోట్ల అంచనా వ్యయంతో 65 పనులకు పరిపాలనా ఉత్తర్వులు జారీ చేయడం రాష్ట్ర ప్రభుత్వ సంకల్పాన్ని ప్రతిబింబిస్తోంది. ముఖ్యంగా, ఎంపిక చేసిన పనులన్నీ కాలువ పూడికతీత పనులే కావడం విశేషం. ఇంత పెద్ద ఎత్తున మండలంలో చేపడుతున్న కాలువ పూడికతీత పనులతో మండలంలోని ప్రతి చెరువు నిండు కుండలా జల కళను సంతరించుకుంటుంది. ఈ పనుల ద్వారా 4,431 ఎకరాలకు సాగు నీటి లబ్ధి కలుగనుంది. పాకాల మండలం ఈపాలగుట్టపల్లి గ్రామ పంచాయతీ నందు ఎర్రకనుమ కాలువ పూడికతీత పనులు రూ.1.85 లక్షలతో చేపట్టారు.



40 మంది ఉపాధి హామీ వేతనదారులతో 1,700 మీటర్ల పొడవు, 3 మీటర్ల వెడల్పు గల ఎర్రకనుమ కాలువ పూడికతీత పనులను చేపడుతున్నారు. అటవీ ప్రాంతంలో కురిసే వర్షపు నీరు ఈ కాలువ ద్వారా మల్లేశ్వర స్వామి చేరువుకు చేరనుంది. తద్వారా ఈ పంచాయతీతో పాటు వల్లివేడు గ్రామ పంచాయతీ లోని పంట భూములకు కూడా సాగునీరు అందనుంది. ఈ ప్రాంతంలో రైతులు సాగు చేస్తున్న మామిడి, వేరుశెనగ, కూరగాయల సాగుకు నీరు సంవృద్ధిగా లభించనుంది. ఈ చెరువు పరిధిలో సుమారు వంద ఎకరాలకు సాగు నీటి తో పాటు 20 బోర్లు, 10 బావులలో భూగర్భ జలాలు పెరగనుంది. జలహారతి పథకంతో చెరువులు నిండుగా, రైతులు సంతోషంగా ఈపాలగుట్టపల్లి గ్రామం ఉపాధి హామీ వేతనదారుడు చంద్రబాబు మాట్లాడుతూ.. జలధార - జలహారతి కార్యక్రమంలో భాగంగా ఎర్రకనుమ నుండి మల్లేశ్వర స్వామి చెరువుకు వచ్చే సప్లై ఛానల్ పనులు చేస్తున్నామన్నారు. ఈ పని చేయడం వలన ఈ ప్రాంత చెరువుకు నీరు రావడంతో పాటు ఆవులకు త్రాగు నీరు లభించడం, బోర్ల రీఛార్జ్ కావడం జరుగుతుందన్నారు. అదే విధంగా పంట పొలాలకు సాగు చేసుకోవడానికి సాగునీటి కొరత లేకుండా ఈ పని ఎంతో ఉపయోగపడుతుందన్నారు.



అంతేకాక వర్షాకాలానికి ముందే ఈ పథకం ద్వారా పనులు కల్పించడం మరింత ఆనందాన్ని ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ లకు ధన్యవాదాలు తెలిపారు.

**వలసలు తగ్గే, ఆదాయం పెరిగే . .:** ఈపాలగుట్టపల్లి గ్రామం ఉపాధి హామీ వేతనదారురాలు బేబీ రూపా మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకం ద్వారా జలధార- జలహారతి పనులు చేపట్టడం వలన ప్రతి కుటుంబానికి ఉపాధి దొరకడంతో పాటు వలసలు వెళ్ళే పరిస్థితి కనుమరుగైంది. ఈ పనుల ద్వారా జాబ్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి అదనంగా రూ.30 వేలు వరకు ఆదాయం కలుగుతోందన్నారు. ఈ పనులు కల్పించిన ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపింది. ఈ కార్యక్రమం వల్ల వలసలు తగ్గి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతోంది. రైతులు మామిడి, వేరుశెనగ, కూరగాయల సాగులో నీటి కొరత లేకుండా సంతోషంగా సాగు చేసుకునే పరిస్థితి ఏర్పడింది.



# ఐఐటి తిరుపతి సమక్షంలో ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ యువ సంఘం-6 కార్యక్రమం ప్రారంభం

## ఈ కార్యక్రమంలో పాల్గొననున్న మహారాష్ట్ర ఐఐటి విద్యార్థులు- జిల్లా కలెక్టర్ డా. ఎస్.వెంకటేశ్వర్

ప్రజా భూమి ప్రతినిధి ఏర్పేడు. ఏర్పేడు, కేంద్ర ప్రభుత్వం ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 6 రోజుల పాటు ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ యువ సంఘం-6 కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని, ఈ కార్యక్రమాన్ని తిరుపతి ఐఐటి కళాశాల ఆధ్వర్యంలో చేపట్టడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ పేర్కొన్నారు. శనివారం ఏర్పేడులోని తిరుపతి ఐఐటి కళాశాలలో ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ యువ సంఘం-6 కార్యక్రమాన్ని కళాశాల డైరెక్టర్ డా.ఏ. సత్యనారాయణతో కలసి జిల్లా కలెక్టర్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు సంపూర్ణ అనుభవం ఇవ్వాలనే ఉద్దేశ్యంతో ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ లో భాగంగా యువ సంఘం ఆరు రోజుల కార్యక్రమాన్ని తిరుపతి ఐఐటీ ఆధ్వర్యం లో ప్రారంభించుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మహారాష్ట్రకు చెందిన సుమారు యాభై మంది గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు పాల్గొంటున్నారన్నారు. కార్యక్రమంలో భాగంగా వారం రోజుల పాటు తిరుపతి జిల్లాలోని వివిధ విశేష ప్రాచుర్యం కలిగిన ప్రదేశాలైన తిరుమల వేంకటేశ్వరస్వామి ఆలయం, శ్రీకాళహస్తి దేవాలయాలతో పాటు శ్రీ సిటీ పారిశ్రామిక కేంద్రం, శ్రీహరికోట రాకెట్ ప్రయోగ కేంద్రం, తిరుపతి ఎస్వీ, మహిళా విశ్వవిద్యాలయాలను సందర్శిస్తారన్నారు. విశ్వవిద్యాలయాల సందర్శనలో భాగంగా ఇక్కడి అభివృద్ధి, విద్యా వ్యవస్థ, సంస్కృతి మొదలగు విషయాల పై పరస్పర అవగాహన పెంచుకునే అవకాశం కలుగుతుందన్నారు. వీటితో పాటు అదనంగా రెండు రోజులు అమరావతికి తీసుకువెళ్ళి రాజధాని ప్రాంతంలోని అభివృద్ధి పనులు, విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వ నిర్మాణాలు ఎలా ఉన్నాయెూ కూడా వీరికి చూపించబడుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం నిధులు సమకూరుస్తూ ప్రతి ఏడూ నిర్వహిస్తున్న నేపథ్యంలో ఈ సంవత్సరం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అందులోనూ తిరుపతి ఐఐటి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించుకోవడం మంచి అవకాశంగా భావిస్తున్నామన్నారు. ఐఐటి తిరుపతి డైరెక్టర్ మాట్లాడుతూ రెండు సంవత్సరాల క్రితం తిరుపతి ఐఐటి ఆధ్వర్యంలో యూత్ ఇంటిగ్రేషన్ ప్రోగ్రామ్ నిర్వహించడం జరిగిందని, ఆ సమయంలో ఐఐటి అరుణాచల్ ప్రదేశ్ నుండి విద్యార్థులతో ఈ కార్యమరమ్యం నిర్వహించడం జరిగిందని, ప్రస్తుతం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం మహారాష్ట్ర నుండి వచ్చిన సుమారు 50 మంది విద్యార్థులతో నిర్వహించడం జరుగుతుందన్నారు. భవిష్యత్తులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి సుమారు 50 మంది విద్యార్థులను ఎంపిక చేసి జూన్ మొదటి వారంలో మహారాష్ట్ర తీసుకువెళ్ళడం జరుగుతుందన్నారు. దేశం నలుమూలల విద్యా వ్యవస్థ, సంస్కృతి, పరిశ్రమలు, అభివృద్ధి తదితర అంశాల పై సమగ్ర అవగాహన కల్పించడమే ధ్యేయంగా భారత ప్రధాని నరేంద్ర మోడి ఈ కార్యక్రమాన్ని రూపొందించారన్నారు. ఇందులో భాగంగా విద్యార్థులకు తిరుపతి పరిసర ప్రాంతాల్లోని ఆధ్యాత్మిక, పారిశ్రామిక, విద్యా కేంద్రాలు చూపించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐఐటి విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.




# డెంగ్యూ వ్యాధి పట్ల అవగాహన కలిగి ఉండాలి

ప్రజా భూమి ప్రతినిధి, గూడూరు,

గూడూరు మండలం చెన్నూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో జాతీయ డెంగ్యూ వ్యాధి దినోత్సవం మరియు స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. జాతీయ డెంగ్యూ వ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం చెన్నూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఎం. జ్యోతి ఆదేశాల మేరకు, చెన్నూరు పురవీధులలో డెంగ్యూ వ్యాధి నివారణపై ప్రజలకు విస్తృత అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం పీహెచ్‌సీ సూపర్ వైజర్, ఎంపీహెచ్ఎస్ నల్లిబోయిన మస్తానయ్య ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది స్థానిక ప్రజలతో మాట్లాడుతూ, డెంగ్యూ వ్యాధి ఏ విధంగా వ్యాపిస్తుంది, దాని వల్ల ఎదురయ్యే ప్రాణాపాయ పరిస్థితులు ఏమిటి అనే విషయాలను సవివరంగా తెలియజేశారు. ముఖ్యంగా వ్యాధి ప్రబలకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవడం, దోమల వృద్ధిని అరికట్టే నివారణ చర్యల గురించి ప్రజలకు పూర్తి స్థాయి అవగాహన కల్పించారు. 'స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర'లో భాగంగా పరిశుభ్రత, మొక్కలు నాటే కార్యక్రమం:ఇదే సందర్భంలో "స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర" కార్యక్రమాన్ని సైతం నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణను మరియు ఇతర పరిసరాలను శుభ్రపరిచారు, అలాగే పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలను నాటారు. ఈ విధంగా పరిసరాల పరిశుభ్రతను పాటించడం ద్వారా దోమల వృద్ధిని అరికట్టి, డెంగ్యూ లాంటి ప్రాణాంతక వ్యాధులను పూర్తిగా నివారించవచ్చని వారు ఈ సందర్భంగా ప్రజలకు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ సి.హెచ్. సంపూర్ణమ్మ, ఎంపీహెచ్ఎస్ ఎన్. అరుణ, ఐ. ఉమ, హెల్త్ అసిస్టెంట్లు గడ్డం నాగేశ్వరరెడ్డి, ఎ. రమణయ్య, జి. వీరశేఖర్, ఏఎన్ఎం లు మరియు ఆశా కార్యకర్తలు చురుగ్గా పాల్గొన్నారు.




# ఇంధనాన్ని పొదుపు చేయండి

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి.

జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో స్వర్ణాంధ్ర -- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా వాహన వినియోగదారులకు ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించారు. అంతేకాకుండా ప్రస్తుతం ఉన్న ఇంధన సంక్షోభాన్ని దృష్టిలో ఉంచుకుని "ఇంధన పొదుపు"పై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రవాణా శాఖ అధికారి కొర్రపాటి మురళీమోహన్ పాల్గొని మాట్లాడుతూ, ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ఇంధన వినియోగం, పెట్రోల్--డీజిల్ ధరల పెరుగుదల, పర్యావరణ మరియు వాయు కాలుష్యం, భవిష్యత్‌లో ఏర్పడే ఇంధన కొరత వంటి పరిస్థితులను దృష్టిలో ఉంచుకుంటే ప్రతి ఒక్కరూ "ఇంధన పొదుపు"ను సామాజిక బాధ్యతగా భావించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఇంధనం అనేది కేవలం వాహనాల కోసం ఉపయోగించే పదార్థం మాత్రమే కాకుండా, దేశ ఆర్థిక వ్యవస్థకు మూలాధారం మరియు దేశ అభివృద్ధికి అత్యంత అవసరమైన సహజ వనరని పేర్కొన్నారు. కాబట్టి ప్రతి చుక్క ఇంధనాన్ని జాగ్రత్తగా వినియోగించడం అంటే దేశ సంపదను కాపాడినట్టేనని వివరించారు. మోటారు వాహన తనిఖీ అధికారి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఇంధన పొదుపు కోసం పాటించాల్సిన ముఖ్యమైన సూచనలు తెలియజేశారు. అవసరం లేనప్పుడు వాహనాన్ని స్టార్ట్‌లో ఉంచవద్దని, ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద లేదా ఎక్కువసేపు ఆగాల్సిన సందర్భాల్లో ఇంజిన్‌ను ఆఫ్ చేయడం అలవాటు చేసుకోవాలని సూచించారు. కొద్దిసేపు కూడా వాహనాన్ని వృథాగా స్టార్ట్‌లో ఉంచడం వల్ల గణనీయమైన ఇంధనం వృథా అవుతుందని తెలిపారు. అలాగే ఆకస్మికంగా వేగం పెంచడం, హఠాత్తుగా బ్రేకులు వేయడం తగ్గించి, సమతుల్యమైన వేగంతో సాఫీగా డ్రైవింగ్ చేయాలని సూచించారు. మరో అధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ వాహనాలను క్రమం తప్పకుండా సర్వీసింగ్ చేయించడం అవసరమని తెలిపారు. ఇంజిన్ ఆయిల్, ఎయిర్ ఫిల్టర్, స్పార్క్ ప్లగ్స్, బ్రేక్ వ్యవస్థలను సకాలంలో తనిఖీ చేయించుకోవాలని, టైర్లలో సరైన గాలి ఒత్తిడి ఉండేలా చూసుకోవాలని సూచించారు. వాహన తనిఖీ అధికారి శ్రీమతి అతికా నాజ్ మాట్లాడుతూ చిన్న దూరాలకు వీలైతే నడక లేదా సైకిల్ వినియోగించాలని, ఒకే దిశగా వెళ్లేవారు కలిసి ప్రయాణించే "కార్ పూలింగ్" అలవాటు చేసుకోవాలని సూచించారు. స్వర్ణాంధ్ర -- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా కార్యాలయ సిబ్బంది మరియు వాహనదారులు ఇంధన పొదుపు, పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన ప్రతిజ్ఞలో పాల్గొన్నారు.



# నీటి నిల్వ ఉన్న డ్రమ్ము లో పడి మూడేళ్ల చిన్నారి మృతి

ప్రజా భూమి ప్రతినిధి దొరవారి సత్రం.

అభం శుభం తెలియని గిరిజన చిన్నారి నీరు నిల్వ ఉన్న డ్రమ్ము లో ప్రమాదవశాత్తు పడి ప్రాణాలు విడిచిన ప్రమాద సంఘటన శనివారం దొరవారి సత్రం మండలంలోని, గొల్లపాలెం గిరిజన కాలనీలో జరిగింది. వివరాల మేరకు గొల్లపాలెం గిరిజన కాలనీకి చెందిన తిరుమల శెట్టి. శివ,మరెమ్మకు ఇద్దరు పిల్లలు కుమార్తెకు ఆరేళ్లు, మూడేళ్ల కుమారుడు శనివారం ఉదయం ఆవరణంలోనే ఆడుకుంటూ నీరు నిల్వ ఉంచిన డ్రమ్ము లాంటి పాత్రలోకి తల క్రింద మునిగి కాళ్లు పైకి రావడంతో చిన్నారి మృతి చెందాడు. తల్లిదండ్రులు మాత్రం బిడ్డను గమనించకుండా ఆటలాడుకుంటుంటాడని అదమరిచి కొంత సమయానికి వెతకడంతో అప్పటికే మృతి చెందాడు. కొన ఊపిరి ఉందని ఆశపడి ప్రాథమిక వైద్యానికి ప్రయత్నించారు. తలనీట మునగడంతో కొన్ని నిమిషాలకి ప్రాణాలు విడిచాడు. బిడ్డ కళ్ళ ఎదుటే కొంత సమయానికే విగత జీవితం కనిపించడంతో తల్లిదండ్రులు కన్నీరు మునీరుగా విలపించారు కన్న కొడుకును కాపాడుకోలేక పోయామని రోదన చెందారు. ఈ సంఘటనతో గిరిజన కాలనీలో విషాద ఛాయలు నెలకొన్నాయి



# వెంకటగిరి పట్టణాన్ని ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దడమే మన లక్ష్యం: ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

ప్రజా భూమి ప్రతినిధి వెంకటగిరి.

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరియు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల పిలుపు మేరకు "స్వచ్ఛ ఆంధ్ర - ప్లాస్టిక్ రహిత రాష్ట్రం" సాధనలో భాగంగా వెంకటగిరి పురపాలక సంఘం పరిధిలో శనివారం భారీ అవగాహన కార్యక్రమం జరిగింది.






ఈ కార్యక్రమంలో వెంకటగిరి శాసనసభ్యులు కురుగొండ్ల రామకృష్ణ స్వయంగా పాల్గొని ప్రజలకు, వ్యాపారులకు ప్లాస్టిక్ నిర్మూలనపై దిశానిర్దేశం చేశారు. స్థానిక మార్కెట్ వీధుల్లో పర్యటించిన ఎమ్మెల్యే .. కూరగాయలు, పండ్ల వ్యాపారులతో నేరుగా మాట్లాడారు. వారు వాడుతున్న సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లను పక్కనపెట్టించి, తన వెంట తెచ్చిన జనపనార/గుడ్డ సంచులను వారికి అందజేశారు. ప్లాస్టిక్ కవర్లలో ఆహార పదార్థాలు వదిలేయడం వల్ల వాటిని తిని మూగజీవాలు (ఆవులు) ప్రాణాలు కోల్పోతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

**ప్లాస్టిక్ వద్దు - గుడ్డ సంచే ముద్దు:** ప్రతి ఒక్కరూ మార్కెట్ కు వచ్చేటప్పుడు ఇంటి నుంచే గుడ్డ సంచిని తెచ్చుకోవాలి. ఇకపై మున్సిపాలిటీలో ప్లాస్టిక్ వాడితే జరిమానాలు తప్పవు.

ఇళ్లలో వచ్చే చెత్తను ఎక్కడపడితే అక్కడ రోడ్లపై వేయకూడదు. మున్సిపాలిటీ చెత్త బండ్లకు మాత్రమే చెత్తను అందించాలి.

**ప్రతి 3వ శనివారం ప్లాస్టిక్ ఫ్రీ డే:** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి నెలా 3వ శనివారాన్ని ప్లాస్టిక్ రహిత దినోత్సవంగా పాటించాలి. పెట్రోల్, డీజిల్ ధరలు పెరుగుతున్న నేపథ్యంలో, స్థానిక అవసరాల కోసం కార్లు, బైకులు వాడటం తగ్గించి సైకిళ్లను వినియోగించడం అలవాటు చేసుకోవాలి. దీనివల్ల డబ్బు ఆదా అవ్వడమే కాకుండా ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది. పార్టీ మహానాడు కార్యక్రమాలను సైతం ఇంధన ఆదా కోసమే వర్చువల్ గా నిర్వహించుకుంటున్నామని ఆయన గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, ఏఎంసి చైర్మన్, పట్టణ అధ్యక్షులు, మాజీ ఏఎంసి చైర్మన్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్, మాజీ పట్టణ అధ్యక్షులు, పట్టణ నాయకులు, స్థానిక టీడీపీ నాయకులు మరియు తదితరులు పాల్గొన్నారు. వెంకటగిరిని స్వచ్ఛమైన నియోజకవర్గంగా మార్చేందుకు ప్రజలందరూ అధికారులకు సహకరించాలని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పిలుపునిచ్చారు.

# పెంచిన పెట్రోల్,డీజిల్,గ్యాస్ ధరలు తగ్గించాలి : సి.పి.యం డిమాండ్...

ప్రజా భూమి ప్రతినిధి, గూడూరు,

కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్,గ్యాస్, ధరలు తగ్గించాలని, జిల్లా కమిటి ఇచ్చిన పిలుపు మేరకు శనివారం రోజు సి.పి.యం సి.ఐ.టి.యు ప్రజా సంఘాల నాయకులు,ఆటో కార్మికుల, ఆధ్వర్యంలో గూడూరు పాత బస్టాండ్ వద్ద ఆటోలను మోకులతో లాగుతూ నిరసన ప్రదర్శన చేయడం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కేరళ,తమిళనాడు,బెంగాల్ రాష్ట్రాలలో ఎన్నికలు అయిన వెంటనే పెట్రోల్,డీజిల్,గ్యాస్ ధరలు పెంచారని ఇప్పటికే అనేకసార్లు పెట్రోల్,డీజిల్,గ్యాస్ పెరిగిన ధరలు కారణంగా మొత్తం రావాణా రంగం సంక్షోభం లో కొట్టుమిట్టాడుతున్న సమయంలో కేంద్ర ప్రభుత్వం తాజాగా లీటర్ డీజిల్ పై 3 రూపాయలు పెంచడం వలన రావాణా రంగం డ్రైవర్ల ఉపాధి,రైతులు,చిరు వ్యాపారాలు పై తీవ్ర ప్రభావం పడడంతో పాటు ప్రజల పైన మరింత భారం పడిలి అన్ని రకాల నిత్యవసర సరుకులు ధాన్యం,పప్పులు,ఉప్పులు రావాణా చార్జీలు పెరగడం ప్రజలపై విపరీతమైన భారాలు పడతాయని అన్నారు. పెంచిన పెట్రోల్,డీజిల్,గ్యాస్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో గూడూరు సి.పి.యం శాఖ కార్యదర్శి జోగి.శివకుమార్,సి.ఐ.టి.యు ప్రధాన కార్యదర్శి బి.వి.రమణయ్య,భవన నిర్మాణ సంఘ నాయకులు పుట్టా శంకరయ్య,గండికోట మధు, కె.వి.పి.యస్ అధ్యక్ష, కార్యదర్శులు అడపాల ప్రసాద్, ఏంబేటి చంద్రయ్య,నరసింహులు,నంతానం,ఆటో సంఘం నాయకులు భాస్కర్ రెడ్డి,డేవిడ్,మురళి,తదితరులు పాల్గొన్నారు




# ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఆర్టీసీలో ధర్నా గేట్ మీటింగ్

ప్రజా భూమి ప్రతినిధి, గూడూరు

గూడూరు ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో గూడూరు ఆర్టీసీ డిపో వద్ద గేట్ మీటింగ్ మరియు ధర్నా కార్యక్రమం జరిగింది. గూడూరు డిపో అధ్యక్షులు వై వి నారాయణ, ఎస్.కె జిలాని భాష ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమం లో ఎలక్ట్రికల్ బస్సు లను ప్రవేశ పెట్టి ఆర్టీసీ డిపోలను ప్రవేట్ వారికి అప్పగించే విధానాన్ని మానుకోవాలి అని, అలాగే ఎలక్ట్రిల్ బస్సు లను కూడా ఆర్టీసీ సిబ్బంది ద్వారానే నడపాలని, ఉద్యోగుల డి ఎ, పి అర్ సి బకాయిలు చెల్లించాలని, 2023 నుండి రావాల్సిన పిఆర్సి ఆలస్యం అవుతున్నందున వెంటనే ఐ ఆర్ ప్రకటించి, పిఆర్సి కమీషనర్ నియమించాలని, ప్రభుత్వం మే కొత్త బస్సు లను కొనుగోలు చేసి ప్రయాణికులకు మెరుగైన రవాణా సౌకర్యంలు కలిపించాలని, అన్ని విభాగాలలో కాళీలు భర్తీ చేసుకొనుటకు ఉద్యోగ నియామకాలు చేపట్టాలని రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పి సుబ్రహ్మణ్యం రాజు, డిపో అధ్యక్షులు వై వి నారాయణ మాట్లాడినారు. ఈ ధర్నా కార్యక్రమం లో అధికసంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు.



# ప్రజాభూమి

తిరుపతి,చిత్తూరు 11

ఆదివారం 17 మే 2026


## వైభవోపేతంగా శ్రీ గోవిందరాజస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు

### బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించిన టీటీడీ ఈవో శ్రీ ముద్దాడ రవిచంద్ర.

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి

ఆధ్యాత్మిక శోభ కనిపించేలా ఏర్పాట్లు

మే 27న గరుడ సేవ -- మే 30న రథోత్సవం

తిరుపతి శ్రీ గోవిందరాజస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు మే 23 నుండి 31వ తేదీ వరకు అత్యంత వైభవంగా, మరింత ఆధ్యాత్మిక శోభ కనిపించేలా నిర్వహించనున్న నేపథ్యంలో బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికలను టిటిడి జేఈవో లు వి వీరబ్రహ్మం, డా. ఎ.శరత్, సివిఎస్వో కే వి మురళీకృష్ణ లతో కలిసి టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర శనివారం ఆవిష్కరించారు. తిరుపతిలోని టీటీడీ నివాస గృహంలోని ఈవో ఛాంబర్‌లో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ, శ్రీ గోవిందరాజస్వామివారి బ్రహ్మోత్సవాలు భక్తి, ఆధ్యాత్మికత, సంప్రదాయ వైభవాలకు ప్రతీకగా నిలిచేలా అన్ని శాఖలు సమన్వయంతో విశేష ఏర్పాట్లు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వేసవి దృష్ట్యా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సౌకర్యవంతమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక శోభతో కళ కళ లాడేలా చలువ పందిళ్లు, ఆకర్షణీయమైన విద్యుత్ అలంకరణలు, రంగురంగుల ముగ్గులు, పుష్పాలంకరణలు, వైట్ పెయింటింగ్, సాంప్రదాయ చిత్రకళా అలంకరణలు, ఎల్‌ఈడీ స్క్రీన్లు తదితర ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. మే 22న సాయంత్రం 5.30 గంటల నుండి 8 గంటల వరకు అంకురార్పణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. మే 23న ఉదయం 7.35 గంటల నుండి 8.49 గంటల వరకు మిథున లగ్నంలో ధ్వజారోహణం నిర్వహించనున్నారు. అదే రోజు రాత్రి పెద్దశేష వాహనంపై స్వామివారు భక్తులకు దివ్య దర్శనమివ్వనున్నారు. ప్రతిరోజూ ఉదయం 7 నుండి 9 గంటల వరకు, రాత్రి 7 నుండి 9 గంటల వరకు నిర్వహించనున్న వాహనసేవలు భక్తి పారవశ్యాన్ని పంచనున్నాయి. ముఖ్యంగా మే 27న గరుడవాహన సేవ, మే 30న రథోత్సవం బ్రహ్మోత్సవాలకు ఆకర్షణగా నిలవనున్నాయి.

వాహనసేవల విశేషాలు

24.05.2026 -- ఉదయం చిన్నశేష వాహనం, రాత్రి హంస వాహనం

25.05.2026 -- ఉదయం సింహ వాహనం, రాత్రి ముత్యపుపందిరి వాహనం

26.05.2026 -- ఉదయం కల్పవృక్ష వాహనం, రాత్రి సర్వభూపాల వాహనం

27.05.2026 -- ఉదయం మోహినీ అవతారం, రాత్రి గరుడ వాహనం

28.05.2026 -- ఉదయం హనుమంత వాహనం, రాత్రి గజ వాహనం

29.05.2026 -- ఉదయం సూర్యప్రభ వాహనం, రాత్రి చంద్రప్రభ వాహనం

30.05.2026 -- ఉదయం రథోత్సవం, రాత్రి అశ్వవాహనం

31.05.2026 -- ఉదయం చక్రస్నానం, రాత్రి ధ్వజావరోహణం

బ్రహ్మోత్సవాల సందర్భంగా టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్ట్, దాససాహిత్య ప్రాజెక్టుల ఆధ్వర్యంలో ప్రతిరోజూ ఆధ్యాత్మిక, భక్తి సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో వి.ఆర్. శాంతి, ఏఈవో ఏబీ నారాయణ చౌదరి, ఆలయ అర్చకులు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## తిరుమల శ్రీవారిని దర్శించుకున్న జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్



ప్రజాభూమి ప్రతినిధి తిరుపతి.

శనివారం ఉదయం తిరుమలలో శ్రీ వేంకటేశ్వర స్వామి ని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న కలెక్టర్‌ను దేవస్థానం అధికారులు ఘన స్వాగతం పలికారు. తిరుమల గిరి శిఖరాల మధ్య భక్తుల రద్దీతో కూడిన వాతావరణంలో కలెక్టర్ దర్శనం విశేషంగా నిలిచింది. స్వామి వారిని దర్శించుకున్న అనంతరం యజ్ఞశాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కలెక్టర్ రాష్ట్ర ప్రజల శ్రేయస్సు, అభివృద్ధి కోసం వేంకటేశ్వరుని ఆశీర్వాదం కోరారు. తిరుమలలో కలెక్టర్ దర్శనం జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. భక్తుల మధ్య కలెక్టర్ దర్శనం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆలయ పరిసరాల్లో భక్తులు కలెక్టర్‌ను చూసి ఆనందం వ్యక్తం చేశారు. దేవస్థానం అధికారులు కలెక్టర్‌కు తీర్థప్రసాదాలు అందజేశారు. తిరుమలలో కలెక్టర్ దర్శనం భక్తుల హృదయాలను హత్తుకుంది. జిల్లా ప్రజల కోసం ప్రార్థనలు చేసిన కలెక్టర్ భక్తుల ప్రశంసలు అందుకున్నారు. తిరుమలలో కలెక్టర్ దర్శనం భక్తి, భవ్యం, విశ్వాసానికి ప్రతీకగా నిలిచింది. ఆలయ గోపురాల మధ్య కలెక్టర్ దర్శనం విశిష్టతను సంతరించుకుంది. తిరుమలలో కలెక్టర్ దర్శనం జిల్లా ప్రజలకు ఆధ్యాత్మిక శక్తిని అందించింది. స్వామి వారిని దర్శించుకున్న కలెక్టర్ భక్తి భావంతో మునిగిపోయారు. తిరుమలలో కలెక్టర్ దర్శనం ప్రజలలో విశేష ఆసక్తిని రేకెత్తించింది. ఆలయ పరిసరాల్లో కలెక్టర్ దర్శనం భక్తులలో ఉత్సాహాన్ని నింపింది. తిరుమలలో కలెక్టర్ దర్శనం జిల్లా వ్యాప్తంగా వార్తల్లో నిలిచింది. స్వామి వారిని దర్శించుకున్న కలెక్టర్ ప్రజల శ్రేయస్సు కోసం ప్రార్థనలు చేశారు. తిరుమలలో కలెక్టర్ దర్శనం విశ్వాసానికి ప్రతీకగా నిలిచింది.

## వైసీపీ, కూటమి హోరాహోరీ  మహిళలపై అనుచిత వ్యాఖ్యలపై వైసీపీ ఆందోళన

### టీడీపీ నేత జేబీ శ్రీనివాస్ అనుచరుడిపై ఆరోపణ - గంజాయి కేసులో వైసీపీ కార్యకర్త అరెస్ట్







ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి.

తిరుపతిలో శనివారం రాజకీయ వాతావరణం ఒక్కసారిగా ఉద్రిక్తంగా మారింది. సోషల్ మీడియా పోస్టులు, గంజాయికేసు, పరస్పర ఆరోపణల నేపథ్యంలో వైసీపీ, టీడీపీ శ్రేణులు వేర్వేరుగా ఆందోళనలు చేపట్టాయి. ఒకవైపు మహిళలను కించపరిచే పోస్టులపై చర్యలు తీసుకోవాలని వైసీపీ నాయకులు డిమాండ్ చేయగా, మరోవైపు గంజాయి వ్యవహారంలో వైసీపీ కార్యకర్తల పాత్రపై టీడీపీ నేతలు నిరసన తెలిపారు. ఈ క్రమంలో తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్ పరిసరాల్లో ఇరు పార్టీల కార్యకర్తలు చేరుకోవడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పార్టీ నినాదాలు, పరస్పర విమర్శలతో కొంతసేపు ఉద్రిక్తత కొనసాగింది. పరిస్థితిని అదుపులో ఉంచేందుకు పోలీసులు భారీగా మోహరించారు. అనంతరం ఇరు పార్టీల నేతలు ఫిర్యాదులు ఇచ్చి అక్కడి నుంచి వెళ్లిపోయారు.

మహిళలపై అనుచిత వ్యాఖ్యలు

టీడీపీ నాయకుడు జేబీ శ్రీనివాస్ ముఖ్య అనుచరుడు మాచర్ల రఘురాం సోషల్ మీడియాలో మహిళలను కించపరిచే విధంగా పోస్టులు పెట్టారంటూ వైసీపీ నేతలు తిరుపతిలో ఆందోళన చేపట్టారు. ముఖ్యంగా వైసీపీ మహిళా నాయకులపై అసభ్య పదజాలంతో పోస్టులు, కామెంట్లు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. టీడీపీ నాయకుడు జేబీ శ్రీనివాస్ అనుచరుడు మాచర్ల రఘురాం ఈ పోస్టులకు బాధ్యుడని ఆరోపిస్తూ ఈస్ట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మహిళల గౌరవాన్ని దెబ్బతీసే చర్యలను రాజకీయంగా ఉపయోగించుకోవడం సరికాదని వైసీపీ నేతలు పేర్కొన్నారు. మహిళలపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన వారిపై ఐటీ చట్టాల ప్రకారం కేసులు నమోదు చేయాలని కోరారు. ఈ ఘటనతో సోషల్ మీడియాలో రాజకీయ వేడి మరింత పెరిగింది.

గంజాయి కేసుపై టీడీపీ నిరసన

తిరుపతిలో గంజాయి, మాదకద్రవ్యాల వినియోగం పెరుగుతోందంటూ టీడీపీ నేతలు ఆందోళన నిర్వహించారు. ఇటీవల గంజాయి కేసులో ఓ వైసీపీ కార్యకర్త అరెస్టు కావడం రాజకీయంగా చర్చనీయాంశమైంది. ఈ నేపథ్యంలో నగరంలో మాదకద్రవ్యాల నియంత్రణపై ప్రభుత్వం, పోలీసు శాఖ కఠిన చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. యువతను గంజాయి బారిన పడకుండా కాపాడాలని, తిరుపతిని డ్రగ్స్ రహిత నగరంగా తీర్చిదిద్దాలని నినాదాలు చేశారు. వైసీపీ పాలనలో మాదకద్రవ్యాల అక్రమ రవాణా పెరిగిందని ఆరోపించారు. ఈస్ట్ పోలీస్ స్టేషన్ సమీపంలోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు అనంతరం ఈస్ట్ పోలీస్ స్టేషన్ సీఐకి వినతిపత్రం అందించారు.

ఈస్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలో హై టెన్షన్

పరస్పర ఆందోళనలకు పిలుపునిచ్చిన వైసీపీ, టీడీపీ నేతలు తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్ వద్ద ఎదురుపడటంతో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇరు పార్టీల కార్యకర్తలు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకుని నినాదాలు చేశారు. మహిళలను కించి పరిచిన టిడిపి నాయకుడు పై చర్యలు తీసుకోవాలని వైసిపి నేతలు నినాదాలు చేయగా.. తిరుపతిలో గంజాయి విక్రయిస్తున్న భాను ప్రకాష్ రెడ్డిని అరెస్ట్ చేయాలంటూ, గంజాయి రెడ్డి అంటూ కూటమి నినాదాలు చేశారు. లిఇలా ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటూ కొంతసేపు హడావిడి కొనసాగింది. పరిస్థితి ఉద్రిక్తంగా మారుతుండటంతో పోలీసులు వెంటనే జోక్యం చేసుకుని ఇరు వర్గాలను అదుపు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అదనపు బలగాలను మోహరించారు. అనంతరం ఇరు పార్టీల నేతలు తమ ఫిర్యాదులను పోలీసులకు అందజేశారు. అనుమతి లేకుండా ఆందోళనలు నిర్వహించిన అంశంపై కేసులు నమోదు చేసే దిశగా పోలీసులు పరిశీలిస్తున్నట్లు సమాచారం.

## ప్రభుత్వ ప్రసూతి వైద్యశాల - తిరుపతి

### స్వర్ణ ఆంధ్ర -స్వచ్ఛ ఆంధ్ర -థీమ్ -ప్లాస్టిక్ ఫ్రీ ఆసుపత్రి

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి.

వైద్య పర్యవేక్షకులు- సివిల్ సర్జన్ ఆర్ ఎం ఓ డా ప్రమీలదేవి వైద్య పర్యవేక్షకులు వారు మాట్లాడుతూ తల్లీబిడ్డల ఆరోగ్య పరిరక్షణ, పర్యావరణ సంరక్షణ లక్ష్యంగా ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి, తిరుపతిని ఈరోజు నుండి '100% ప్లాస్టిక్ రహిత ఆసుపత్రి' గా తీసుకొనిరావడానికి అందరి సహకారం అవసరం



అమలు చేస్తున్న ముఖ్య చర్యలు:

1. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ పూర్తి నిషేధం: కవర్లు, వాటర్ బాటిల్స్, ఫుడ్ ప్యాకెట్లు ఆసుపత్రి ఆవరణలో నిషేధం. 2. ప్రత్యామ్నాయ ఏర్పాట్లుగా గుడ్డ సంచులు, క్యాంటీన్‌లో స్టీల్/గాజు సీసాలు, రోగులకు స్టీల్ ప్లేట్లలో భోజనం. 3. అమృత ధార మిల్క్ బ్యాంక్ రక్షణ: పసికందులకు మైక్రోప్లాస్టిక్స్ సోకకుండా, తల్లిపాలను స్టీల్ ఉ గాజు పాత్రలలో మాత్రమే నిల్వ చేయాలని ఆదేశాలు . ఇది లి ఎన్ ఏ బి హెచ్ , డబ్ల్యు హెచ్ ఓ. నిబంధనలు. 4. అవగాహన కార్యక్రమం: ప్రతిరోజు 200 మంది గర్భిణీలకు "ప్లాస్టిక్ ఆరోగ్యకరమైన బిడ్డ" పై కౌన్సిలింగ్. 300 మందికి బాలింతలు వారి సహాయకులకు మరియు సిబ్బందికి ప్రత్యేక శిక్షణ కార్యక్రమం ద్వారా ప్లాస్టిక్ రహితశీ పై ఈరోజు అవగాహనఇవ్వడం జరిగింది. "పుట్టిన బిడ్డ మొదటి శ్వాస స్వచ్ఛంగా ఉండాలి. ప్లాస్టిక్ సీసాలు, కవర్ల నుండి మైక్రోప్లాస్టిక్స్ తల్లిపాలలో కలిసి, బిడ్డ కణంలోని 'శక్తి కేంద్రం' మైటోకాండ్రియాను దెబ్బతీస్తాయి. వైద్యులుగా 'అమృత ధార' ఇవ్వడం మన ధర్మం, ' ఆంధ్రప్రదేశ్‌లో 'ప్లాస్టిక్ రహిత వైద్యం'కు తిరుపతి జిహెచ్ఎం ఆదర్శంగా నిలువాలని అందుకు అందరూ సహకరించండని ప్రజలకు, సిబ్బందికి తెలిపారు ." 'పరిశుభ్రమైన చేతులు ం పరిశుభ్రమైన ఆసుపత్రి = ఆరోగ్యకరమైన బిడ్డ' అని ప్రతి తల్లి తన బిడ్డను పరిశుభ్రమైన చేతులు తో నే తాకాలని,ఇల్లు,, ఇంటి చుట్టూ పరిసరాల పరిశుభ్రత వలన అంటువ్యాధులు నుండి తల్లిని, బిడ్డను కాపాడవచ్చు నని, ఇప్పుడు 'ప్లాస్టిక్ రహిత ఆసుపత్రిగా తీర్చి దిద్దుటకు అందరూ సహకరించవలెనని తెలిపారు ఈరోజు ఈ కార్యక్రమం లో వైద్యులు డా ప్రసన్న ఠాగూర్ బ్లడ్ బ్యాంకు నోడల్ ఆఫీసర్, డా శ్రీనివాసులు ఇ హాస్పిటల్ నోడల్ ఆఫీసర్, డా శ్రీకర్ ఆరోగ్యశ్రీ నోడల్ ఆఫీసర్, డా నిర్మలమ్మ లెక్చరర్ ఇన్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్, నర్సింగ్ సూపరింటెండెంట్ ఇంచార్జి, నర్సింగ్ స్టాఫ్, కౌన్సిలర్లు, సెక్యూరిటీ, శానిటేషన్ సిబ్బంది మరియు గర్భవతులు,తల్లులు వారి సహాయకులు పాల్గొన్నారు.



## నిత్యం ప్రమాదాలకు కేంద్రశీ గా మారిన ఎన్టీఆర్ నగర్ మలుపులో ఉన్న ఇరుకైన వంతెన  కంటైనర్ బోల్తా

ప్రజాభూమి ప్రతినిధి, బుచ్చినాయుడు  కండ్రిగ

తిరుపతి జిల్లా బి.ఎన్. కండ్రిగ మండలంలోని తలారి వెట్టు  పంచాయతీ పరిధిలోని ఎన్టీఆర్ నగర్ మలుపు వద్ద ఉన్న ఇరుకైన వంతెనపై శుక్రవారం రాత్రి భారీ రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. రాత్రి సుమారు 11 గంటల సమయంలో ఎదురెదురుగా వస్తున్న రెండు భారీ వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఒక కంటైనర్ వాహనం ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయే క్రమంలో అదుపుతప్పి వంతెన పక్కకు బోల్తా పడింది. ప్రమాదంలో కంటైనర్ డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ఘటనతో సుమారు గంటపాటు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న స్థానిక సబ్‌ఇన్‌స్పెక్టర్ హరిప్రసాద్ సిబ్బందితో ఘటనాస్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. వాహనాన్ని రహదారి పక్కకు తొలగించి, గాయపడిన డ్రైవర్‌ను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ కేటీ రహదారి చెన్నై నగరానికి అనుసంధానమై ఉండటంతో పాటు శ్రీ సిటీ పరిశ్రమల ప్రాంతానికి ప్రధాన మార్గంగా ఉపయోగపడుతోంది. వేలాది మంది కార్మికులు ప్రతిరోజూ తమ వాహనాలతో ఈ మార్గంలో ప్రయాణిస్తుండటంతో రహదారి ఎప్పుడూ రద్దీగా ఉంటుంది. వంతెన ఇరుకుగా ఉండటం, ప్రమాదకర మలుపు కారణంగా తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదాలను నివారించేందుకు ప్రస్తుతం ఉన్న పాత ఇరుకైన వంతెనను తొలగించి, దాని స్థానంలో విశాలమైన కొత్త వంతెన నిర్మించాలని ప్రజలు వాహన చోదకులు కోరుచున్నారు . అలాగే మలుపు వద్ద వేగనిరోధకాలు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి రహదారి భద్రతా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను కోరుతున్నారు.





## గూడూరులో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత వేసవి విజ్ఞాన శిబిరం



ప్రజా భూమి ప్రతినిధి, గూడూరు,

నెల్లూరు జిల్లా గూడూరు పట్టణం లోని స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత వేసవి వినోద విజ్ఞాన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. విద్యార్థులు తమ వేసవి సెలవులను వృధా చేసుకోకుండా ఉండేందుకు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే ఇంగ్లీష్ స్పీకింగ్ కోర్స్, మ్యాథ్స్, ఓరిగామి, మరియు డ్రాయింగ్ వంటి పలు అంశాలపై శిక్షణ ఇస్తున్నారు. సమాజంలో మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా పోరాడటం, సైన్స్ పట్ల అవగాహన పెంచేందుకు చెకుముకి పరీక్షలు నిర్వహించడం, మరియు చెడు అలవాట్లకు దూరంగా వుండే విధంగా ప్రజలను చైతన్యపరచడం వంటి అనేక సేవా కార్యక్రమాలను జె.వి.వి చేపడుతోందని నిర్వాహకులు తెలిపారు. ఇకపై ప్రతి సంవత్సరం వేసవిలో ఈ కార్యక్రమాన్ని నిరంతరాయంగా కొనసాగిస్తామని పేర్కొన్న ఈ కార్యక్రమంలో జె.వి.వి అధ్యక్షుడు వేగూరు రాజేంద్రప్రసాద్‌తో పాటు చెంచు నారాయణ, వాకాటి రామమోహన్, పురుషోత్తమరావు, సుబ్బారావు, రజినీకాంత్, సుబ్రహ్మణ్యం, శ్రీనివాసాచారి తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 19న  జరిగే జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోండి.

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి

స్వర్ణ ఆంధ్ర 2047 లక్ష్యాలలో ఒకటైన పి4- ( పేదరిక నిర్మూలన) కార్యక్రమం లో భాగంగా బంగారు కుటుంబాల్లో నిరుద్యోగులైన వారి కొరకు అమరరాజ కంపెనీ ఆధ్వర్యంలో ఈ నెల 19న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు నగరపాలక సంస్థ ఇంచార్జి కమిషనర్ శారదా దేవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 19వ తేదీ ఉదయం 9గంటల నుండి జీవకోనలోని విశ్వం స్కూల్ నందు జాబ్ మేళా జరుగుతుందని తెలిపారు. తిరుపతి, చిత్తూరు లోని అమరరాజా కంపెనీల్లో మెషిన్ ఆపరేటరేటింగ్ విభాగంలో 400 ఉద్యోగాలు ఉన్నాయని తెలిపారు. పదవ తరగతి, ఇంటర్మీడియట్, ఐ టి ఐ చేసిన అభ్యర్థులు పాల్గొనవచ్చునని తెలిపారు. ఎంపికైన వారికి 13 నుండి 15 వేల రూపాయలు జీతం ఇస్తారని తెలిపారు. బంగారు కుటుంబాల్లో అర్హులైన వారు జాబ్ మేళా లో పాల్గొన వచ్చునని తెలిపారు. వివరాలు, దరఖాస్తుల కొరకు నగరపాలక సంస్థలోని రాజశేఖర్ 8886747853 ను సంప్రదించాలని తెలిపారు.

## సమాజ భాగస్వామ్యంతో డెంగ్యూపై సమరశంఖం



ప్రజాభూమి ప్రతినిధి, బుచ్చినాయుడు కండ్రిగ

తిరుపతి జిల్లా బి. ఎన్ కండ్రిగ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం అవగాహన సదస్సు, ర్యాలీ ప్రతిజ్ఞ కార్యక్రమాలు నిర్వహించారు. వైద్యాధికారులు డాక్టర్ మురళీధర్ రెడ్డి, డాక్టర్ ఉదయ్ కుమార్, ఆరోగ్య విభాగ అధికారి డి.ఎన్. వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ పరిశీలించండి శుభ్రపరచండి మూతపెట్టండి అనే నినాదంతో ప్రజలు సమాజ భాగస్వామ్యంగా డెంగ్యూ వ్యాధి నియంత్రణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండే గుంతలు, పాత్రలు, ప్లాస్టిక్ కప్పులు, కొబ్బరి చిప్పలు, డ్రములు, కూలర్లు వంటి వాటిని తరచుగా పరిశీలించి శుభ్రం చేయాలని సూచించారు. నీటిని నిల్వ ఉంచే పాత్రలకు తప్పనిసరిగా మూతలు పెట్టుకోవాలని తెలిపారు. దోమలు నిల్వ నీటిలో గుడ్లు పెట్టి, వాటి నుంచి లార్వా, ప్యూపా దశలు దాటి దోమలుగా మారి మనుషులను కుట్టడం ద్వారా డెంగ్యూ వ్యాప్తి చెందుతుందని వివరించారు. డెంగ్యూ బారినపడిన వారికి అధిక జ్వరం, తలనొప్పి, కండరాల నొప్పులు, కళ్ల వెనుక నొప్పి, వాంతులు, అలసట వంటి లక్షణాలు కనిపిస్తాయని తెలిపారు. అలాంటి లక్షణాలు కనిపించిన వెంటనే సమీప ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొందాలని హెచ్చరించారు. నిర్లక్ష్యం చేస్తే ప్రాణాపాయం సంభవించే అవకాశం ఉందన్నారు. ప్రతి శుక్రవారం ఇంట్లో నిల్వ ఉన్న నీటిని పూర్తిగా పారబోసి, పాత్రలను శుభ్రపరచి మళ్లీ తాజా నీటిని నింపుకోవాలని సూచించారు. దీంతో దోమల గుడ్లు, లార్వాలు నశించి దోమల ఉత్పత్తి తగ్గుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో, ఏపీవో, విద్యాశాఖ అధికారులు, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు, గ్రామ సచివాలయ సిబ్బంది, సుధాకర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీసిటీలో చిన్మయ అమృత మహోత్సవ్ వేడుకలు.

### - మానవ విలువలు, సమర్థ నాయకత్వం, భగవద్గీత ప్రాధాన్యతపై స్వామి మిత్రానంద స్ఫూర్తిదాయక ప్రసంగం



ప్రజా భూమి ప్రతినిధి శ్రీ సిటీ.

చిన్మయ మిషన్ స్థాపించి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న "చిన్మయ అమృత మహోత్సవ్" వేడుకలలో భాగంగా శ్రీసిటీలో పలు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో పాల్గొనేందుకు విచ్చేసిన చెన్నైఉ నార్త్ ఈస్ట్ చిన్మయ మిషన్ రెసిడెంట్ ఆచార్యులు స్వామి మిత్రానందకు శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి సాదర స్వాగతం పలికారు. మిత్రానందతో పాటు కొయంబత్తూరులోని చిన్మయ ఇంటర్నేషనల్ రెసిడెన్షియల్ స్కూల్ రెసిడెంట్ డైరెక్టర్ స్వామి అనుకూలానంద, కడప చిన్మయ మిషన్ అధ్యక్షులు స్వామి తురీయానంద, గుంటూరు – విశాఖపట్నం చిన్మయ మిషన్ ఇన్‌చార్జ్ స్వామి సువీరానంద కు ఆయన ఆహ్వానం పలికారు. డా. రవీంద్ర సన్నారెడ్డి తన స్వాగత ప్రసంగంలో దేశ నిర్మాణం, విలువల ఆధారిత విద్య, యువత సాధికారతకు చిన్మయ మిషన్ చేస్తున్న సేవలను ప్రశంసించారు. అమృత యాత్రలో భాగంగా తమిళనాడు నుంచి ఆంధ్రప్రదేశ్‌లోకి ప్రవేశించిన అనంతరం తొలి గమ్యస్థానంగా శ్రీసిటీని ఎంపిక చేసినందుకు స్వామి మిత్రానందకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పరిశ్రమల ప్రతినిధులు, ఉద్యోగులు, విద్యార్థులు, చిన్మయ మిషన్ సభ్యులు సమక్షంలో శ్రీసిటీ బిజినెస్ సెంటర్ లో నిర్వహించిన కార్యక్రమంలో "బ్యాటిల్‌ఫీల్డ్ టు బోర్డ్‌రూమ్" అంశంపై హెచ్. హెచ్. స్వామి మిత్రానంద సరస్వతి ప్రేరణాత్మక ఉపన్యాసం చేశారు. భగవద్గీత బోధనలను ఆధునిక కార్పొరేట్ నాయకత్వంతో అనుసంధానిస్తూ వ్యూహాత్మక స్పష్టత, నైతిక నిర్ణయాలు, భావోద్వేగ సమతుల్యత, సహనశక్తి నేటి వృత్తి జీవితంలో ఎంత ముఖ్యమో వివరించారు. వేదాంత జ్ఞానం వ్యాపార నాయకత్వానికి, వ్యక్తిగత జీవితానికి విలువైన మార్గదర్శకత్వం అందిస్తుందని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న అమృత యాత్ర ముఖ్య ఉద్దేశ్యం మరియు యాత్రా ప్రణాళికను స్వామి అనుకూలానంద సంక్షిప్తంగా వివరించారు. ఆధ్యాత్మికత, జీవిత విలువలు, శ్రీమద్భగవద్గీత సారాన్ని విస్తృతంగా ప్రచారం చేస్తూ ప్రత్యక్షంగా 1.95 లక్షల మందికి పైగా ప్రజలతో అనుసంధానం కావడం ఈ యాత్ర లక్ష్యమని తెలిపారు. స్వామి తురీయానంద భగవద్గీత యొక్క నిత్యజీవిత ప్రాముఖ్యతపై ప్రసంగిస్తూ, ఫలితంపై ఆసక్తి లేకుండా నిజాయితీతో, అంకితభావంతో తన కర్తవ్యాన్ని నిర్వర్తించడం ఎంతో ముఖ్యమని వివరించారు. తమిళనాడు నుంచి ఆంధ్రలో ప్రవేశించిన చిన్మయ అమృత్ యాత్ర వాహనానికి తొలుత చిన్మయ విద్యాలయ సీనియర్ సెకండరీ స్కూల్ యాజమాన్యం, తరువాత బిజినెస్ సెంటర్ వద్ద శ్రీసిటీ కమ్యూనిటీ ఘన స్వాగతం పలికారు. వాహనంలో ఏర్పాటు చేసిన స్వామి చిన్మయానందకు సంబంధించిన పవిత్ర వస్తువులు, జ్ఞాపికలను విద్యార్థులు దర్శించారు. ఈ యాత్ర ద్వారా భారతీయ ఆధ్యాత్మిక వారసత్వంపై విద్యార్థులకు అవగాహన కలిగించడంతో పాటు స్వామి చిన్మయానంద జీవిత స్ఫూర్తిని పరిచయం చేసినట్లు పాఠశాల ప్రిన్సిపాల్  భువనేశ్వరి తెలిపారు.

# ప్రజాభూమి

జనరల్

ఆదివారం, మే 17, 2026




# రైజ్ వేదికగా స్వయం ఉపాధికి ఆసరా

**- శిక్షణ కార్యక్రమాలను పరిశీలించిన కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**

ప్రజాభూమి ప్రతినిధి,విజయవాడ: ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లిలోని రైజ్ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ శనివారం సందర్శించారు. స్వ యం సహాయక సంఘాల మహిళలకు నిర్వహిస్తున్న వివిధ నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాలను పరిశీలించి, మహిళ లతో ముచ్చటించారు.శిక్షణ పొందుతున్న మహిళ లను కలెక్టర్ వారి అనుభవాలు, అభిప్రాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఫ్యాబ్రిక్ పెయిం టింగ్, బ్యూటీషియన్, మ్యాజిక్ వీవ్స్ మెషీన్ శిక్షణ కార్యక్రమాల తీరుతెన్నులను పరిశీ లించి, మహిళలు ఈ అవకాశాలను సద్వినియో గం చేసుకుని ఆర్థికంగా స్వావలంబన సాధించా లని సూచించారు.నైపుణ్యాభివృద్ధి ద్వారా మహిళలు స్వయం ఉపాధి అవకాశాలను పెంపొందించుకోవచ్చని, కుటుం బ ఆర్థిక స్థితిని మెరుగుపరచడంలో ఇటువంటి శిక్షణలు కీలక పాత్ర పోషిస్తాయని కలెక్టర్ పేర్కొన్నారు. అదేవిధంగా సింటిల్లా సంస్థ సహకారంతో నిర్వహిస్తున్న “ఏఐ ఫర్ ష్యూర్” కార్యక్రమాన్ని కూడా కలెక్టర్ పరిశీలించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై మహిళలకు అవగాహన కల్పించడం అభినందనీయమని పేర్కొంటూ, భవిష్యత్ అవసరాలకు అనుగుణం గా డిజిటల్ మరియు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ నైపుణ్యాలను కూడా అభివృద్ధి చేసుకోవాలని మహి ళలకు దిశానిర్దేశం చేశారు.మహిళల సాధికారత, ఉపాధి అవకాశాల విస్తరణ దిశగా ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను మరిం




త సమర్థవంతంగా అమలు చేయాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ లక్ష్మీశ సూచించారు.కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వీ నాంచారరావు పాల్గొన్నారు.

# ముచ్చటైన మ్యూజియం వేడుకలకు తరలిరండి

**- ఈ నెల 18న మ్యూజియం డే సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు**
**- బాపూ మ్యూజియం వేదికగా అలరించనున్న చారిత్రక, వారసత్వ ఉత్సవం**

ప్రజాభూమి ప్రతినిధి,విజయవాడ: ఈ నెల 18న అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవం (International Museum Day) సందర్భంగా పండగలా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించేందుకు పర్యాటక శాఖ, పురావస్తు శాఖ, జిల్లా అధికార యంత్రాంగం.. జిజ్ఞాస ఆర్ట్ వెర్స్, ఇన్‌టాక్, ఆర్టీఐహెచ్ భాగస్వామ్యంతో ఏర్పాట్లు జరుగుతున్నాయి. నగరంలోని బాపూ మ్యూజియంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక కార్యక్రమాలు జరుగుతాయి. ఉదయం 6.30 గంటలకు బాపూ మ్యూజియం నుంచి మొఘల్రాజపురం గుహలు వరకు హెరిటేజ్ వాక్ ఉంటుంది. ఉదయం 10 గంటలకు ప్రారంభోత్సవ కార్యక్రమం ఉంటుం ది. 10.30 గంటల నుంచి ప్రపంచ వ్యాప్తంగా విజయవాడ వారసత్వ ప్రాధాన్యం, మ్యూజి యంలను మరింత ఆకర్షణీయంగా, అనుభూతి పరిచేలా తీర్చిదిద్దడంపై మేధోమధన చర్చలు జరుగుతాయి. 12.30 గంటలకు మా ఇంటి అమూల్య సంపద (ఇంట్లోని పురాతన వస్తువుల ను తీసుకొచ్చి వాటి వెనుక కథలను పంచుకునే ప్రత్యేక పోటీ, 11.30 గంటలకు చిత్రలేఖన పోటీ (హెరిటేజ్ ఆన్ కాన్వాస్)లు వారసత్వం, నదులు, దేవాలయాలు, నా నగర కథలు, భవిష్యత్తు మ్యూజియంల ఊహాచిత్రం అంశాలపై నిర్వహిస్తారు. మధ్యాహ్నం 2 గంటలకు విజయవాడ హెరిటేజ్ క్విజ్ (ఆరేళ్లు, పైబడిన వారికి) ఉంటుంది. ముగ్గురు సభ్యులతో లేదా జట్టుగా నమోదు చేసుకోవచ్చు. అనంతరం ఆంధ్రప్రదేశ్‌లోని వారసత్వ కట్టడాలు, మ్యూజియంలు, వారసత్వంపై ఫొటోగ్రఫీ పోటీ లు ఉంటాయి. రెండు గంటలకు బాపూ మ్యూజియంలోని ఏదైనా ఒక వస్తువును ఆధారంగా తీసుకొని 100 పదాలతో కల్పిత కథ రాయాలి. పాల్గొనే వారికి ప్రత్యేక మార్గదర్శనం ఉంటుంది. రోజంతా బాపూ మ్యూజియంలో ప్రత్యేక గైడెడ్ టూర్లు సందర్శకులకు ఉచితంగా అందు బాటులో ఉంటాయి. లేజర్ షో కూడా నిర్వహిం చబ డుతుంది. ఈ నెల 18వ తేదీ సోమవారం సాయంత్రం ఇందిరాగాంధీ మునిసిపల్



మైదనంలో సంప్రదాయ కళా ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి. ప్రముఖ టాలీవుడ్ గాయకుల సంగీత విభావరి జరుగు తుంది.ప్రతి ఒక్కరూ భాగ స్వాములు కావాలి: కలెక్టర్ డా. జి.లక్ష్మీశఅనుభవజ్ఞులు, యువత, విద్యార్థులు, వివిధ సంస్థలు, జర్నలిస్టులు.. ఇలా ప్రతిఒక్కరూ కార్యక్రమాల్లో భాగస్వా ములై ప్రత్యేక కార్యక్రమాలను విజయవంతం చేయాలని కలెక్టర్ డా. జి.లక్ష్మీశ కోరారు. గౌరవ ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు కూడా ఈ కార్యక్రమాల్లో పాల్గొంటారని.. వారసత్వ సంపదను సంరక్షిస్తూ సంస్కృతిని సజీవంగా నిలిపే జ్ఞాన నిలయాలే మ్యూజియాలని.. గత వైభవాన్ని నేటి తరానికి, నేటి సంస్కృతిని రేపటి తరానికి అనుసంధా నించే వారధులని పేర్కొన్నారు. ఇంతటి విశిష్టత కలిగిన మ్యూజియంల చారిత్రక వారసత్వ ప్రతీకలను భావితరాలకు అందించాలనే ఉద్దేశంతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

# కృష్ణాజిల్లా ఎస్పీ మీరైనా స్పందించండి

**కాలు మాత్రమే విరిగింది... ప్రాణాలు పోయినా ఇంతేనా?**
**బందరు తాలూకా పోలీసుల నిర్లక్ష్యంపై బాధితురాలు నాగమణి ఆవేదన**



మచిలీపట్నం/రూరల్ ప్రజాభూమి ప్రతినిధి అతివేగంగా దూసుకొచ్చిన ఇసుక ట్రాక్టర్ ఢీకొట్టడంతో కాలు విరిగి, లక్షల రూపా యలు అప్పుచేసి ఆపరేషన్ చేయించు కు న్నా.. న్యాయం చేయాల్సిన పోలీసులు కనీ సం పట్టించుకోకపోవడంపై బాధితులు కన్నీరు మున్నీరవుతున్నారు. కాలు మాత్రమే విరిగింది... అదే ప్రాణాలు పోయినా ఇంతేనా? అంటూ బందరు తాలూకా పోలీ సుల పనితీరుపై ప్రమాదానికి గురైన నాగ మణి ఆవేదన వ్యక్తం చేశారు.ఘటన వివరాల్లోకి వెళితే...పోతిరెడ్డిపాలెం గ్రామా నికి చెందిన గోపు మణిరత్నం, నాగమణి దంపతులు బైక్‌పై వెళ్తుండగా, గోపువానిపాలెం రామాలయం టర్నింగ్ వద్ద అతివేగంగా వచ్చిన ఒక ఇసుక ట్రాక్టర్ వీరి బైక్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో భర్త మణిరత్నం స్వల్ప గాయాలతో బయటపడగా, భార్య నాగమణి కాలు తీవ్రంగా విరిగింది.పోలీసుల నిర్లక్ష్యం - బాధితుల ఆక్రందనప్రమాదం జరిగిన వెంటనే వేగంగా దూసుకెళ్లిన ట్రాక్టర్‌పై తాలూకా పోలీసు లకు ఫిర్యాదు చేసినా, వారు కనీసం ప్రాథమిక విచారణ కూడా చేయలేదని బాధితులు ఆరోపి స్తున్నారు. నిరుపేద కుటుంబమైన తాము, అప్పు తెచ్చి లక్ష రూపాయల ఖర్చుతో ఆపరేషన్ చేయిం చు కున్నామని, అయినా పోలీసుల నుంచి ఎలాంటి స్పందన లేదని బాధితురాలు నాగమణి వాపో యారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించిన జనసేన నేత బండి రామకృష్ణప్రమాదంలో గాయపడి ఆపరేషన్ చేయించుకున్న గోపు నాగమణిని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండి రామకృష్ణ పరామర్శించారు. బాధితురాలు తన దీనస్థితిని వివరించి కన్నీటి పర్యంతమవ్వగా, ఆయన సానుభూతి వ్యక్తంచేశారు.భరోసా ఇచ్చిన నేత బాధితురాలికి అధైర్యపడవద్దని ధైర్యం చెప్పారు. తన వంతుగా ఆర్థిక సహాయం అందజేస్తానని హామీ ఇచ్చారు.న్యాయపోరాటం చేస్తాం తక్షణమే పోలీసు ఉన్నతాధికారులతో మాట్లాడి, బాధ్యులైన ట్రాక్టర్ డ్రైవర్/యజమానిపై చర్యలు తీసుకునేలా మరియు బాధితులకు న్యాయం జరిగేలా చూస్తానని స్పష్టం చేశారు.పరామర్శించిన వారిలో...ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు గద్దం రాజు, కూనపురెడ్డి ప్రసాద్, వాలిశెట్టి సత్యనారా యణ, వాలిశెట్టి పోతురాజు, సంకు వాకలరావు, వాలిశెట్టి రాజా, కర్రీ మహేష్, వేముల చక్రి, వడ్డీ చిరంజీవి, రామినాయుడు, మంత్రి పృథ్వి, శ్రీకాంత్, పృథ్వి, పవన్, అడపా యశ్వంత్ మరియు స్థానిక గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మచిలీపట్నం రైతు బజార్‌ను ఆకస్మికంగా సందర్శించిన మంత్రి కొల్లు రవీంద్ర

**విక్రయదారులతో ముఖాముఖి – సమస్యలపై ఆరా**
**కూరగాయలు కొనుగోలు చేసి రైతుల్లో నింపిన ఉత్సాహం**



మచిలీపట్నం/ప్రజాభూమి ప్రతినిధి రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర శనివారం ఉదయం మచిలీప ట్నంలోని రైతు బజార్‌ను సందర్శించారు. ఏపీఎస్‌ఆ ర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావుతో కలిసి ఆయన రైతు బజార్‌లోని వివిధ విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి నేరుగా విక్రయదారులతో ముఖాముఖి మాట్లాడి, వారి సమస్యలు, వ్యాపార పరిస్థితులు మరియు అవసరాలను అడిగి తెలుసుకున్నారు.రైతు బజార్ల బలోపేతానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది మంత్రి రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు. భవిష్యత్తులో రైతు బజార్‌లను మరింత బలోపేతం చేసేందుకు, మౌలిక వసతులు కల్పించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపడతామని ఆయన హామీ ఇచ్చారు.ధరలపై ఆరా మార్కెట్‌లో కూరగాయల ధరలు, రోజువారీ విక్రయాల పరిస్థితి, వినియోగదారుల స్పందన ఎలా ఉందనే అంశాలపై వ్యాపారులతో మంత్రి ఆత్మీయంగా చర్చిం



చారు. రైతులకు ప్రోత్సాహం అనంతరం మంత్రి కొల్లు రవీంద్ర, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావుతో కలిసి రైతు బజార్‌లో స్వయంగా పలు రకాల తాజా కూరగాయలను కొనుగోలు చేశారు. స్థానిక రైతులు పండించిన నాణ్యమైన ఉత్పత్తులనే ప్రజలందరూ కొనుగోలు చేసి, వారిని ప్రోత్స హించాలని ఈ సందర్భంగా మంత్రి పిలుపునిచ్చారు.రైతుల ఆనందంరాష్ట్ర మంత్రి స్వయంగా తమ స్టాళ్ల వద్దకు వచ్చి, సమస్యలు అడిగి తెలుసుకుని, కూరగాయలు కొనుగోలు చేయడంతో రైతు బజార్‌లోని చిన్న వ్యాపారులు, రైతులు హర్షం వ్యక్తం చేశారు.మంత్రి పర్యటనలో ఆయన వెంట క్రింది నాయకులు, అధికారులు పాల్గొన్నారుకుంచె దుర్గాప్రసాద్ (నాని) – మచిలీపట్నం వ్యవ సాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌కొనకళ్ళ నారాయణరావు – ఏపీఎస్‌ఆర్టీసీ చైర్మన్‌పీవీ ఫణి కుమార్ – బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్‌గోపాలరావు – నగర సహాయ మున్సిపల్ కమిషనర్‌గొర్రెపాటి గోపీ చంద్ – జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గుమ్మడి విద్యాసాగర్ – ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మాని టరింగ్ కమిటీ సభ్యుడు టౌన్ పార్టీ అధ్యక్షులు లోగిశెట్టి వెంకటస్వామి, తలారి సోమశేఖర్, కే సుశీల, మురళీ మరియు తదితరులు.

# వైసీపీ నేతలు ఎందుకు పనికిరాని దద్దమ్మలు, సన్యాసులు

**ఐదేళ్లు మూడు ముక్కలాట ఆడి రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారు**

**అమరావతిపై మాట్లాడే అర్హత ఆ 'పోరంబోకులకు లేదు ఏపీ గౌడ కార్పొరేషన్ చైర్మన్ కృష్ణాజిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వీరంకి వెంకట గురుమూర్తి తీవ్ర ఆగ్రహం,గోపు సత్యనారాయణ**



మచిలీపట్నం/ ప్రజాభూమి ప్రతినిధి వైసీపీ నేతలపై ఏపీ గౌడ కార్పొరేషన్ ఛైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి నిప్పులు చెరిగారు. మచిలీ పట్నంలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన వైసీపీ వైఖరిని తీవ్రస్థాయిలో ఎండగడుతూ హాట్ కామెంట్స్ చేశారు. రాష్ట్రాన్ని ఐదేళ్లపాటు వెనక్కి నెట్టేసిన వ్యక్తులకు అమరావతి గురించి మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు.గురుమూర్తి చేసిన వ్యాఖ్యలఅమరావతిపై మాట్లాడే అర్హత లేదు రాజధానిని నాశనం చేసిన ఆ 'పోరంబోకులకు' అసలు అమరావతి గురించి మాట్లాడే అర్హత ఎక్కడిది?మూడు ముక్కలాట వర్సెస్ మూడు ప్రాంతాల అభివృద్ధి: గతంలో జగన్ ఐదేళ్లపాటు మూడు ముక్కలాట ఆడి ప్రజలను వంచించారు. కానీ, నేడు మా కూటమి ప్రభుత్వం మూడు ప్రాంతాల సమగ్ర అభి వృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతోంది.

పనికిరాని సన్యాసులు: వైసీపీ నేతలు ఎందుకు పనికిరాని సన్యాసులు, దద్దమ్మలు అంటూ గురుమూర్తి తీవ్ర పదజాలంతో విమర్శించారు.మళ్లీ తప్పుదారి పట్టిస్తున్నారు మావిగన్' అంటూ సరికొత్త నాటకాలతో ప్రజలను మళ్లీ తప్పుదారి పట్టించేందుకు వైసీపీ కుట్రలు చేస్తోందని మండిపడ్డారు.పరుగులెడుతున్న అభివృద్ధి: మా ప్రభుత్వం పూర్తి జవాబుదారీతనం, బాధ్యతతో పనిచేస్తోంది. ప్రస్తుతం అమరావతిలో రాజధాని పనులు వేగంగా జరుగుతుండటంతో పాటు, మరోపక్క పోలవరం ప్రాజెక్టు పనులను పరుగులు పెట్టిస్తున్నాం.కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్య నేతలు:ఈ సమావేశంలో టీడీపి ప్రధాన కార్యదర్శి గోపి సత్యనారాయణ, మాజీ మున్సిపల్ ఛైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, బత్తిన దాసు, కోస్తా మురళీకృష్ణ మరియు ఇతర ముఖ్య నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## జిల్లాలో శరవేగంగా జలధార – జలహారతి పనులు

**- పరిటాలలో నక్కల వాగు ఫీడర్ ఛానల్ పనులను పరిశీలించి కలెక్టర్ లక్ష్మీశ**



ప్రజాభూమి ప్రతినిధి,విజయవాడ: ప్రభుత్వ అత్యంత ప్రతిష్టాత్మక జలధార – జలహారతి పనులను జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ శనివారం పరిశీలించారు. కంచికచర్ల మండలం పరిటాల గ్రామంలో జరుగుతున్న నక్కల వాగు ఫీడర్ ఛానల్ పనుల పురోగతిని పరిశీలించారు. కంచికచర్ల ప్రధాన చెరువులో నిల్వ అయ్యే నీరు నక్కల వాగు ద్వారా ఇబ్రహీంపట్నం మండ లంలోని చిలుకూరు నక్కల వాగులో కలుస్తుం దని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. అనంతరం ఈ నీరు డిస్ట్రిబ్యూటరీ, ఫీల్డ్ చానల్స్ ద్వారా సాగునీటి అవసరా లకు వినియోగించడం జరుగుతుందని తెలిపారు.

రూ. 2,53,966 అంచ నా వ్యయంతో చేపట్టిన ఈ పనుల ద్వారా భూగర్భ జలాల పెంపుదలతో పాటు సాగునీటి అవసరాలకు గణనీయంగా ఉపయోగం కలుగుతుందని అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా పనుల్లో పాల్గొంటున్న వేజ్ సీకర్స్‌తో కలెక్టర్ ముచ్చటిం చారు. రోజుకు ఎంతమంది పనికి వస్తున్నారు, ఉదయం ఎప్పుడు పనులు ప్రారంభిస్తున్నారు, వేతనాలు సకాలంలో అందుతు న్నాయా అనే విషయాలపై ఆరా తీశారు. ప్రస్తు తం 80 మంది కార్మికులు పనుల్లో పాల్గొంటున్నారని, ఉదయం 5.30 గంటలకే పనులు ప్రారంభిస్తున్నామని, ఏప్రిల్ 15 వరకు వేతనాలు జమయ్యాయని, రోజుకు రూ.300 నుండి రూ.307 వరకు వేతనం అందుతోందని వారు కలెక్టర్‌కు తెలిపారు. పనుల ప్రదేశంలో ఉన్న ముళ్ల పొదలను కూడా తొలగించేలా చర్యలు తీసుకోవా లని కలెక్టర్ అధికారులను ఆదేశిం చారు.ఎన్‌ఎంఎంఎస్ హాజరు విధానం గురించి డ్వామా పీడీ ఎ.రాము కలెక్టర్‌కు వివరించారు. ఉదయం 5.30 గంటలకు, తిరిగి ఉదయం 9.30 గంటలకు రెండు విడతల్లో హాజరు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం కలెక్టర్ కార్మికులకు మజ్జిగ పంపిణీ చేసి, పనుల నిర్వహణపై తగిన సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో డ్వామా పథక సంచాలకులు ఎ. రాము, నందిగామ ఆర్డీవో అనిల్ కుమార్, డీఎల్‌డీఓ లక్ష్మీకుమారి, ఎంపీడీవో డి. వెంకటేశ్వరావు, ఐ/సి ఎంఆర్వో మానస, ఇరిగేషన్ ఏఈ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# అత్యంత పారదర్శకంగా ఇళ్ల జాబితా, ఇళ్ల గణన

**- ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, సెన్సస్ జేడీ జి.ప్రసన్నకుమార్**

ప్రజాభూమి ప్రతినిధి,విజయవాడ: జన గణన - 2027 ప్రక్రియకు సంబంధించి దశల వారీగా ప్రక్రియ అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో జరుగుతోందని కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, సెన్సస్ జేడీ జి.ప్రసన్నకుమార్ అన్నారు.కలెక్టర్ లక్ష్మీశ, జేడీ ప్రసన్నకుమార్ శనివారం కంచికచర్లలో జరుగుతున్న ఇళ్ల జాబితా, ఇళ్ల గణన (హౌస్ లిస్టింగ్, హౌసింగ్ సెన్సస్) ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇంటింటికి వచ్చే సిబ్బందికి సరైన, పూర్తి వివరాలను తప్పనిసరిగా అందించాలని విజ్ఞప్తి చేశారు. అత్యంత కచ్చితత్వంతో దోష రహితంగా డేటాను నమోదు చేయాలని, మార్గదర్శకాల ప్రకారం జనగణన నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. జనగణన అనేది దేశ ప్రగతి, ప్రణాళికా రూపకల్పనకు అత్యంత కీలకమైన ప్రక్రియ అని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే సంక్షేమ పథకాలు, మౌలిక వసతుల అభివృద్ధి, విద్య, వైద్యం, ఉపాధి, గృహ నిర్మాణం వంటి రంగాల్లో భవిష్యత్ కార్యాచరణకు జనగణన గణాంకాలు ఎంతో ఉపయోగప డతాయని తెలిపారు. సెన్సస్ జేడీ జి. ప్రసన్నకుమార్ మాట్లాడుతూ జనగణనలో ప్రతి సమాచారం విలువైనదని, ప్రజల సహకారం తోనే సమగ్ర గణాంకాలు సిద్ధమవు తాయని ఫీల్డ్ స్థాయిలో సిబ్బంది నిబద్ధతతో పనిచేసి నాణ్యమైన డేటా సేకరణకు కృషి చేయాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. కార్యక్రమంలో



వీఎంసీ సెన్సస్ ఇంచార్జ్ వెంకటరమణ, రూరల్ ఇన్‌ఛార్జ్ స్వాతి తదితరులు పాల్గొన్నారు.

# రొయ్యల చెరువుల మోటార్ల దొంగ అరెస్ట్

**13 ఎలక్ట్రికల్ మోటార్లు స్వాధీనం**
**బందరు తాలూకా పోలీసుల మెరుపు నిఘా..**
**ముద్దాయికి 14 రోజుల రిమాండ్**

మచిలీపట్నం/క్రైమ్ ప్రజాభూమి రూరల్ బందరు మండలం పరిధిలోని పలు గ్రామాల్లో రొయ్యల చెరువులపై జరుగుతున్న ఎలక్ట్రికల్ మోటార్ల దొంగతనాలకు బందరు తాలూకా పోలీ సులు అడ్డుకట్ట వేశారు. గుండు పాలెం, కోన, తుమ్మలపాలెం గ్రామాల పరిధిలోని రొయ్యల చెరువులపై వరుసగా ఎలక్ట్రికల్ మోటార్లు దొంగ తనానికి గురవుతుండటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ దొంగత నాలపై కృష్ణా జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు ఆదేశాల మేరకు, మచిలీపట్నం సబ్-డివిజన్ పోలీస్ ఆఫీసర్ జి.శ్రీనివాసరావు సూచనలతో, మచిలీపట్నం రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కె.యేసుబాబు పర్యవేక్షణలో బందరు తాలూకా సబ్ ఇన్స్పెక్టర్లు జి.రమేష్ బాబు, కె.క్రాంతి కుమార్ తమ సిబ్బందితో కలిసి



ప్రత్యేక బృందాలు (టీములు) ఏర్పాటు చేసి నిఘా పెట్టారు.స్కూటీపై వెళ్తూ దొరికిపోయిన దొంగ ఈ నిఘాలో భాగంగా ఈ రోజు అనగా శనివారం (మే 16న) గుండుపాలెం గ్రామ ఊరి బయట స్కూటీ మోటార్ సైకిల్‌పై అనుమానాస్ప దంగా వెళ్తున్న ఒక వ్యక్తిని పోలీసులు అదుపు లోకి తీసుకుని విచారించారు. విచారణ లో అతని వివరాలు బందరు మండలం, తాళ్ళపా లెం పంచాయతీ, కంసాలిపాలెం గ్రామానికి చెందిన గద్దం శ్రీనివాసరావు (38 సంవత్సరాలు, తండ్రి నారాయణ, సామాజిక వర్గం కాపు, డోర్ నెంబర్ 9-112) గా తెలిసింది. నిందితుడు రాత్రి వేళల్లో తన మోటార్ సైకిల్‌పై రొయ్యల చెరువుల వద్దకు వెళ్లి ఎలక్ట్రికల్ మోటార్లను దొంగిలి స్తున్నట్లు పోలీసుల ఎదుట అంగీకరించాడు.13 మోటార్ల స్వాధీనం నిందితుడిని అరెస్ట్ చేసి, అతని వద్ద నుండి పై గ్రామాల్లోని చెరువులపై దొంగిలించిన సుమారు 13 ఎలక్ట్రికల్ మోటార్లను పోలీసులు రికవరీ చేశారు.14 రోజుల రిమాండ్ ముద్దాయిని కోర్టులో ప్రవేశపె ట్టగా న్యాయస్థానం అతనికి ఈ నెల 29వ తేదీ వరకు (14 రోజులు) రిమాండ్ విధించింది. దీంతో పోలీసులు నిందితుడిని మచిలీపట్నం సబ్ జైలుకు తరలించారు.పోలీస్ సిబ్బందికి ఎస్పీ అభినందనలు రొయ్యల చెరువుల రైతులను ఇబ్బంది పెడుతున్న దొంగతనం కేసును అత్యంత వేగంగా ఛేదించి, ముద్దాయిని అదుపులోకి తీసుకుని 100 శాతం మోటార్లను రికవరీ చేసిన సబ్ ఇన్స్పెక్టర్లు జి.రమేష్ బాబు, కె.క్రాంతి కుమార్ మరియు వారి పోలీస్ సిబ్బందిని కృష్ణా జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు ప్రత్యేకంగా అభినందించారు. గ్రామీణ ప్రాంతాల్లో రాత్రి వేళల్లో గస్తీని మరింత ముమ్మరం చేస్తామని రూరల్ పోలీసులు తెలిపారు.

Printed by Published by ANKIREDDYPALLE RAMAMOHAN REDDY on behalf of ANKIREDDYPALLE RAMAMOHAN REDDY , printed at and published at DOOR NO. 19-4-378, S T V NAGAR, NEAR OLD TVS SHOW ROOM, OPPOSITE TIRUPATHI (URBAN) editor ANKIREDDYPALLE RAMAMOHAN REDDY .PRGINo. "APTEL/25/A2316,Phone No. Cell : 9502116677

# కూటమి ప్రభుత్వంలో రైతుల కుటుంబాల్లో ఆనందం

## రూ.5.15 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన మంత్రి నిమ్మల

ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు

రాష్ట్రంలో గత వైసిపి ఐదేళ్ల పాలనలో రైతాంగం కంట కన్నీరు రాగా నేడు కూటమి ప్రభుత్వంలో వారి కుటుంబాల్లో సైతం ఆనందం కనిపిస్తుందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు.పాలకొల్లు నియోజకవర్గంలో అభివృద్ధికి మరింత వేగం తెచ్చేలా శనివారం పాలకొల్లు మండలంలోని పలు గ్రామాల్లో మంత్రి నిమ్మల రామానాయుడు రూ.5.15 కోట్లతో పలు అభివృద్ధి పనులకు కూటమి నాయకులతో కలిసి శంకుస్థాపనలు చేశారు. మండుటెండను లెక్కచేయకుండా పలు గ్రామాల్లో ఎలక్ట్రికల్ మోటార్ సైకిల్‌పై పర్యటిస్తూ ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకున్నారు.పాలకొల్లు మండలంలోని లంకలకోడేరు, దగ్గులూరు, బల్లిపాడు, జొన్నలగరువు, శివదేవుని చిక్కాల, తిల్లపూడి గ్రామాల్లో రూ. 5.15 కోట్లతో పలు అభివృద్ధి పనులకు మంత్రి నిమ్మల రామానాయుడు కూటమి నాయకులతో కలిసి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. లంకలకోడేరు గ్రామంలో రూ. 40 లక్షలతో చినపేట చర్చ్ వద్ద రాపాక ఛానల్ పై సిసి వాల్, పైప్ కల్వర్ట్ నిర్మాణ పనులకు శంఖుస్థాపన, దగ్గులూరు గ్రామ పరిధిలో రూ. 7.60 లక్షలతో యర్రల కోడు మైనర్ డ్రైన్ పై గ్రావెల్ రోడ్ నిర్మాణ పనులకు శంఖుస్థాపన, బల్లిపాడు గ్రామ పరిధి గోపాల స్వామి గుడి సమీపంలో 100.60 లక్షలతో రాపాక ఛానల్ పై సి.సి. వాల్ నిర్మాణ పనులకు శంఖుస్థాపన,శివదేవునిచిక్కాల గ్రామ పరిధిలో జడ్పీ ఉన్నత పాఠశాల సమీపంలో రూ. 49.50 లక్షలతో రాపాక ఛానల్ పైసి.సి. వాల్ నిర్మాణ పనులకు శంఖుస్థాపనలు చేశారు.రూ. 91.80 లక్షలతో త్రాగునీటి పనులు (ఒహెచ్ స్సార్ ) మరియు మైక్రో ఫిల్టర్ ప్రారంభోత్సవం,రూ.22.50 లక్షలతో విలేజ్ హెల్త్ క్లినిక్ ప్రారంభోత్సవం, రూ.44.90 లక్షలతో జొన్నల గరువు బస్ స్టాండ్ సమీపంలో నెంబర్ 2 బ్రాంచ్ ఛానల్ పై గ్రావెల్ రోడ్ నిర్మాణ పనులకు శంఖుస్థాపన, రూ. 55 లక్షలతో జొన్నలగరువు వద్ద త్రాగునీటి పనులు ఓ హెచ్ ఎస్ ఆర్ ప్రారంభోత్సవం,తిళ్ళపూడి రోడ్ ఇటుకల బట్టి సమీపంలో 50 లక్షలతో వంతెన మరియు గ్రావెల్ రోడ్ నిర్మాణ పనులకు శంఖుస్థాపన, తిళ్ళపూడి గ్రామ పరిధిలోని భగ్గేశ్వరం మురుగు కాలువ పై 43.50 లక్షలతో గ్రావెల్ రోడ్ పనులకు శంఖుస్థాపనలు చేసారు. ఈ సందర్భంగా తిల్లపూడి గ్రామంలో జరిగిన బహిరంగ సభలో మంత్రి రామానాయుడు మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన "నా దేశం - నా బాధ్యత" పిలుపు మేరకు తాను కూడా పొదుపును పాటిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ప్రజలందరూ ఇంధన వినియోగాన్ని తగ్గించి, వారానికి ఒక రోజు "నో వెహికల్ డే" పాటించాలని పిలుపునిచ్చారు.కూటమి ప్రభుత్వ 23 నెలల పాలనలో అన్నదాతల కుటుంబాల్లో సంతోషం నెలకొన్నదని మంత్రి పేర్కొన్నారు. "అన్నదాత సుఖీభవ" పథకం కింద 46 లక్షల మంది రైతులకు మూడు విడతలుగా రూ.8,965 కోట్లు అందజేస్తున్నామని వెల్లడించారు.2025-26 రబీ సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా 1,679 ధాన్యం



కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటివరకు 17.47 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామని తెలిపారు. ధాన్యం అమ్మిన 24 గంటల్లోనే 1,67,257 మంది రైతుల ఖాతాల్లో రూ.3,870 కోట్లు జమ చేసి రికార్డు సృష్టించామని అన్నారు.గతంలో రైతులు ధాన్యం అమ్ముకునేందుకు రైస్ మిల్లుల వద్ద రోజులు తరబడి వేచి ఉండాల్సి వచ్చేదని, కానీ ఇప్పుడు ఆ పరిస్థితి పూర్తిగా మారిందన్నారు. గత ప్రభుత్వం రైతులకు చెల్లించాల్సిన రూ.1,640 కోట్ల బకాయిలను కూటమి ప్రభుత్వం చెల్లించినట్లు స్పష్టం చేశారు.వైసీపీ పాలనపై విమర్శలు చేస్తూ, కూల్చడం, విధ్వంసం చేయడమే వారి సంస్కృతి అని మండిపడ్డారు. ప్రజలు అభివృద్ధి దిశగా ఆలోచించి పనిచేసే ప్రభుత్వానికి, నాయకుడిని ఆశీర్వదించి బాధ్యతతో ముందుకు సాగాలని మంత్రి నిమ్మల రామానాయుడు కోరారు. తిల్లపూడి గ్రామ సమగ్ర అభివృద్ధియే లక్ష్యంగా కోట్లాది రూపాయలు నిధులు తీసుకు వస్తున్నానని తెలిపారు. రూ. 5.30 కోట్లతో తిల్లపూడి ప్రధాన రోడ్డును సిమెంట్ రోడ్డు గా అభివృద్ధి, రూ.55 లక్షలతో మంచినీటి పనులు, మరో 50 లక్షలతో బరియల్ గ్రౌండ్, రాపాక పంట కాలువ ప్రక్షాళన పనులు వంటివి చేపట్టనున్నట్లు వివరించారు. పాలకొల్లు నియోజకవర్గాన్ని అభివృద్ధిలో అగ్రస్థానంలో నిలిపేలా నిధులు తీసుకువస్తూ అభివృద్ధి పనులను పరుగులు పెట్టేస్తున్నామని మంత్రి నిమ్మల తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మలను గ్రామస్తుల తరఫున కామిశెట్టి రంగారావు, అయ్యప్ప నాయుడు తదితరులు సత్కరించారు. ఆయనకు గ్రామస్తులు ముఖ్యంగా పెద్ద సంఖ్యలో మహిళలు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్ , ఏఎంసీ చైర్మన్ కోడివిజయభాస్కర్, తిల్ల పూడి సొసైటీ అధ్యక్షులు కామిశెట్టి రంగారావు, కామిశెట్టి అయ్యప్ప నాయుడు, ఇంటి శ్రీరాముడు , నడపన జగపతి, బోడపాటి కాశీ విశ్వనాథం, జడ్పిటిసి నడపన గోవిందా రాజు నాయుడు, నడపన శ్రీనివాస్,మాజీ సర్పంచ్ చొప్పల రజిని, ఎంపీటీసీ ఆకుల ధనలక్ష్మి, మాజీ సర్పంచ్ దిడ్ల మని వజ్రం, పాముల రజిని కుమార్, కలిదిండి రామచంద్ర రాజు, మామిడిశెట్టి పెద్దిరాజు, , పీతల శ్రీను , పెనుమత్స సత్యనారాయణ రాజు, , సాధనాల దుర్గా బాబు , రొక్కలపృథ్వి, బోడపాటి వెంకట్ నారాయణ,, బూత్ కన్వీనర్లు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## మందులు షాపులు బందులను జయప్రదం చేయాలి

### ఈ నెల 20వ తేదీన దేశవ్యాప్త సమ్మెకు మద్దతు

### "కోట" తాసిల్దార్‌కు వినతి పత్రం అందజేత



ప్రజా భూమి ప్రతినిధి-కామవరపుకోట

నకిలీ మందుల అమ్మకాని ప్రభుత్వం నివారించాలి.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నకిలీ మందులు అమ్మకాన్ని నివారించడానికి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ, అఖిల భారత కెమిస్ట్రీల సమైక్య ఈనెల 20వ తేదీన ఆల్ ఇండియా సమ్మెలో భాగంగా మండల కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక మండల తాసిల్దార్ ఎలిసాకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల అసోసియేషన్ అధ్యక్షుడు రుద్రపాక వీరభద్రేశ్వర శర్మ మాట్లాడుతూ కార్పొరేట్ సంస్థలు నిర్వహిస్తున మందుల షాపుల్లో అధిక డిస్కౌంట్లను నిలిపివేయాలని,ఆన్లైన్లో మందుల అమ్మకాలను పూర్తిగా నిలిపివేయాలని, దీని ద్వారా నకిలీ మందుల అమ్మకాలు విపరతంగా పెరగటంతో పాటు, చిన్న తరహా షాపులపై ఆధారపడి జీవనోసాగిస్తున్న అనేక కుటుంబాలు ఆర్థికంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. కనుక ఈనెల 20వ తేదీ బుధవారం మండలంలోని మందులు షాపులు షాపులు బంద్ చేయుటకు నిర్ణయించడమైనదని, కనుక రోగులకు కలిగే అసౌకర్యానికి చింతిస్తూ ప్రతి ఒక్కరు ఈ సమ్మె కు సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మండల అసోసియేషన్ కార్యదర్శి తుట్టగంటి వెంకట సత్యనారాయణ శర్మ, సభ్యులు వి.రాజా, ఉస్సే లక్ష్మీనారాయణ, ఎస్. కుమార్, ఎం. సతీష్, శ్రీనివాసరావు, వేణుగోపాల్ రెడ్డి, నాగ శ్రీమంత్, కే సాయి మణింద్ర, బి. శివ, కమలేంద్ర, ప్రసాద్, రాఘవ, అరవింద్, ఫణి కుమార్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో చేరికలపై అవగాహన కల్పించిన ఎంఈఓ హేబేలు



ప్రజా భూమి ప్రతినిధి-ఆగిరిపల్లి

ఎన్రోల్మెంట్ డ్రైవ్‌లో భాగంగా ఆగిరిపల్లి మండల విద్యాశాఖాధికారి శిలారపు హేబేలు సర్నాల గొల్లగూడెం గ్రామంలో పలువురు తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించాలని అవగాహన కల్పించారు. ప్రభుత్వం అందిస్తున్న నాణ్యమైన విద్య, ఉచిత సౌకర్యాలు, విద్యార్థులకు కల్పిస్తున్న ప్రత్యేక అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు నవోదయ, ఐఐఐటీ వంటి ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల్లో సీట్లు సాధిస్తూ మంచి భవిష్యత్తును నిర్మించుకుంటున్నారని తెలిపారు. ప్రతి తల్లిదండ్రి తమ పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు.

## రొయ్యల దాణా ధరలు పెంచి విక్రయిస్తే రైతులు వెంటనే సంఘాన్ని సంప్రదించాలి

- ధరలు పెంచుతారని రైతులు ఎవరు ఆందోళన చెందవద్దు
- సంఘ అధ్యక్షులు గాంధీ భగవాన్ రాజు

ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు

రొయ్యల దాణా ధరలు పెంచి విక్రయిస్తే రైతులు వెంటనే తమను సంప్రదించాలని జై భారత్ క్షీరా రామ ఆక్వా రైతు సంఘం అధ్యక్షులు గొట్టుముక్కల గాంధీ భగవాన్ రాజు కోరారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు లో ఏర్పాటు చేసిన విలేకర్లు సమావేశం లో శనివారం అయన మాట్లాడారు.రొయ్యల దాణా ధరలు తగ్గించడానికి మంత్రి అచ్చం నాయుడు నేతృత్వంలో ఆక్వా ఫీడ్ కంపెనీలు



యజమానులు, అప్సడ ప్రతినిధులు కలసి చర్చలు జరపాల్సి ఉన్నప్పటికీ మంత్రి రాకపోవడంతో వాయిదా పడిందని గాంధీ రాజు తెలిపారు. ఈ లోపుగా ఎవరైనా రొయ్యల దాణా ధరలు పెంచి విక్రయిస్తే ప్రభుత్వం తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ లోగా రైతులు కూడా ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, పాత ధరలకే కొనుగోలు చేయాలి అని గాంధీ రాజు తెలిపారు. రొయ్యల ప్రాస సింగ్ ప్లాంట్లు యజమానులు ధరలు నిలకడ లేకుండా చేస్తూ కిలోకి రూ.30 తగ్గించి మరీ కొంటున్నారని ఆయన విమర్శించారు. సరైన సీడ్ కూడా సప్లై చేయడం లేదని అన్నారు. ఈ సమస్యలన్నిటిపై రాష్ట్ర కమిటీ త్వరలో అమలాపురంలో గాని మరి ఎక్కడైనా గాని రాష్ట్రస్థాయి కార్యాచరణసమావేశం ఏర్పాటు చేసుకుని తగు నిర్ణయాలు తీసుకుంటామని గాంధీరాజు వెల్లడించారు. సమావేశంలో సంఘ ప్రతినిధులు మేడిది జాన్ డేవిడ్ రాజు, అంగర వరప్రసాద్, వి సత్యనారాయణ రాజు, శ్రీహరి రాజు, చంటి రాజు తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు: మంత్రి పార్థసారధి

ప్రజాభూమి ప్రతినిధి-నూజివీడు



స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా నూజివీడు బాపునగర్‌లో పర్యటించిన రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారధి పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్థానికుల నుంచి డ్రైనేజీ, పారిశుద్ధ్య సమస్యలను తెలుసుకుని దెబ్బతిన్న డ్రైన్లను పరిశీలించిన మంత్రి, ప్రతిరోజూ తడి-పొడి చెత్త సేకరణ, రోడ్లపై చెత్త తొలగింపు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే సంబంధిత సిబ్బందిపై వెంటనే చర్యలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో నూజివీడు సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న, మునిసిపల్ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ, ఫ్లోర్ లీడర్ దుర్గ ప్రసాద్, కె. పీరయ్య తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులు దృష్ట్యా మంచి నీరు సరఫరాకు ప్రజలు సహకరించాలి

### మున్సిపల్ కమిషనర్ బి విజయ సారధి

ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు

నిడదవోలు నరసాపురం ప్రధాన కాలువపై అభివృద్ధి పనులు జరుగుతున్న దృష్ట్యా మంచినీటి సరఫరా విషయంలో ఉదయం పూట ఒక గంట మాత్రమే సరఫరా చేస్తున్నందుకు పట్టణ ప్రజలందరూ సహకరించాలని మున్సిపల్ కమిషనర్ బి విజయ సారధి కోరారు. పాలకొల్లులో



శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం మాట్లాడారు. చెరువులో కేవలం 45 రోజులకు సరిపడా నీరు మాత్రమే ఉన్నదని తెలిపారు. రాబోయే రోజుల్లో అవసరమైతే ఆ గంట కూడా ప్రతి రోజు ఇవ్వకుండా రోజువిడిసి రోజు ఇచ్చే అవకాశం కూడా లేకపోలేదని కమిషనర్ పేర్కొన్నారు. ఈ లోగా మంచినీటి అవసరాలకు మాత్రమే అనగా మంచి నీటిని తాగేందుకు మాత్రమే వినియోగించుకోవాలని కమిషనర్ విజయసారథి పట్ల ప్రజలను కోరారు.

## పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై సీపీఎం ధర్నా




ప్రజా భూమి ప్రతినిధి-ఆగిరిపల్లి

పెట్రోల్, డీజిల్ ధరల పెంపును నిరసిస్తూ ఆగిరిపల్లిలో సీపీఎం పార్టీ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు జిల్లా కార్యవర్గ సభ్యులు డీఎన్‌వీడీ ప్రసాద్, జి రాజు పాల్గొని కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల నిత్యావసర ధరలు పెరిగి సామాన్యులపై భారం పడుతోందన్నారు. ఇటీవల పెంచిన ఇంధన ధరలను వెంటనే తగ్గించాలని నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. ధరల పెంపు ఉపసంహరించకపోతే భవిష్యత్తులో ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల నాయకులు ముత్యాల నరేష్, భాష, సత్తు కోటేశ్వరరావు, చంటి తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ మోటార్ సైకిల్ పై అభివృద్ధి పనుల కోసం అభి పర్యటించిన మంత్రి నిమ్మల



ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, సీఎం చంద్రబాబు నాయుడు, ఇచ్చిన పిలుపుమేరకు ఇందన పొదుపు లో భాగంగా రాష్ట్ర జలవనుర్ల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు కూడా ఇంధన పొదుపు చర్యలు చేపట్టారు. శనివారం నాడు అభివృద్ధి పనులు విషయమై గ్రామాల్లో ఒక విద్యుత్తు మోటార్ సైకిల్ పై పర్యటనలు చేశారు. పలు గ్రామాల్లో రూ 5.05 కోట్ల అభివృద్ధి పనులుకు శంకుస్థాపన కోసం అదే వాహనంపై మండు టెండా ను కూడా లెక్కచేయకుండా తిరిగి నిర్వహించారు. ఆయన వెంట కూటమి నాయకులు,, కార్యకర్తలు, అధికారులు కూడా పాల్గొన్నారు.

## వాసవి క్లబ్ ఆధ్వర్యంలో మజ్జిగ, మంచినీటి చలివేంద్రం ఏర్పాటు

### ప్రారంభించిన వాసవి క్లబ్ గవర్నర్ బోడా వీర్రాజు.

ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట

వేసవి ఎండల తీవ్రత రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో ప్రయాణికులు, పాదచారుల దాహార్తి తీర్చేందుకు అంబేద్కర్ కోనసీమ జిల్లా రావులపాలెంలో వాసవి క్లబ్, హైటెక్ వనిత క్లబ్ ఆధ్వర్యంలో శనివారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. స్థానిక కళా వెంకట్రావు సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన ఈ చలివేంద్రాన్ని వాసవి క్లబ్ గవర్నర్ బోడా వీర్రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా బోడా వీర్రాజు స్వయంగా ప్రయాణికులు, పాదచారులకు చల్లని మజ్జిగ పంపిణీ చేసి సేవా కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ప్రతి రోజూ ఉచితంగా మజ్జిగ, మంచినీళ్లు అందిస్తూ ప్రజలకు ఉపశమనం కలిగిస్తామని వాసవి క్లబ్ అధ్యక్షుడు పులవర్తి గోపాలకృష్ణ, హైటెక్ వనిత క్లబ్ అధ్యక్షురాలు కుసుమంచి ధనశ్రీ సతీష్ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో మన్యం వర్ధనరావు, మన్యం భాను, పచ్చిపులుసు నారాయణమూర్తి, మండవిల్లి నగేష్, మండవిల్లి చిట్టిబాబు, కంకటాల హరి, దొండపాటి మూర్తి, కొల్లేపర నర్సింహామూర్తి, భూర్లే సుబ్బారావు, యలమర్తి రమణ,



వెత్సా దొరబాబు, యలమర్తి గణేష్, మన్యం కామేశ్వరరావు, చిప్పాడా సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు బొక్కా ప్రసాద్, మేడపాటి సత్యనారాయణ రెడ్డి, గోకవరపు పద్మనాభం, తుమ్మలపల్లి గోపాలం, అత్యం లక్ష్మీనారాయణ, కేసవరపు మాణిక్యం, గోకవరపు సుశీల, భూర్ల సత్యతో పాటు అధిక సంఖ్యలో సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రమాదకర మలుపులో గుంతల పూడిక

ప్రజా భూమి ప్రతినిధి-ఆగిరిపల్లి



ఆగిరిపల్లి మండలం నెక్కలం గొల్లగూడెం గ్రామంలోని ఆర్అండ్‌బి రోడ్డుపై ప్రమాదాలకు కారణమవుతున్న మలుపు వద్ద గుంతలను కుశలవ కంపెనీ పూడ్చివేసింది. గుంతల కారణంగా వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటుండటంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు.సమస్యపై స్పందించిన కంపెనీకి సీపీఎం మండల నాయకులు ముత్యాల నరేష్ ధన్యవాదాలు తెలిపారు. అలాగే ఆ ప్రాంతంలో డైరెక్షన్ బోర్డులు ఏర్పాటు చేసి, మరిన్ని భద్రతా చర్యలు తీసుకోవాలని ఆర్అండ్‌బి అధికారులను కోరారు.

# ఉపాధి కూలీల మృతి పై దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన మంత్రి కందుల దుర్గేష్

**ఉపాధి కూలీల మరణవార్త విని తీవ్ర కలత..క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని, మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా**

ప్రజా భూమి ప్రతి నిధి-రాజమహేంద్రవరం

కాకినాడ రూరల్ కొవ్వూరు బ్రిడ్జి సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పొట్టకూటి కోసం పనులకు వెళ్తూ ఉపాధి శ్రామికులు ప్రమాదంలో మృతి చెందడం అత్యంత హృదయవిధారకమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాద వార్త తెలిసిన వెంటనే మంత్రి స్పందించి జిల్లా అధికార యంత్రాంగంతో మాట్లాడి వివరాలు సేకరించారు.మృతుల కుటుంబాలకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ప్రమాద స్థలంలో బాధితులకు తక్షణ సహాయక చర్యలు అందించాలని జిల్లా అధికారులను ఆదేశించారు. అలాగే, ఈ ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులను కాకినాడకి తరలించి, వారికి అత్యంత మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్య అధికారులకు ప్రత్యేక సూచనలు జారీ చేశారు.ఈ ఘోర ప్రమాదం నేపథ్యంలో మంత్రి కందుల దుర్గేష్ భద్రతా ప్రమాణాలపై అధికారులకు కఠిన ఆదేశాలు జారీ చేశారు."పొట్టకూటి కోసం వెళ్ళిన శ్రామికులు ఇలా అనంత లోకాలకు వెళ్ళడం నన్ను తీవ్రంగా కలచివేసింది. ఈ కష్టకాలంలో మృతి చెందిన శ్రామికుల కుటుంబాలకు ప్రభుత్వం



అన్ని విధాలా అండగా ఉంటుంది.ఇకపై పని ప్రదేశాల్లో ఇటువంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా తక్షణమే కఠిన చర్యలు చేపట్టాలి. జాతీయ రహదారులు, బైపాస్ రోడ్ల వెంబడి ఉపాధి పనులు జరిగే చోట వాహనాల వేగాన్ని నియంత్రించేలా ప్రత్యేక వేగ నియంత్రణ బోర్డులను ఏర్పాటు చేయాలి. ముఖ్యంగా ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో కూలీల భద్రత దృష్ట్యా హెచ్చరిక బోర్డులను తప్పనిసరిగా ఉంచాలి."అన్నారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం నుంచి అందాల్సిన అన్ని రకాల సహాయ సహకారాలు త్వరితగతిన అందేలా చూడాలని మంత్రి దుర్గేష్ సందర్భంగా అధికారులకు సూచించారు.

## 20న జరిగే మందుల షాపుల దేశవ్యాప్త బంద్ విజయవంతం చేయాలి

### -పశ్చిమగోదావరి జిల్లా కెమిస్ట్, డ్రగ్గిస్ట్ సంఘం అధ్యక్షుడు టి కృష్ణమూర్తి

ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు



దేశవ్యాప్తంగా ఈనెల 20 వ తేదీన కెమిస్టు మరియు డ్రగ్గిస్ట్ సంఘం ఆధ్వర్యంలో జరిగే మందులు షాపుల బందును మందుల దుకాణాల యజమానులు, సిబ్బంది, ప్రజలు విజయవంతం చేయాలని పశ్చిమగోదావరి జిల్లా సంఘ అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారులుటి కృష్ణమూర్తి, ఏ చలపతి, జివిఆర్ ఫణి కోరారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. అక్రమ ఈ ఫార్మసీలు, భారీ డిస్కౌంట్లు కారణంగా ఐదు కోట్ల మంది ఆధారపడిన కుటుంబాలు జీవనోపాధిని కోల్పోతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్య విషయమై ప్రధానమంత్రి మోడీకి వినతి పత్రం సమర్పించినప్పటికీ ఇంత వరకు ఎటువంటి స్పష్టమైన చర్యలు తీసుకోలేదని తెలిపారు. కోవిడ్ సమయంలో ప్రభుత్వం విడుదల చేసిన 22 జీవోను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పెద్ద కార్పొరేట్ సంస్థల అన్యాయ భారీ డిస్కౌంట్లను అరికట్టేందుకు లెవెల్ ప్లేయింగ్ ఫీల్డ్ విధానాన్ని అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వం మే 20 లోపు స్పష్టమైన డిమాండ్లు పై నిర్ణయం తీసుకోకపోతే నిరవధిక ఆందోళన పెడతామని పశ్చిమగోదావరి జిల్లా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ తెలిపారు. ఈ సమావేశంలో పశ్చిమగోదావరి జిల్లా సంఘ నాయకులు, పాలకొల్లుకు చెందిన అసోసియేషన్ ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# కొవ్వూరు ప్రభుత్వ హాస్పిటల్‌ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్

## రోగులకు మెరుగైన వైద్య సేవలు, పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి : కలెక్టర్ కీర్తి చేకూరి

**ప్రజాభూమి ప్రతినిధి-తాళ్లపూడి**

కొవ్వూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను శనివారం జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న వైద్యులు, పీజీ సీనియర్ వైద్య విద్యార్థులతో మాట్లాడి వైద్య సేవల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియా వారితో మాట్లాడడం జరిగింది. అదే సమయంలో వైద్య సేవల కోసం వచ్చిన రోగులు, గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల తల్లిదండ్రులతో మాట్లాడి ఆసుపత్రిలో అందుతున్న సదుపాయాలపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. వైద్య సేవలు అందించే విధానం, పరిశుభ్రత నిర్వహణ సంతృప్తికరంగా ఉన్నట్లు తన పరిశీలనలో గుర్తించినట్లు కలెక్టర్ తెలిపారు. అయితే అక్కడక్కడ కొన్ని



లోపాలు గుర్తించామని పేర్కొన్నారు. ఇన్‌పేషెంట్లకు సహాయకులుగా వచ్చే వారి కోసం ఖాళీగా ఉన్న గదులను కేటాయించాలని అధికారులకు ఆదేశించినట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన పనులను రెండు వారాల్లో పూర్తి చేయాలని సూచించారు. వైద్య పరీక్షలు, ఎక్స్‌రే సేవల నిర్వహణపై కూడా కలెక్టర్ సమీక్షించారు. కొంతమంది అవసరం లేకపోయినా ఎక్స్‌రే తీస్తేనే ప్రయోజనం ఉంటుందనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఎక్స్‌రే అనేది రేడియేషన్‌తో కూడుకున్నదని, కేవలం వైద్యుల సూచన మేరకు అవసరమైన క్రిటికల్ కేసులలో మాత్రమే ఎక్స్‌రేలు చేయాలని స్పష్టం చేశారు. రోగి ఆరోగ్య పరిస్థితిని బట్టి మాత్రమే వైద్యులు నిర్ణయం తీసుకుంటారని కలెక్టర్ పేర్కొన్నారు. ఆసుపత్రిలో టిబి పరీక్షలు కూడా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. టిబి లక్షణాలు గుర్తించిన వారు వైద్యుల సూచన మేరకు మందులు వాడితే పూర్తిగా కోలుకునే అవకాశం ఉందన్నారు. అదేవిధంగా ఇతర రక్త పరీక్షలు నిర్వహించి వాటి ఫలితాలను కూడా అందజేస్తున్నట్లు తెలిపారు. ఆసుపత్రి సందర్శనలో భాగంగా వైద్య సేవల కోసం వచ్చే వారికి అందుతున్న సేవల వివరాలు, వారితో పాటు వచ్చే సహాయకుల పరిస్థితులపై కూడా కలెక్టర్ ఆరా తీశారు. ఆసుపత్రి సందర్శనలో భాగంగా రికార్డుల నిర్వహణ, యాప్‌లలో నమోదు ప్రక్రియ, మందుల సరఫరా, ఔషధాల నిల్వలు, శానిటేషన్ నిర్వహణ తదితర అంశాలను కలెక్టర్ కీర్తి చేకూరి పరిశీలించారు. అలాగే వివిధ వార్డులను సందర్శించి అక్కడ అందుతున్న వైద్య సేవల వివరాలను తెలుసుకున్నారు. డ్యూటీలో ఉన్న వైద్యులు, నర్సింగ్ సిబ్బంది హాజరు, సేవల నిర్వహణ విధానం వంటి అంశాలను వ్యక్తిగతంగా పరిశీలించి సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డీసీహెచ్‌ఎస్ డా. ఎం. పద్మ, తహసీల్దార్ డి. దుర్గా ప్రసాద్, ఇతర వైద్య అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఈనెల 20న మెడికల్ షాపుల బంద్



**ప్రజాభూమి ప్రతినిధి-తాళ్లపూడి**

ఆన్‌లైన్‌లో మందుల అమ్మకాలు, నకిలీ మం దుల చెలామణి, కార్పొరేట్ సంస్థల అనైతిక మందుల వ్యాపారాలకు వ్యతిరేకంగా ఈనెల 20వ తేదీన ఆల్ ఇండియా మెడికల్ షాప్స్ బంద్‌కు పిలుపునిచ్చారు. ఈ మేరకు పోలీస్, రెవెన్యూ, హెల్త్ డిపార్ట్‌మెంట్ అధికారులకు సమాచారం అందించారు. తూర్పు గోదావరి జిల్లా డ్రాగ్ ట్రేడ్ వెల్ఫేర్ అసోసియేషన్ ట్రెజరర్ పిండి గణపతి ఆధ్వర్యంలో తాళ్లపూడి మందుల వర్తకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆన్‌లైన్ విక్రయాల వల్ల మెడికల్ షాపులకు నష్టం జరుగుతోందని, నకిలీ మందుల వల్ల ప్రజల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లుతోందని వర్తకులు ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేట్ సంస్థలు నిబంధనలకు విరుద్ధంగా మందుల వ్యాపారం చేస్తున్నాయని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ బంద్‌కు జిల్లా వ్యాప్తంగా మెడికల్ షాపుల యజమానులు సంఘీభావం తెలిపారు.

### రోడ్డు ప్రమాదంలో ఉపాధి శ్రామికుల మృతి బాధాకరం
### బాధిత కుటుంబాలను అనేవిదాలా ఆదుకుంటాం
### కాకినాడ ఎంపీ ఉదయ్ శ్రీనివాస్

**ప్రజా భూమి ప్రతినిధి-కాకినాడ**

కాకినాడ రూరల్ మండలం, కొవ్వూరు వద్ద బైపాస్ రోడ్‌లో శనివారం ఉదయం టిప్పర్ లారీ ఢీ కొట్టిన ఘటనలో నలుగురు మహిళ ఉపాధి శ్రామికులు మృతి చెందడం బాధాకరమని, మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానని కాకినాడ ఎంపీ తంగెళ్ళ ఉదయ్ శ్రీనివాస్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ పొట్టకూటి కోసం ఉపాధి పనులకు వెళ్లిన నిరుపేద కుటుంబాలకు చెందిన మహిళలు లారీ డ్రైవర్ నిర్లక్ష్యంతో మృత్యువాత పడడం విచారకరమన్నారు, ఇదే ప్రమాదంలో తీవ్ర గాయాలతో ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న మరో ఇద్దరు ఉపాధి శ్రామికులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించడం జరిగిందన్నారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వపరంగా అన్ని విధాల ఆదుకుంటామని ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ తెలిపారు.

### స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కోసం ప్రజలు సహకరించాలి



**ప్రజాభూమి ప్రతినిధి-తాళ్లపూడి**

స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల వద్ద పరిసరాల పరిశుభ్రతపై ప్రజలచే ప్రతిజ్ఞ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా అన్నదేవరపేట సచివాలయం వద్ద కార్యదర్శి శ్రీనివాస్ మాట్లాడుతూ పరిశుభ్రమైన ఆంధ్రప్రదేశ్ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ప్రతి పౌరుడి కర్తవ్యమని తెలిపారు. ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన పెంపొందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. పరిసరాల పరిశుభ్రత కోసం ప్రజలు చెత్తను డంపింగ్ యార్డ్కు తరలించే విధంగా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.

# రావిమెట్ల హనుమాన్ జయంతి ఉత్సవాల్లో మంత్రి కందుల దుర్గేష్

## స్వామివారి 19వ వార్షికోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహణ

**ప్రజా భూమి ప్రతినిధి-నిడదవోలు**

నిడదవోలు నియోజకవర్గం నిడదవోలు రూరల్ మండలం రావిమెట్ల గ్రామంలో శ్రీ హనుమాన్ జయంతి ఉత్సవాలు శనివారం అత్యంత వైభవంగా జరిగాయి. స్వామివారి 19వ వార్షికోత్సవ వేడుకలకురాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా హాజరై భక్తిశ్రద్ధలతో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు, అర్చకులు మంత్రి కందుల దుర్గేష్ కి సాదర స్వాగతం పలికారు. పూజా కార్యక్రమాల అనంతరం ఆలయ కమిటీ ప్రతినిధులు మంత్రికి ప్రసిద్ధ క్షేత్రమైన కోటసత్తెమ్మ తల్లి అమ్మవారి చిత్రపటాన్ని, స్వామివారి తీర్థప్రసాదాలను అత్యంత గౌరవంతో బహూకరించారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. "నిరంతరం రామనామ స్మరణతో భక్తులను అనుగ్రహించే ఆంజనేయ స్వామి వారి జయంతి మహోత్సవాల్లో పాల్గొనడం నా పూర్వజన్మ సుకృతం. ధైర్యానికి, భక్తికి, నిస్వార్థ సేవకు మారుపేరు హనుమంతుడు. ఆ స్వామి వారి అనుగ్రహం ఉంటే ఎలాంటి కష్టాలైనా తొలగిపోతాయి. రావిమెట్ల గ్రామంలో గత 19 ఏళ్ళగా ఇంత వైభవంగా హనుమాన్ జయంతి



ఉత్సవాలు నిర్వహించడం అభినందనీయం. ఆ కంటికి రెప్పలా కాపాడే వీరాంజనేయుడు, కోటసత్తెమ్మ తల్లి ఆశీస్సులు మన నియోజకవర్గ ప్రజల పైన, రాష్ట్ర ప్రజల పైన ఎల్లప్పుడూ ఉండాలని, అందరి జీవితాల్లో ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు నిండాలని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తున్నాను."ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ఆలయ కమిటీ నిర్వాహకులు, గ్రామ పెద్దలు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఉండ్రాజవరం మండలం చిలకపాడు గ్రామ జనసేన పార్టీ అధ్యక్షులు గోడే రమేష్ సోదరి ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారని తెలిసి వారి నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని పరామర్శించారు.

# రేఖపల్లిలో జాతీయ డెంగ్యూ దినోత్సవంపై అవగాహనా ర్యాలీ

**ప్రజాభూమి ప్రతినిధి-వి.ఆర్.పురం.**

మండలంలోని రేఖపల్లి ప్రాథమిక ఆరోగ్యం కేంద్రంలోనీ డాక్టర్ నీలు ఫర్ ఆధ్వర్యంలో జాతీయ డెంగ్యూ దినోత్సవం (నేషనల్ డెంగ్యూ డే ) సందర్భంగా పీహెచ్సీ నుండి రేఖపల్లి జంక్షన్ వరకు శనివారం డెంగ్యూ ర్యాలీ నిర్వహించారు. జరిగిన ఈ ర్యాలీ లో భాగంగా, చిన్న దోమలు -పెను ప్రమాదం, దోమతేరా కట్టు- దోమ పట్టు, వేపాకు పొగ -దోమలకు సెగ, డెంగ్యూ నివారణ -మనందరి భాద్యత, నీటి నిల్వలు -దోమలకు పుట్టినిల్లు అని నినాదాలు చేసి మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నీలు



ఫర్ మాట్లాడుతా ప్రతి గ్రామంలో, సచివాలయం పరిధిలో మురికి గుంటలు పుడ్చాలి, నీరు నిల్వలు లేకుండా చూడాలి, అలాగే వెస్ట్ వస్తువులు గ్లాస్లు, కొబ్బరి బొండాలు, టైర్లు ను కాల్చి వేయాలి, కూలర్లు ఫుల కుండీ లో నీరు నిల్వ లేకుండా చూడాలి, పంచాయతీ సిబ్బంది తో ఏంటి లార్వా ఆపరేషన్ చేయించాలి, అందరు దోమ తెరలు కట్టుకోవాలి దోమల నుండి రక్షణ పొందండి, పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరు ప్రతి ఇంట్లో పాటించాలి, వర్షం కాలం వస్తుంది కావున డెంగ్యూ, మలేరియా కేసులు పెరిగే అవకాశం వుంది కావున అందరు అలెర్ట్ గా ఉండాలి అని తెలిపారు. అలాగే హాస్పిటల్ నందు కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ యూ ఓ సమ్మయ్య, ఏ ఎన్ ఎం చంద్రమ్మ, సి హెచ్ ఓ లు మంగ, అనూష, హెచ్ ఏ లు శ్రీనివాస్, రత్తయ్య, సత్యనారాయణ, సతీష్, ఆశలు తదితరులు పాల్గొన్నారు.

# విలేకరి బోగిశెట్టి ని పరామర్శించిన పాత్రికేయ మిత్రులు

## పరామర్శించిన వారిలో విజయవాడ సెంట్రల్ అడిషనల్ ఎస్పీ ఎంబీఏ మురళీకృష్ణ.

**ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట.**

ఇటీవల అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందిన అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న విలేకరి భోగిశెట్టి నాగేశ్వరరావును శనివారం సీనియర్ పాత్రికేయులు, ప్రముఖ రచయిత భోగాది వెంకటరాయుడు, విజయవాడ సెంట్రల్ అడిషనల్ ఎస్పీ ఎంబీఏ మురళీకృష్ణ పరామర్శించారు. ఈ సందర్భంగా వారు



నాగేశ్వరరావు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ, కుటుంబ సభ్యులతో కూడా మాట్లాడారు. పాత్రికేయ రంగంలో నాగేశ్వరరావు అందిస్తున్న సేవలను అభినందించిన వారు, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. పాత్రికేయ సహచరులు, స్నేహితులు మాట్లాడుతూ వార్తలు రాయడంలో ఆయనకున్న ప్రత్యేకతను గుర్తు చేస్తూ నాగేశ్వరరావు త్వరగా కోలుకుని మళ్లీ తన సేవలను కొనసాగించాలని ఆకాంక్షిస్తున్నారు.

# పార్టీ బలోపేతమే లక్ష్యం

### జిల్లా అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి

**ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట.**

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గం రావులపాలెం మండలంలోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో శనివారం జిల్లా అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి రాష్ట్ర కార్యదర్శులతో (పార్లమెంట్) కీలక సమావేశం నిర్వహించారు. పార్టీ బలోపేతం, డిజిటలైజేషన్ కార్యక్రమాలు, వెరిఫికేషన్ ప్రక్రియలను మరింత పారదర్శకంగా, వేగవంతంగా అమలు చేసే అంశాలపై సమావేశంలో సవివరంగా చర్చించారు. ఈ సందర్భంగా చిర్ల జగ్గిరెడ్డి మాట్లాడుతూ పార్టీ శ్రేణులు గ్రామస్థాయి నుంచి సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రతి కార్యకర్తకు పార్టీ కార్యక్రమాలు చేరేలా ఆధునిక సాంకేతిక విధానాలను వినియోగించాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ వైఫల్యాలు, పార్టీ భవిష్యత్ కార్యాచరణపై కూడా సమావేశంలో చర్చించినట్లు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుందని స్పష్టం చేశారు. రాష్ట్ర నాయకత్వం సూచించిన దిశగా ప్రతి నాయకుడు, కార్యకర్త సమిష్టిగా కృషి చేసి పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.

# లారీ ఢీ - నలుగురు రహదారిపై నలుగురు మహిళా కూలీల దుర్మరణం

- కాకినాడ రూరల్ నియోజకవర్గంలో దారుణం
- కొవ్వూరు బ్రిడ్జి సమీపంలో ఘోర ప్రమాదం - మరో ఇద్దరి పరిస్థితి విషమం
- ప్రభుత్వం నుండి రూ. 4 లక్షల పరిహారం, పూర్తి వైద్య సాయం: పవన్ కళ్యాణ్
- లక్ష రూపాయల తక్షణ సొంత సహాయం ప్రకటించిన ఎమ్మెల్యే పంతం నానాజీ

**ప్రజాభూమి బ్యూరో - కాకినాడ**

రెక్కాడితే గాని డొక్కాడని ఆ పేద కుటుంబాల్లో ఉదయాన్నే ఉపాధి పనుల కోసం బయలుదేరిన శ్రామికులను మృత్యువు లారీ రూపంలో ముంచేసింది. కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం చీడిగ గ్రామ పరిధిలోని కొవ్వూరు బ్రిడ్జి సమీపంలో శనివారం ఉదయం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం తీవ్ర విషాదాన్ని నింపింది. కూలి పనుల నిమిత్తం రోడ్డు దాటుతున్న ఉపాధి హామీ మహిళా కూలీలను ఒక టిప్పర్ లారీ అతి వేగంగా వచ్చి బలంగా ఢీకొట్టింది. ఈ దారుణ సంఘటనలో చీడిగ గ్రామానికి చెందిన నలుగురు మహిళా శ్రామికులు శరీరాలు ఛిద్రమై అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో లారీ మహిళలను బలంగా ఢీకొట్టి, రోడ్డు పక్కన ఉన్న రక్షణ గోడ వైపునకు నెట్టేయడంతో ప్రమాద తీవ్రత పెరిగింది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే స్పందించి సహాయక చర్యలు చేపట్టారు. తీవ్రంగా గాయపడిన ఇద్దరు మహిళలను చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించగా, వారి పరిస్థితి ఇంకా అత్యంత విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘోర ప్రమాదంపై ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాద వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్న ఆయన, బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పెంచిన పరిహారం ప్రకారం, మృతి చెందిన శ్రామికుల కుటుంబాలకు రూ. 4 లక్షల ఆర్థిక సాయాన్ని త్వరితగతిన అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం తరపున అందించే రూ. 2 లక్షలతో పాటు, కేంద్ర ప్రభుత్వ బీమా పథకాలైన సురక్ష యోజన, జీవన్ జ్యోతి యోజన కింద వచ్చే బీమా మొత్తాన్ని కలిపి లబ్ధిదారులకు అందజేయనున్నారు. అలాగే, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులకు మెరుగైన,







నాణ్యమైన వైద్యం అందించాలని కాకినాడ జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాల నివారణకు రహదారుల వెంబడి, ముఖ్యంగా వాహనాలు వేగంగా వచ్చే బైపాస్ రోడ్లు, జాతీయ రహదారుల పక్కన ఉపాధి పనులు జరుగుతున్న సమయంలో వేగ నియంత్రణకు స్పష్టమైన హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని అధికారులకు స్పష్టం చేశారు.

మరోవైపు ఉపాధి శ్రామికుల మరణం తీవ్ర విచారకరమని, ఈ ఘటన తనను ఎంతగానో కలచివేసిందని కాకినాడ రూరల్ శాసనసభ్యుడు పంతం నానాజీ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదం జరిగిన వెంటనే స్పందించిన ఆయన, బాధిత కుటుంబాల అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం తన సొంత నిధుల నుండి తక్షణ సహాయంగా ప్రాణనష్టం జరిగిన ప్రతి కుటుంబానికి లక్ష రూపాయల చొప్పున ఆర్థిక సహాయాన్ని తన కుమారుని ద్వారా అందజేస్తున్నట్లు ప్రకటించి తమ మానవత్వాన్ని చాటుకున్నారు. ఒకే గ్రామానికి చెందిన నలుగురు శ్రామిక మహిళలు మృతి చెందడంతో చీడిగ గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

**విచ్చలవిడి మద్యం విక్రయాలే**

ఈ దారుణానికి కారణం బాధితులను పరామర్శించిన మాజీ మంత్రి కురసాల కన్నబాబు ప్రమాదానికి డ్రైవర్ మద్యం మత్తులో ఉండటమే కారణమని ప్రత్యక్ష సాక్షులు, స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తెల్లవారుజామునే తప్పతాగి లారీ నడపడం వల్లే ఈ ఘోరం జరిగిందని, విచ్చలవిడిగా సాగుతున్న మద్యం విక్రయాలే ఈ అనర్థానికి మూలమని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మృతి చెందిన వారంతా బీసీ, ఎస్సీ వర్గాలకు చెందిన అత్యంత పేద కుటుంబాల వారు కావడం గమనార్హం. ఈ దురదృష్టకర సంఘటన గురించి సమాచారం అందిన వెంటనే మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి విశాఖపట్నం, విజయనగరం జిల్లాల రీజినల్ కో-ఆర్డినేటర్ కురసాల కన్నబాబు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. స్థానిక పార్టీ నాయకులు సమాచారం అందించిన వెంటనే ఆయన హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అనంతరం కాకినాడ జనరల్ ఆసుపత్రి మార్చురీ వద్దకు చేరుకుని, మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రి వార్డులో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించి, వారి బంధువులకు ధైర్యం చెప్పారు. బాధితుల పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలపడంతో, వారికి అత్యంత మెరుగైన వైద్య సేవలు అందించాలని కన్నబాబు డాక్టర్లను కోరారు. ఈ మొత్తం వ్యవహారాన్ని, ప్రమాద తీవ్రతను మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్సీపీ అధ్యక్షులు వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లినట్లు కన్నబాబు వెల్లడించారు. ప్రభుత్వం ఈ ఘటనపై తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. మరణించిన నిరుపేద మహిళా కూలీల కుటుంబాలకు రూ. 25 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా, అలాగే తీవ్రంగా గాయపడిన క్షతగాత్రులకు రూ. 5 లక్షల చొప్పున నష్టపరిహారం అందించి ప్రభుత్వం ఆదుకోవాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున ఆయన గట్టిగా డిమాండ్ చేశారు. ఈ పరామర్శ కార్యక్రమంలో కన్నబాబుతో పాటు వైఎస్సార్సీపీ జిల్లా జనరల్ సెక్రటరీ కొప్పిశెట్టి గణేష్, ఇతర ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**జిల్లా ఇంచార్జి మంత్రి పొంగూరు నారాయణ తీవ్ర దిగ్భ్రాంతి**

కాకినాడ జిల్లాలో చోటుచేసుకున్న ఘోర రోడ్డు ప్రమాదంపై రాష్ట్ర మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి, జిల్లా ఇంచార్జి మంత్రి పొంగూరు నారాయణ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పొట్టకూటి కోసం పనులకు వెళ్తున్న నలుగురు మహిళా కూలీలు ఈ ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందడం అత్యంత బాధాకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

**దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన మాజీ సీఎం వైఎస్ జగన్..!**

ప్రమాదంలో పలువురు ఉపాధి కూలీలు మృతిచెందడం బాధాకరమని మాజీ సీఎం వైఎస్ జగన్ ఒక ప్రకటనలో తన సంతాపాన్ని వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.